తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం 15.11.2025 | సంపుటి : 12 సంచిక : 115 | పేజీలు : 12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370
హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698




అప్పుడూ.. ఇప్పుడూ..

# జనంసాక్షి సర్వే ఎల్లప్పుడూ..

ఎన్నికల ప్రవాహంలో సర్వేలు చేసి, ప్రలోభాల బారినపడి కనుమరుగైన సంస్థలు కోకొల్లలు. గాలివాటంతో ప్రకటించి అభాసుపాలైనవారూ ఎందరో..! ఒకట్రెండుసార్లు ఆదరణ పొంది ఆ తర్వాత బొక్కాబోర్లా పడ్డ మరెందరో..!! కానీ నాడూ నేడూ ఓటరు నాడీని సమగ్రంగా పట్టుకుని, రాజకీయ సందిగ్ధంలోనూ నిటారుగా నిల్చున్న ఏకైక సంస్థ జనంసాక్షి. ఎన్నిక ఏదైనా, ప్రభుత్వంలో ఉన్నది ఎవరైనా.. ప్రజలతో పంచుకున్నది, ఓటర్లతో విన్నదీ కన్నదీ నిష్పక్షపాతం గా వెల్లడిస్తూ గత ఎనిమిదేళ్లుగా అప్రతిహత విజయాలతో దూసు కుపోతున్న ఒకే ఒక్క సంస్థ 'జనంసాక్షి'. తెలంగాణలో ముందస్తు ఎన్నిక మొదలు ఇప్పటిదాకా ఎన్నో సందర్భాల్లో సర్వేలు చేసి తుది ఫలితాలకు అద్దంపట్టేలా ఉన్నది ఉన్నట్టు ప్రకటించింది. రాష్ట్రమే కాదు.. జాతీయ స్థాయి నేతలు సైతం 'జనంసాక్షి' సర్వేల పట్ల ఆసక్తిగా ఎదురుచూస్తు న్నారంటే అందుకు శాస్త్రీయ పద్ధతుల్లో కొనసాగుతున్న విధానమే కారణం..!

## పార్టీ ఏదైనా పోలింగ్ కంటే ముందే సాహసోపేత ప్రకటన

### జూబ్లీహిల్స్‌లోనూ సర్వేలన్నీ ఒకవైపు.. జనంసాక్షి మాత్రమే ఇంకోవైపు..




- ఎన్నికలు ఏవైనా ముందస్తుగానే ఫలితాలు వెల్లడి
- ఎనిమిదేళ్లుగా 100% రిజల్ట్స్‌తో విజయవంతమైన ఏకైక సంస్థ
- నాటి నుంచి నేటిదాకా ఓటర్ల నాడీని జల్లెడ పట్టడంలో మేటి




హైదరాబాద్ బ్యూరో, నవంబర్ 14 (జనంసాక్షి) : జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక వేళ ఓటరు నాడీ ఎటో అంతు చిక్కని పరిస్థితుల్లో అక్టోబర్ నెలలో, నవంబర్ మొదటి వారంలో జనంసాక్షి సర్వే చేపట్టింది. ఈ రెండు సర్వేల్లో నూ ఏడు డివిజన్లలో పర్యటించి ఓటరు అభిప్రాయాన్ని బ్యాలెట్ పత్రాల్లో నిక్షిప్తం చేసి, నవంబర్ 6న ప్రీ పోల్ ఫలితాన్ని ప్రకటించింది. కాంగ్రెస్ పార్టీకి జూబ్లీహిల్స్‌లో మొగ్గుందని పోలింగ్ కంటే నాలుగు రోజుల ముందే వెల్లడించింది. అప్పటివరకు, అంతకుముందు ఎన్నో సంస్థలు బీఆర్ఎస్ గెలవబోతోందని ప్రకటించగా.. జనంసాక్షి ప్రీ పోల్ ఫైనల్ ఫలితాలు మాత్రమే కాంగ్రెస్ విజయం సాధించబోతోందని వెల్లడించింది. ఎగ్జిట్ పోల్‌లోనూ ఓటింగ్ శాతాన్ని ప్రకటించింది. చివరకు కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ సుమారు 25వేల ఓట్ల మెజారిటీతో గెలుపొందడంతో మరొకసారి జనంసాక్షి సర్వే పట్ల మేధావులు, రాజకీయ విశ్లేషకులు హర్షం వ్యక్తం చేశారు. 'జనంసాక్షి' చెబితే అది పక్కా అనేస్థాయికి వెళ్లిందంటే.. దానివెనుక ఉన్న కృషి, శ్రమ ఎంతో ప్రజలందరికీ తెలుసు. గత కొన్నేళ్లుగా ఎన్నికల వేళ రాష్ట్రవ్యాప్తంగా మండలాలు, గ్రామాలవారీగా 'జనంసాక్షి' బృందాలు కాలినడకన వెళ్లి ప్రజలను కలవడంతోనే సంస్థకు ఈ విశ్వసనీయత ఒనగూరిందన్నది వాస్తవం.

**జనంసాక్షి 'ముందస్తే..'**

2018లో కేసీఆర్ ముందస్తు ఎన్నికలు వెళ్లిన సందర్భంగా జనంసాక్షి చేపట్టిన సర్వే సంచలనమైంది. బీఆర్ఎస్ ఎన్ని సీట్లు గెలుస్తుందో, హేమాహేమీలు ఎవరెవరు ఓడిపోతున్నారో అన్న విషయాలను ముందస్తుగానే ప్రకటించింది అందరి దృష్టిని తనవైపు తిప్పుకుంది. అప్పటినుంచి హుజూరాబాద్, హుజూర్‌నగర్, మునుగోడు ఉప ఎన్నికలు సహా 2023 అసెంబ్లీ ఎన్నికల్లోనూ 'జనంసాక్షి' తన మార్క్ చూపెట్టింది. పేరుగాంచిన ఎన్నో సంస్థలు ఒకవైపు నిలిస్తే.. ప్రజల నాడీని పకడ్బందీగా ఒడిసిపట్టి ఎన్నికల ఫలితాలకు మిగతా 2లో..







వివిధ ఎన్నికల్లో 'జనంసాక్షి' సర్వేలు..




# మా మీద మరింత బాధ్యత పెరిగింది

- జూబ్లీహిల్స్‌లో ప్రజలు విలక్షణమైన తీర్పునిచ్చారు
- గత రెండేళ్ల మా పాలనను గమనించి ఓటేశారు
- హైదరాబాద్ అభివృద్ధిలో ఇక మరింత దూకుడు
- విపక్షాలు విమర్శలు మాని అభివృద్ధికి సహకరించాలి
- రాష్ట్రాభివృద్ధికి కేంద్రమంత్రులు కలిసి రావాలి
- సమస్యల పరిష్కారంలో కిషన్‌రెడ్డి సహకరించాలి
- సచివాలయానికి రావాలని స్వయంగా ఆహ్వానిస్తున్నా
- కేటీఆర్, హరీశ్‌లు బాధ్యతాయుత పాత్ర నిర్వహించాలి
- మీడియా సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి వెల్లడి
- ఎమ్మెల్యేగా గెలుపొందిన నవీన్ యాదవ్‌కు సన్మానం

**ఫేక్ సర్వేసంస్థల పైశాచిక ఆనందం తీరిందా?: సీఎం రేవంత్**



హైదరాబాద్(జనంసాక్షి):జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ విజయం తమ బాధ్యతను మరింత పెంచిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ఓటర్లు విలక్షణమైన తీర్పు ఇచ్చారని రేవంత్ రెడ్డి వెల్లడించారు. ఈ సందర్భంగా నవీన్ యాదవ్‌ను సీఎం రేవంత్ రెడ్డి సన్మానించి.. అభినందనలు తెలిపారు. ఎన్ని ఓటములు వచ్చినా .. కాంగ్రెస్ పార్టీ ప్రజల మధ్య మనుగడ సాగిస్తుందని ఆయన స్పష్టం చేశారు. అధికారంలో ఉంటే ప్రజాసమస్యలు పరిష్కరించడం, మిగతా 2లో..

## నాపై దుష్ప్రచారాన్ని ప్రజలు ఓటుతో తిప్పికొట్టారు

- భారాస చేసిందేమీ లేకనే ప్రచారంలో చెప్పుకోలేదు
- బెదిరిస్తే ఓటు వేసే రోజులు ఎప్పుడో పోయాయి
- నన్ను నమ్మి ఓట్లు వేసిన ప్రజలందరికీ ధన్యవాదాలు
- అందరం కలిసి మన ప్రాంత అభివృద్ధి కోసం పనిచేద్దాం.. ఎమ్మెల్యేగా విజయంసాధించిన అనంతరం నవీన్ యాదవ్

2లో..

## వచ్చే నెల 8, 9 తేదీల్లో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్

శాఖల వారీగా పాల పాలసీపై

పవర్ పాయింట్ ప్రజెంటేషన్ పాలసీ రూపకల్పనపై సీఎం సమీక్ష

2లో..



# జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ ఘన విజయం

**ఉపఎన్నికలో భారీ మెజార్టీతో నవీన్ యాదవ్ గెలుపు**

**రెండో స్థానంలో నిలిచిన బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత**

**డిపాజిట్ కోల్పోయిన బీజేపీ అభ్యర్థి లంకల దీపక్ రెడ్డి**

హైదరాబాద్(జనంసాక్షి): హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ ఘన విజయం సాధించింది. ఆ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ జయకేతనం ఎగురవేశారు. తన సమీప ప్రత్యర్థి, బిఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతపై 24,729 ఓట్లకుపైగా మెజార్టీతో ఆయన గెలుపొందారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గ చరిత్రలోనే ఇది అత్యధిక మెజార్టీ కావడం గమనార్హం. ఇకపోతే ఈ స్థానంలో పోటీచేసిన బిజెపి అభ్యర్థి లంకల దీపక్ రెడ్డి డిపాజిట్ కోల్పోయారు. ఓట్ల లెక్కింపు మొదలైన దగ్గరి మిగతా 2లో..

# రాష్ట్రంలో మేమే ప్రత్యామ్నాయం

- ఫలితాలు నిరుత్సాహ పరిచాయి..
- ఈ ఉప ఎన్నికలో నిజాయతీగా కొట్లాడాం
- ప్రతిపక్ష పాత్ర బలంగా పోషిస్తాం
- ఇదొక చిన్న సెట్ బ్యాక్ మాత్రమే..
- కేసీఆర్ మళ్లీ సీఎం అయ్యే వరకూ శ్రమిద్దాం:కేటీఆర్

హైదరాబాద్(జనంసాక్షి):'రాజకీయాల్లో గెలుపోటములు సహజం. ముందుకు పోదాం, కార్యకర్తలు సన్నద్ధం కావాలి. మరింత బలంగా పనిచేద్దాం. కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అయ్యే వరకూ శ్రమిద్దాం' అని అన్నారు భారత రాష్ట్ర సమితి అధ్యక్షుడు కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ తన సమీప ప్రత్యర్థి బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతపై సుమారు 25వేల ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు. ఈ సందర్భంగా కేటీఆర్ విలేకరులతో మిగతా 2లో..



## ఎంఐఎం మద్దతుతోనే జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ విజయం

మీడియా సమావేశంలో కేంద్రమంత్రులు బండి, కిషన్‌రెడ్డి

హైదరాబాద్(జనంసాక్షి): నేడు బిహార్‌లో విజయం సాధించామని.. రేపు పశ్చిమ బెంగాల్‌లో సైతం బీజేపీ విజయం సాధిస్తుందని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ధీమా వ్యక్తం చేశారు. బిహార్ అసెంబ్లీ ఎన్నికలు, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ఫలితాలపై శుక్రవారం నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచందర్ రావుతో కలిసి బండి సంజయ్ విలేకర్లతో మాట్లాడారు. బిహార్‌లో స్వతహాగా బీజేపీ 92 స్థానాల్లో గెలిచిందన్నారు. ఇక బిహార్‌లో కాంగ్రెస్ పార్టీ ఉప ప్రాంతీయ మిగతా 2లో..



# బీహార్‌లో మళ్లీ ఎన్డీయేనే..

- 243 స్థానాలకు గానూ 202 స్థానాల్లో విజయఢంకా
- 35 స్థానాలకే పరిమితమైన మహాగఠ్‌బంధన్
- ఎగ్జిట్ పోల్స్ అంచనాలను మించి సత్తా చాటిన అధికార కూటమి

పాట్నా(జనంసాక్షి):బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి కనీవినీ ఎరుగని రీతిలో భారీ విజయం సాధించింది. ఏకంగా 200కుపైగా స్థానాలను కైవసం చేసుకుని.. డబుల్ సెంచరీ కొట్టింది. మొత్తం 243 స్థానాలకు గానూ 202 స్థానాల్లో విజయఢంకా మోగించింది. గెలుపు ప్రభంజనంతో డబుల్ ఇంజిన్ సర్కారు ఏర్పాటుకు మరోసారి సిద్ధమైంది.ఎన్డీయే కూటమిలోని భాజపా (89), జేడీయూ (85), ఎల్‌జేపీ (ఆర్‌వీ) (19), హెచ్‌ఏఎం(5), ఆర్ఎల్ఎం (4) సీట్లలో విజయం సాధించాయి. ఉపముఖ్యమంత్రులు సామ్రాట్ చౌధరీ, విజయ్ కుమార్ సిన్హాతో పాటు జానపద గాయనీ మైథిలీ ఠాకూర్, శ్రేయసి సింగ్, మిగతా 9లో..

## మరోసారి అభివృద్ధికే పట్టం కట్టారు

బిహార్ ప్రజలు ఎన్డీయేకు అఖండ విజయం అందించారు

- బిహార్‌లో కట్టా సర్కార్ మళ్లీ రాదు: ప్రధాని మోదీ
- అఖండ మెజార్టీ ఇచ్చారు.. థాంక్స్: సీఎం నీతీశ్

న్యూఢిల్లీ(జనంసాక్షి):బీహార్ ప్రజలు ఎన్డీయేకు ప్రచండ విజయం అందించారని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఫిర్ ఏక్ బార్.. ఎన్డీయే సర్కార్ అంటూ నినదిస్తూ మరోసారి అభివృద్ధికే పట్టం కట్టారన్నారు. ఈ సందర్భంగా జయప్రకాశ్ నారాయణ్, మిగతా 2లో..



## అంగారకుడిపై అడుగిడేందుకు ప్రయాణం షురూ..

- నిప్పులు కక్కుతూ.. మార్స్ దిశగా దూసుకెళ్లిన 'ఎస్కపేడ్' మిషన్
- రెండు ఉపగ్రహాలను విజయవంతంగా నింగిలో ప్రవేశపెట్టిన భారీ రాకెట్ 'న్యూ గ్లెన్'
- ఈ మిషన్‌తో స్పేస్‌ఎక్స్‌కు పోటీదారుగా నిలిచిన బ్లూ ఆర్జిన్..



వాషింగ్టన్(జనంసాక్షి):అమెరికా అంతరిక్ష సంస్థ నాసా ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మార్స్ మిషన్ 'ఎస్కపేడ్' ప్రయోగం విజయవంతమైంది. అపరకుబేరుడు, అమెజాన్ అధిపతి జెఫ్ బెజోస్‌కు చెందిన 'బ్లూ ఆర్జిన్'కు చెందిన జంబో రాకెట్ అంతరిక్ష నౌకను నింగిలో ప్రవేశపెట్టింది. అనంతరం సదరు రాకెట్ విజయవంతంగా భూమిని చేరింది. వాతావరణ సమస్యలు, సౌర తుపాను కారణాలతో కొన్ని రోజులుగా వాయిదా పడుతూ వస్తున్న 'ఎస్కపేడ్' మిషన్ ఎట్టకేలకు గురువారం అంగారకుడి దిశగా తన ప్రయాణాన్ని ప్రారంభించింది. ఫ్లోరిడా తీరంలోని కేప్ కెనవెరల్ స్పేస్ స్టేషన్ నుంచి అతి శక్తివంతమైన రాకెట్ అయిన 'న్యూ గ్లెన్'తో అంతరిక్ష నౌక ఆకాశంలోకి మిగతా 2లో..

## సబ్‌రిజిస్టార్ కార్యాలయాలపై ఏసీబీ దాడులు

మిర్యాలగూడలో ఆకస్మిక తనిఖీ..

రూ.63,160 అక్రమ నగదు స్వాదీనం

అనధికారికంగా ఓ మహిళ పనిచేస్తున్నట్లు గుర్తింపు

రిజిస్ట్రేషన్ పూర్తయిన పంపిణీ జరగని 19 డాక్యుమెంట్స్ స్వాధీనం

మిర్యాలగూడ(జనంసాక్షి):ఇటీవల కాలంలో అవినీతి ఆరోపణలతో పతాక శీర్షికలకు ఎక్కిన మిర్యాలగూడ సబ్ రిజిస్టర్ కార్యాలయం పై శుక్రవారం అవినీతి నిరోధక శాఖ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఏకకాలంలో హైదరాబాదులోని సబ్ రిజిస్టర్ బలరాం యాదవ్ ఇంటిపై కూడా ఏసీబీ అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఏసీబీ నల్లగొండ డిఎస్పి జగదీష్ చంద్ర ఆధ్వర్యంలో మిగతా 2,11లో..



# అప్పుడూ.. ఇప్పుడూ.. జనంసాక్షి సర్వే ఎల్లప్పుడూ..

అత్యంత చేరువగా సర్వేలో వెల్లడైన విషయాలను 'జనంసాక్షి' విడుదల చేసింది. ఆ తర్వాత పార్లమెంట్ ఎన్నికల్లోనూ ఏ పార్టీకి ఎన్ని సీట్లు రాబోతున్నాయో అచ్చుగుద్దినట్టు తెలిపింది. ఢిల్లీలోనూ సర్వే చేపట్టి 2020లో ఆమ్మాదీ పార్టీకి ఉన్న ఆదరణను తెలియజేసి తన స్థాయిని జాతీయస్థాయికి విస్తరించుకోగలిగింది. 'జనంసాక్షి' అధినేత ఎంఎం రహమాన్ నేతృత్వంలో వందలాది మంది సర్వేల్లో పాల్గొనడం, పగలూ రాత్రీ తేడాలేకుండా అహర్నిశలూ శ్రమించిన ఫలితంగా ఇప్పటివరకు ఏ ఒక్క సర్వే ఫలితమూ తేడాగా రాలేదు. జూబ్లీహిల్స్ ఎన్నికల సందర్భంగా ఈ విషయం మరోసారి రూఢీకావడంతో 'జనంసాక్షి' విశ్వసనీయత అమాంతం పెరిగిందంటే అతిశయోక్తి కాదు.

# వచ్చే నెల 8, 9 తేదీల్లో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్

**శాఖల వారీగా పాల పాలసీపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్**

**ఏర్పాట్లు, పాలసీ రూపకల్పనపై రేవంత్ సమీక్ష**



**హైదరాబాద్(జనంసాక్షి):** డిసెంబర్ 8, 9 తేదీల్లో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2025 నిర్వహించబోతున్నారు. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా ఈ సదస్సు నిర్వహిస్తున్నారు. రెండు రోజులపాటు నిర్వహించే ఈ సమ్మిట్ గురించి కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో వివిధ శాఖల ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ సాయంత్రం సమీక్ష నిర్వహించారు. సమావేశానికి ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, స్పెషల్ సీఎస్ జయేష్ రంజన్, డీజీపీ శివధర్ రెడ్డి, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొని పలు అంశాల మీద చర్చించారు. సమీక్షలో ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. 'ప్రజా ప్రభుత్వం ఏర్పడి రెండేళు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2025 నిర్వహించుకుంటున్నాం. డిసెంబర్ 8న ప్రజా ప్రభుత్వ రెండో వార్షికోత్సవం వైభవంగా నిర్వహించాలి. డిసెంబర్ 9 2047 పాలసీ డాక్యుమెంట్ ను ఆవిష్కరించుకోబోతున్నాం. తెలంగాణ భవిష్యత్ కు రోడ్ మ్యాప్ రూపొందించుకోబోతున్నాం. పాలసీ ఆధారంగానే భవిష్యత్ నిర్ణయాలను తీసుకునేందుకు వీలుంటుంది. పాలసీ డాక్యుమెంట్‌తో పెట్టుబడిదారులకు ఒక స్పష్టత వస్తుంది. శాఖల వారీగా పాలసీలకు సంబంధించి సమ్మిట్ లో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేయాలి. ఈ నెలాఖరులోగా శాఖల వారీగా పాలసీ డాక్యుమెంట్ సిద్ధం చేయాలి. ఈ గ్లోబల్ సమ్మిట్ కు వివిధ దేశాల ప్రతినిధులను ఆహ్వానించండి. వివిధ దేశాల ప్రతినిధులు వస్తున్న నేపథ్యంలో సెక్యూరిటీ విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.

# తెలంగాణ పోలీసు శాఖలో 60 పోస్టులకు నోటిఫికేషన్ జారీ

**హైదరాబాద్(జనంసాక్షి):** తెలంగాణ ఫోరెన్సిక్ సైన్స్ లేబరేటరీలో 60 పోస్టులకు నోటిఫికేషన్ జారీ అయింది. సైంటిఫిక్ ఆఫీసర్స్, సైంటిఫిక్ అసిస్టెంట్స్, ల్యాబ్ టెక్నీషియన్స్, ల్యాబ్ అసిస్టెంట్స్ పోస్టులకు నోటిఫికేషన్ వెలువడింది. ఈనెల 27 నుంచి డిసెంబరు 15 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నారు. నోటిఫికేషన్ పూర్తి వివరాల కోసం వెబ్‌సైట్‌లో చూడాలని అధికారులు తెలిపారు.

# సబ్‌రిజిస్టర్ కార్యాలయాలపై ఏసీబీ దాడులు

మధ్యాహ్నం మూడు గంటల నుండి విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ అవినీతి నిరోధక శాఖ డిజిపి ఆదేశాలతో రాష్ట్రవ్యాప్తంగా అవినీతి ఆరోపణలు అక్రమాలు జరుగుతున్న కార్యాలయాలపై విస్తృత తనిఖీలు చేపడుతున్నట్లు తెలిపారు. దానిలో భాగంగా గత కొంతకాలంగా మిర్యాలగూడ సబ్ రిజిస్టర్ కార్యాలయం పై పెద్ద ఎత్తున ఫిర్యాదులు అందడంతో ఉన్నతాధికారుల ఆదేశాలతో తనిఖీలు కొనసాగిస్తున్నట్లు తెలిపారు.ఈ తనిఖీలలో సబ్ రిజిస్టర్ నిబంధనలకు విరుద్ధంగా డాక్యుమెంట్ రైటర్లతో మీలాఖత్ అయ్యి, అనధికారికంగా కార్యాలయంలో 12 మంది డాక్యుమెంట్ రైటర్స్ అసిస్టెంట్ డాక్యుమెంట్ రైటర్స్ తో ఉన్నారన్నారు. అదే కాక అనధికారికంగా ఓ మహిళ ఉద్యోగితో పనులు చేస్తున్నట్లు గుర్తించామన్నారు. ఆమెను లంచాలు తీసుకునేందుకు ఏర్పాటు చేసినట్లుగా అనుమానిస్తున్నామన్నారు. ఆమె వద్ద 63,160 రూపాయల నగదు దొరికినట్లు చెప్పారు. ఆ సొమ్ముకు సంబంధించిన వివరాలు ఇవి లేకపోవడంతో అవినీతి సొమ్ముగా గుర్తించినట్లు తెలిపారు. కార్యాలయంలో రికార్డులు ఏవి సక్రమంగా నిర్వహించడం లేదని, కార్యాలయంలో నాలుగు సీసీ కెమెరాలు ఉండగా కేవలం ప్రజలు కూర్చునే వైపు ఒక కెమెరా మాత్రమే పనిచేస్తుందని, ఉద్యోగుల వైపు ఉన్న మూడు కెమెరాలు పనిచేయడం లేదని గుర్తించినట్లు తెలిపారు. తమ అక్రమ తంతు బయటపడకుండా పథకం ప్రకారమే సీసీ కెమెరాలు పనిచేయకుండా నిలిపివేసినట్లుగా వెల్లడైనట్లు తెలిపారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయినప్పటికీ 19 రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు సదరు వ్యక్తులకు ఇవ్వకుండా కార్యాలయం లోనే తన వద్ద సబ్ రిజిస్టర్ పెట్టుకున్నట్లు బయటపడిందన్నారు. దీనిపై ప్రశ్నించగా పొంతనలేని సమాధానాలు చెబుతున్నాడంటూ తెలిపారు. ఇంకా తనిఖీలు కొనసాగుతూనే ఉన్నాయని, గుర్తించిన అంశాలను నివేదిక రూపంలో ఉన్నతాధికారులకు ప్రభుత్వానికి అందిస్తామని అన్నారు. సబ్ రిజిస్టర్ పై ఆరోపణల నేపథ్యంలో ఆయన ఇంటిపై కూడా ఏకకా లంలో అవినీతిని నిగ్గు తేల్చేందుకు విస్తృత సోదాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

# జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ ఘన విజయం







నుంచే నుంచే నవీన్ యాదవ్ స్పష్టమైన ఆధిక్యాన్ని ప్రదర్శించారు. రౌండ్ రౌండ్‌కూ అది మరింత పెరిగింది. ఏ ఒక్క రౌండ్‌లోనూ బిఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత ఆధిక్యం దక్కించుకోలేకపోయారు. పదిరౌండ్లలోనూ ఆధిక్యం నిలుపుకోవడం విశేషం. ఈ విజయంతో నవీన్ యాదవ్ నయా రికార్డ్ సృష్టించారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గ చరిత్రలోనే అత్యధిక మెజార్టీతో గెలుపొందిన వ్యక్తిగా ఘనత సాధించారు. జూబ్లీహిల్స్ నియోజవర్గంలో ఇప్పటివరకు అత్యధిక మెజార్టీ పీజేఆర్ కుమారుడు విష్ణు పేరిట(2009లో 21,741) ఉండేది. ఇక, దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ 2014లో 9,242, 2018లో 16,004, 2023లో 16,337 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. తాజాగా జరిగిన జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ 24,658 వేల ఓట్ల మెజార్టీతో విజయం సాధించి నియోజకవర్గ చరిత్రలో అత్యధిక మెజార్టీ సాధించిన వ్యక్తిగా రికార్డ్ క్రియేట్ చేశాడు. దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ అకాల మరణంతో జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి ఉప ఎన్నిక అనివార్యమైన సంగతి తెలిసిందే. ఈ ఎన్నికను రాష్ట్రంలో ప్రధాన పార్టీలైనా కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. కాంగ్రెస్ తరుపున స్థానికుడు నవీన్ యాదవ్ బరిలోకి దిగగా.. బీఆర్ఎస్ గోపినాథ్ సతీమణి సునీతకు టికెట్ కేటాయించింది. బీజేపీ నుంచి లంకల దీపక్ రెడ్డి పోటీ చేశారు. హోరాహోరీగా సాగిన ఈ పోరులో చివరకు అధికార కాంగ్రెస్ పార్టీ విజయం సాధించింది. కంటోన్మెంట్ మాదిరిగానే జూబ్లీహిల్స్‌ను కాంగ్రెస్ పార్టీ హస్తగతం చేసుకుంది. ఈ గెలుపు రేవంత్‌రెడ్డి సర్కార్‌కు, కాంగ్రెస్ శ్రేణులకు ఎంతో ఉత్సాహానిచ్చింది. నవీన్ యాదవ్ విజయాన్ని ఈసీ అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. భారత రాష్ట్ర సమితి, భాజపా అభ్యర్థులకు 2023 ఎన్నికల కంటే తక్కువ ఓట్లు వచ్చాయి. భాజపాకు డిపాజిట్ గల్లంతైంది.వ్యూహాత్మకంగా వ్యవహరించిన సీఎం రేవంత్ కాంగ్రెస్ విజయంలో సీఎం రేవంత్‌రెడ్డి వ్యూహాత్మకంగా వ్యవహరించారు. అభ్యర్థి ఎంపిక నుంచి ప్రచారం వరకు దగ్గరుండి పర్యవేక్షించారు. మైనార్టీల్లో మరింత పట్టుకోసం పోలింగ్‌కు కొద్దిరోజుల ముందే అజారుద్దీన్‌కు మంత్రి పదవి కట్టబెట్టారు. డివిజన్ల వారీగా మంత్రులకు బాధ్యతలు అప్పగించి సమన్వయం చేశారు. క్షేత్రస్థాయిలో నేతలు, కార్యకర్తలతో సమావేశాలు ఏర్పాటు చేసి శ్రేణుల్లో జోష్ నింపారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి సమర్థంగా తీసుకెళ్లేలా సీఎం చర్యలు చేపట్టారు. ఇకపోతే నవీన్ యాదవ్ 2009లో యూసుఫ్‌గూడ డివిజన్ ఎంఐఎం పార్టీ నుంచి కార్పొరేటర్‌గా నిలిచి తెదేపా అభ్యర్థి మురళీగౌడ్ చేతిలో ఓటమిపాలయ్యారు. 2014లో ఎంఐఎం తరపున జూబ్లీహిల్స్ నియోజకవర్గం పోటీ చేసి 41,656 ఓట్లు(25.19శాతం ) సాధించి రెండో స్థానంలో నిలిచారు. 2015లో ఎంఐఎం అభ్యర్థిగా రహ్మత్‌నగర్ డివిజన్ నుంచి కార్పొరేటర్ పోటీచేసి ఓడిపోయారు. 2018లో జూబ్లీహిల్స్ ఎమ్మెల్యేగా స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి 18,817 ఓట్లు సాధించారు. 2023 నవంబరు 15న అప్పటి పీసీసీ అధ్యక్షుడైన రేవంత్‌రెడ్డి సమక్షంలో నవీన్ కాంగ్రెస్ పార్టీలో చేరారు.

**వ్యూహాత్మకంగా వ్యవహరించిన సీఎం రేవంత్**

కాంగ్రెస్ విజయంలో సీఎం రేవంత్‌రెడ్డి వ్యూహాత్మకంగా వ్యవహరించారు. అభ్యర్థి ఎంపిక నుంచి ప్రచారం వరకు దగ్గరుండి పర్యవేక్షించారు. మైనార్టీల్లో మరింత పట్టుకోసం పోలింగ్‌కు కొద్దిరోజుల ముందే అజారుద్దీన్‌కు మంత్రి పదవి కట్టబెట్టారు. డివిజన్ల వారీగా మంత్రులకు బాధ్యతలు అప్పగించి సమన్వయం చేశారు. క్షేత్రస్థాయిలో నేతలు, కార్యకర్తలతో సమావేశాలు ఏర్పాటు చేసి శ్రేణుల్లో జోష్ నింపారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి సమర్థంగా తీసుకెళ్లేలా సీఎం చర్యలు చేపట్టారు.

**ఓటములనే మెట్లుగా చేసుకుని..**

2009లో యూసుఫ్‌గూడ డివిజన్ ఎంఐఎం పార్టీ నుంచి కార్పొరేటర్‌గా నిలిచి తెదేపా అభ్యర్థి మురళీగౌడ్ చేతిలో ఓటమిపాలయ్యారు. 2014లో ఎంఐఎం తరపున జూబ్లీహిల్స్ నియోజకవర్గం పోటీ చేసి 41,656 ఓట్లు(25.19%) సాధించి రెండో స్థానంలో నిలిచారు. 2015లో ఎంఐఎం అభ్యర్థిగా రహ్మత్‌నగర్ డివిజన్ నుంచి కార్పొరేటర్ పోటీచేసి ఓడిపోయారు. 2018లో జూబ్లీహిల్స్ ఎమ్మెల్యేగా స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి 18,817 ఓట్లు సాధించారు. 2023 నవంబరు 15న అప్పటి పీసీసీ అధ్యక్షుడైన రేవంత్‌రెడ్డి సమక్షంలో నవీన్ కాంగ్రెస్ పార్టీలో చేరారు.

# మా మీద మరింత బాధ్యత పెరిగింది



ప్రతిపక్షంలో ఉంటే ప్రజల సమ స్యలపై పోరాడడం కాంగ్రెస్ విధానమని అ న్నారు. జూబ్లీహిల్స్ అభ్యర్థి నవీన్ యాదవ్ భారీ మెజార్టీతో విజయం సాధించిన సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సీఎం మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత హైదరాబాద్ ప్రజల్లో కాంగ్రెస్‌పై నమ్మకం పెరుగుతోం దని అన్నారు. అందుకు జూబ్లీహిల్స్‌లో విజయం నిదర్శనమని, విజయం అందించిన ప్రజలకు ఈ సందర్భంగా సీఎం ధన్యవాదాలు తెలిపారు. నవీన్ యాదవ్ విజయం కోసం కృషి చేసిన పార్టీ శ్రేణులకు కృతజ్ఞతలు తెలిపారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో హైదరాబాద్‌లో కాంగ్రెస్‌కు సరైన ఫలితాలు రాలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్ల పాలనను ప్రజలు నిశితంగా పరిశీలించి తీర్పు ఇచ్చారని పేర్కొన్నారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 39శాతం ఓట్లు వచ్చాయి. 6 నెలల తర్వాత జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో మాకు ఓట్లశాతం 42కు పెరిగింది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్‌కు 51శాతం ఓట్లను ప్రజలు ఇచ్చారు. సంక్షేమ పథకాలను అందిస్తున్న ప్రభుత్వాన్ని ప్రజలు ఆశీర్వదించారు. గెలుపోటములకు కాంగ్రెస్ పొంగిపోదు, కుంగిపోదు. ప్రజల తరఫున నిలబడటం, పోరాడటమే కాంగ్రెస్ కర్తవ్యం అని అన్నారు. రాష్ట్ర ఆదాయంలో 65శాతం వరకు హైదరాబాద్ నుంచే వస్తోంది. నగరానికి ఉన్న ప్రాధాన్యత దృష్ట్యా మరింత అభివృద్ధి చేస్తాం. హైదరాబాద్‌ను సమస్యల రహిత నగరంగా తీర్చి దిద్దేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నాం. కేంద్రం నుంచి నిధులు రాకుండా కిషన్‌రెడ్డి సహాయ నిరాకరణ చేస్తున్నారు. మెట్రో, మూసీ ప్రక్షాళన సహా అనేక ప్రాజెక్టులకు అనుమతులను అడ్డుకుంటున్నారని మరోమారు ఆరోపించారు. కిషన్‌రెడ్డి ఎంపీ నియోజకవర్గంలోనే భాజపాకు బాగా ఓట్లు తగ్గాయి. భాజపా ఓట్లు 65వేల నుంచి 17 వేలకు ఎందుకు తగ్గాయో కిషన్‌రెడ్డి ఆలోచించాలి. ఆయన వ్యవహార శైలిని ప్రజలు గమనించారు. భూకంపానికి ముందు వచ్చే ప్రకంపనగా జూబ్లీహిల్స్ ఫలితాన్ని చూడాలన్నారు. తీరు మారకుంటే భూకంపం వంటి ఫలితాలు భాజపాకి వస్తాయని హెచ్చరించారు. రాజకీయాలు మాని.. రాష్ట్రాభివృద్ధికి కేంద్రమంత్రులు కలిసి రావాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రాజెక్టులకు అనుమతులు తెచ్చే బాధ్యత కేంద్రమంత్రులు, భాజపా ఎంపీలపై ఉంది. అసూయ తగ్గించుకోవాలని ప్రతిపక్ష నేతకు సూచిస్తున్నా. అధికారం పోయినా.. కేటీఆర్‌లో అహంకారం, అసూయ పోలేదు. పదవులు ఎవరికీ శాశ్వతం కావు. కేటీఆర్ తన అహంకారాన్ని తగ్గించుకోవాల్సిన అవసరం ఉంది. మనం ఇంకా చాలా ఏళ్లు రాజకీయాలు చేయాల్సి ఉంది. ఫేక్ న్యూస్ రాయించి.. ఫేక్ సర్వేలు చేయించుకొని భ్రమలో బతకొద్దని కెటిఆర్‌కు సూచించారు. భారత రాష్ట్ర సమితి ఓడిపోతుంది.. భాజపాకు డిపాజిట్ రాదని ముందే చెప్పానని ఫలితం అలాగే వచ్చిందన్నారు. అయితే కొందరు మీడియా వారు అత్యుత్సాహంతో బిఆర్ఎస్ గెలవ బోతోందని ప్రచారం చేశారని, అది వారి విజ్ఞతకే వదిలివేస్తున్నానని అన్నారు. జూబ్లీహిల్స్‌లో మాకు మద్దతు ఇచ్చిన ఎంఐఎంకు ధన్యవాదాలని, అసదుద్దీన్ ఒవైసీ బ్రదర్స్‌కు కాంగ్రెస్ కార్యకర్తల పక్షాన ధన్యవాదాలు తెలిపారు.. ఆయా రాష్ట్రాల పరిస్థితులను బట్టి పొత్తులు, మద్దతు ఉంటుంది. బిహార్ ఫలితాలను ఇంకా నేను సమీక్షించలేదని, దానిపై తరవాత స్పందిస్తానని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలపై ఈనెల 17న జరిగే కేబినెట్ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటాం. కేసీఆర్ ప్రస్తుతం క్రియాశీల రాజకీయాల్లో లేరు, ఆయన ఆరోగ్యం కూడా అంతగా సహకరించడం లేదు. కేసీఆర్ గురించి ఇప్పుడు స్పందించాల్సిన అవసరం లేదన్నారు. వచ్చే పదేళ్లపాటు రాష్ట్రంలో కాంగ్రెస్ పాలిస్తుంది.. మార్పు చేసి చూపిస్తాం అని సీఎం రేవంత్ అన్నారు. జూబ్లీహిల్స్ ఎన్నికలో పోలైన ఓట్లలో దాదాపు 51 శాతం కాంగ్రెస్‌కి, 38 శాతం ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్‌కు, 8 శాతం బీజేపీకి వచ్చాయన్నారు. దీని ద్వారా గత రెండేళ్ల తమ పాలనను ప్రజలు పరిశీలిస్తున్నట్లు స్పష్టమైందన్నారు. జీహెచ్ఎంసీ ఎన్నికల్లోనూ ఇదే ఫలితాలు వస్తాయని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్‌లో పార్టీ గెలుపుతో తమ బాధ్యత పెంచిందన్నారు. ప్రజల మన పనితీరును గమనించి తీర్పు ఇచ్చారని చెప్పారు. హైదరాబాద్‌లో అనేక సమస్యలు పరిష్కరిస్తున్నామన్నారు. అయితే తమపై బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం చేస్తోందంటూ మండిపడ్డారు. హైదరాబాద్ అభివృద్ధి కోసం ఎవరి పాత్ర వారు పోషిద్దామని ప్రతిపక్షాలకు ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. హైడ్రా, ఈగల్ వంటివి ప్రజల కోసం తీసుకు వచ్చామన్నారు. కానీ వాటిపైనే ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ దుష్ప్రచారం చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సోషల్ మీడియాలో ఈ విష ప్రచారం ఆపాలంటూ బీఆర్ఎస్‌కు సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. ప్రభుత్వం చేపడుతున్న ప్రతి కార్యక్రమానికి బీఆర్ఎస్ అడ్డుతగులుతోందన్నారు. జూబ్లీహిల్స్‌లో తమ గెలుపు రెండేళ్ల పాలనకు ప్రతిఫలమని సీఎం రేవంత్ స్పష్టం చేశారు. ఇప్పటికైనా అర్థం చేసుకుని సహకరించాలంటూ బీఆర్ఎస్, బీజేపీలకు సీఎం రేవంత్ రెడ్డి హితవు పలికారు. ఈ ఎన్నికల ఫలితాల్లో ఎవరి పాత్ర ఏంటో, ఎవరి బాధ్యత ఏమిటో ప్రజలు స్పష్టంగా చెప్పారని పేర్కొన్నారు. హైదరాబాద్‌ను విశ్వనగరంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. అనుచిత భాషతో అబద్ధాలను బీఆర్ఎస్ ప్రచారం చేసిందని తెలిపారు. గంజాయి, డ్రగ్స్‌లను నియంత్రించడానికి ఈగల్ ఫోర్స్ తీసుకు వచ్చామని వివరించారు. కబ్జాలను అడ్డుకోవడానికి హైడ్రా తీసుకువచ్చామన్నారు. అయితే నగరాభివృద్ధికి బీఆర్ఎస్ సహకరించకపోగా అడ్డుపడుతోందన్నారు. తాము ఎన్నికలప్పుడే రాజకీయ విమర్శలు చేస్తామన్నారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సచివాలయానికి రండంటూ ఆహ్వానించారు. కేంద్రంలో పెండింగ్ ఉన్న రాష్ట్ర అంశాలపై చర్చిద్దామంటూ కిషన్ రెడ్డిని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. కేంద్రంలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్ట్ వివరాలపై ఉన్నతాధికారులతో సమీక్షించి.. నివేదిక సిద్ధం చేయాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్కకు సీఎం రేవంత్ ఈ సందర్భంగా ఆదేశించారు. మీడియా సమావేశంలో పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు సీతక్క, పొన్నం, తదితరులు పాల్గొన్నారు.

# నాపై దుష్ప్రచారాన్ని ఓటుతో తిప్పికొట్టారు

హైదరాబాద్: భారీ మెజార్టీతో గెలిపించిన జూబ్లీహిల్స్ నియోజకవర్గ ప్రజలకు కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ ధన్యవాదాలు తెలిపారు. 24,729 ఓట్ల మెజార్టీతో విజయం సాధించిన ఆయనకు రిటర్నింగ్ అధికారి ధ్రువీకరణ పత్రం అందజేశారు. అనంతరం నవీన్ యాదవ్ మీడియాతో మాట్లాడారు." నా విజయం కోసం కృషి చేసిన కాంగ్రెస్ అధిష్ఠానం, సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, సీనియర్ నేతలు, కార్యకర్తలకు కృతజ్ఞతలు. ప్రజలు నాపై నమ్మకంతో ఓట్లు వేశారు. ఈ రోజుతో ఎన్నికలు ముగిశాయి. అందరం కలిసి మన ప్రాంత అభివృద్ధి కోసం పనిచేద్దాం. భారత రాష్ట్రసమితి నేతలు నాపై తప్పుడు ఆరోపణలు చేశారు. ఆ పార్టీ చేసిందేమీ లేకనే ప్రచారంలో చెప్పుకోలేదు. కేవలం నా గురించి దుష్ప్రచారం చేసి గెలవాలని బీఆర్ఎస్ చూసింది. అన్ని దుష్ప్రచారాలను ప్రజలు ఓటుతో తిప్పికొట్టారు. బెదిరిస్తే ప్రజలు ఓటు వేసే రోజులు ఎప్పుడో పోయాయి. నన్ను నమ్మి ఓట్లు వేసిన ప్రజలందరికీ ధన్యవాదాలు. నియోజకవర్గ సమస్యలు సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తా" అని తెలిపారు.జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు 98,988 ఓట్లు, భారత రాష్ట్రసమితి అభ్యర్థి మాగంటి సునీతకు 74,259 ఓట్లు, భాజపా అభ్యర్థి లంకల దీపక్‌రెడ్డికి 17,061 ఓట్లు పోలయ్యాయి.

# రాష్ట్రంలో మేమే ప్రత్యామ్నాయం

మాట్లాడారు. ఈ ఉప ఎన్నిక పార్టీకి కొత్త ఉత్సాహాన్ని, బలాన్ని ఇచ్చిందని రాష్ట్రంలో రాజకీయ ప్రత్యామ్నాయం బీఆర్ఎస్ మాత్రమేనని ప్రజలు స్పష్టమైన తీర్పు ఇచ్చారని అన్నారు. ఇకపైనా ప్రజా సమస్యలపై తమ పార్టీ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు."వ్యక్తిగత సమస్యలు ఉన్నా, పార్టీ నాయకులు జూబ్లీహిల్స్ ఎన్నికల్లో విజయం కోసం నిర్విరామంగా పనిచేశారు. వారికి పేరు పేరునా ధన్యవాదాలు. ప్రతి బూత్‌లో స్థానిక నాయకత్వం బాగా పనిచేసింది. మాగంటి సునీతకు రాజకీయ అనుభవం లేకపోయినా ఆమె ఎంతో కష్టపడ్డారు. ఒక రకంగా పోరాటమే చేశారు. గత రెండేళ్లుగా ప్రధాన ప్రతిపక్ష పార్టీగా బీఆర్ఎస్ అద్భుతమైన పాత్ర పోషిస్తోంది. ప్రజా సమస్యలు కేంద్రంగా కొట్లాడుతున్నాం. ఈ ఎన్నికల్లో మాకు ఓటు వేసిన ప్రతి ఓటరుకు ధన్యవాదాలు. అటు ప్రజాక్షేత్రం, ఇటు సోషల్‌మీడియాలోనూ మేము పనిచేస్తున్నాం.ఈ ఉప ఎన్నికలో నిజాయతీగా కొట్లాడాం. ఎన్నికలు ఎలా జరిగాయో అందరికీ తెలుసు. వాటి గురించి నేను మాట్లాడను. ప్రచారం ముగిసే వరకూ ఒకరకంగా.. ముగిశాక మరో రకంగా జరిగాయి""2014-23 మధ్య ఏడు ఉప ఎన్నికలు జరిగాయి. అప్పటి ప్రతిపక్ష పార్టీ కాంగ్రెస్ ఒక్క ఉప ఎన్నికలోనూ గెలవలేదు. మేము ఐదు గెలిచాం. రెండింటిలో ఓడిపోయాం. జీహెచ్ఎంసీ ఎన్నికలు వస్తే కూడా ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి ఒకట్రెండు కార్పొరేట్ సీట్లు మాత్రమే వచ్చాయి. ఈ ఎన్నికల్లో ప్రజల తరఫున వాదనను బలంగా వినిపించగలిగాం. ప్రజా సమస్యలు, ఆరు గ్యారెంటీల అమలు వైఫల్యాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాం. కుల, మత రాజకీయాలు, అసభ్య పదజాలం ఉపయోగించలేదు. చాలా హుందాగా పోరాటం చేశాం. ప్రజలకు అవసరమైన పాయింట్లు మాత్రమే చర్చకు పెట్టాం. కాంగ్రెస్, భాజపా ఎన్ని రకాలుగా కవ్వించే ప్రయత్నం చేసినా సంయమనం పాటించాం. పదేళ్లు ప్రభుత్వం నడిపిన ఒక జవాబుదారీ పార్టీగా జూబ్లీహిల్స్‌కు ఏం చేశారంటే. రూ.5వేల కోట్లతో అభివృద్ధి పనులు చేశాం"

ఇదొక చిన్న సెట్ బ్యాక్ మాత్రమే..


"జాతీయ స్థాయిలో చూస్తే బిహార్‌లో కాంగ్రెస్ ఉనికి కోల్పోయే పరిస్థితి వచ్చింది. ఈ ఎన్నిక భారత రాష్ట్ర సమితికి చిన్న సెట్ బ్యాక్ మాత్రమే. ఫలితాలను సమీక్షించుకుంటాం. ఆత్మ విమర్శ చేసుకోవాల్సిన అవసరం కూడా ఉంది. అధికార పార్టీ ఎన్ని ప్రలోభాలు పెట్టినా దీటుగా ఎదుర్కొని మంచి ఓటింగ్ సాధించాం. ఒక పార్టీ డిపాజిట్ కోల్పోయే పరిస్థితి వచ్చింది. దొంగ ఓట్ల గురించి స్పష్టమైన ఆధారాలు ఇచ్చాం. పోలింగ్ రోజు మా అభ్యర్థి పట్టుకున్నారన్నారు.

# అంగారకుడిపై అడుగిడేందుకు ప్రయాణం షురూ...

దూసుకెళ్లింది. ఈ ప్రయోగంతో 321 అడుగుల భారీ రాకెట్ అయిన 'న్యూ గ్లెన్'.. రోబోటిక్ మార్స్ సైన్స్, భారీ వాణిజ్య రాకెట్లకు సంబంధించి కొత్త శకానికి నాంది పలికింది.

**ఒకే మిషన్‌లో రెండు ఉపగ్రహాలు**

'ఎస్కపేడ్'ను నాసా ప్రతిష్ఠాత్మకంగా చేపట్టడానికి గల కారణం ఈ మిషన్‌లో రెండు ఉప గ్రహాలు ఉండడమే. బ్లూ, గోల్డ్ పేర్లు కలిగిన ఈ ఉపగ్రహాలు అంగారకుడి వాతావరణాన్ని పరిశీలించనున్నాయి. అంగారక గ్రహం ఎలా తన వాతావరణాన్ని కోల్పోయిందో ఇవి పరిశోధించనున్నాయి. మార్స్ పరిణామం, నివాసయోగ్యతకు సంబంధించి అర్థం చేసుకోవడానికి ఈ ప్రయోగం ఉపయోగపడనుంది. అంతేకాకుండా ఈ ఉపగ్రహాలు మార్స్ అయస్కాంత క్షేత్రం, ప్లాస్మా వాతావరణాన్ని శోధించనున్నాయి. బిలియన్ల ఏళ్ల కొద్ది నిగూఢంగా ఉన్న డేటాను ఇవి సేకరించనున్నాయి. 'ఎస్కపేడ్' అంతరిక్ష వాహక నౌక ఒక ఏడాది పాటు భూకక్షలో తిరుగుతూ 2027 నాటికి అంగారకుడి కక్షలోకి చేరనుంది. ఒకసారి మార్స్ కక్షలోకి ప్రవేశించగానే బ్లూ, గోల్డ్ ఉపగ్రహాలు పనిచేయడం ప్రారంభిస్తాయి.



స్పేస్‌ఎక్స్‌కు పోటీగా బ్లూ ఆర్జిన్..

ప్రయోగం అనంతరం జంబో రాకెట్ అయిన 'న్యూ గ్లెన్' తిరిగి భూమిని చేరింది. అట్లాంటిక్ సముద్రంలోని రికవరీ షిప్ జాక్లెన్‌పై సురక్షితంగా దిగింది. దీంతో బ్లూ ఆర్జిన్ చరిత్రలో ఈ ప్రయోగం ఒక మైలురాయిగా మిగిలింది. ఇప్పటి వరకు ఎలాన్ మస్క్‌కు చెందిన స్పేస్ ఎక్స్‌కు మాత్రమే రాకెట్ల రీయూజబుల్ టెక్నాలజీ ఉంది. తాజాగా 'బ్లూ ఆర్జిన్' ఆ మార్క్‌ను పొందింది. దీంతో స్పేస్ ఎక్స్‌కు బ్లూ ఆర్జిన్ పోటీదారుగా మారింది.

# మరోసారి అభివృద్ధికే పట్టం కట్టారు

కర్పూరి ఠాకూర్‌కు నివాళులర్పించారు. బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే ప్రభంజనం సృష్టించిన నేపథ్యంలో దిల్లీలోని భాజపా ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన విజయోత్సవ సభలో ప్రధాని ప్రసంగించారు. ఈ విజయం బిహార్‌ను కొత్త శిఖరాలకు తీసుకెళ్లేందుకు తమలో ఉత్సాహాన్ని నింపిందన్నారు. కొన్ని పార్టీలు 'ముస్లిం-యాదవ్-ఎంవై అనే బుజ్జగింపు సూత్రాన్ని రూపొందించినప్పటికీ.. తమ అపూర్వ విజయాన్ని మహిళలు, యువత అనే కొత్త ఎంవై కలయిక సుస్థిరం చేసిందన్నారు. బిహార్‌లో విజయం కోసం అద్భుతంగా కృషిచేసిన ఎన్డీయే నేతలు, సీఎం నీతీశ్ కుమార్ నాయకత్వాన్ని ప్రధాని అభినందించారు. మరోసారి జంగల్ రాజ్ రావొద్దని యువత నిర్ణయించుకున్నారు. బిహార్ అసెంబ్లీ విజయం.. భారత ప్రజాస్వామ్య విజయం. గతంలో నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో మధ్యాహ్నం 3గంటల వరకే పోలింగ్ జరిగేది. ఈసారి ఎలాంటి ఘర్షణలు జరగకుండా జరిగాయి. గతంలో 1500 పోలింగ్ కేంద్రాల్లో రీపోలింగ్ జరిగేది.. కానీ ఈసారి ఒక్క చోట కూడా ఆ అవసరం రాలేదు" అని ప్రధాని అన్నారు.

'జంగల్‌రాజ్'కు బిహార్ నో ఎంట్రీ బోర్డు: నడ్డా

బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు అభివృద్ధికి ఓటు వేశారని భాజపా జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా అన్నారు. ఈ ఎన్నికల్లో ఎన్డీయే కూటమికి అపూర్వ విజయాన్ని అందిస్తూ ఇచ్చిన తమ తీర్పుతో 'జంగల్ రాజ్'కు బిహార్‌లో ప్రవేశం లేదనే బోర్డు పెట్టారన్నారు. హరియాణా, మహారాష్ట్ర, దిల్లీ.. ఇప్పుడు బిహార్ వంటి వరుస ఎన్నికల్లో ప్రజలు ప్రధాని మోదీపై అచంచలమైన విశ్వాసాన్ని చూపించారని ప్రశంసించారు. గతంలో చేసిన తప్పులను మళ్లీ చేయకూడదని ప్రజలు నిశ్చయించుకున్నారని.. అందుకే వరుస ఎన్నికల్లో భాజపాకు ఓటు వేస్తున్నారన్నారు. ఇండి కూటమి సీఎం అభ్యర్థి తేజస్వీ యాదవ్ రాఘోపూర్ సీటులో భాజపా అభ్యర్థిపై కేవలం 14,532 ఓట్ల తేడాతోనే విజయం సాధించారన్నారు. డబుల్ ఇంజిన్ పాలన, సీఎం నీతీశ్ కుమార్ సుపరిపాలనకు అనుకూలంగా బిహార్ తీర్పు స్పష్టమైన సందేశమని పేర్కొన్నారు. విపక్షాలు విభజన, బుజ్జగింపు రాజకీయాలకు ప్రయత్నించినా.. ప్రజలు వారికి తగిన బుద్ధి చెప్పారన్నారు. అన్ని వర్గాల ప్రజలూ ఎన్డీయేకు ఓటేశారని.. ముఖ్యంగా మహిళలు పెద్ద సంఖ్యలో తమకు ఓటు వేసినట్లు తెలిపారు. విపక్షాలు బిహార్ ప్రజలను, ఛఠ్ సంప్రదాయాన్ని అవమానిం చాయని అందుకే ప్రజలు తగిన గుణపాఠం చెప్పారన్నారు. ఈ సభలో మోదీని నేతలు గజమాలతో సత్కరించారు. ఈ సభలో కేంద్రమంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్ సహా పలువురు నేతలు పాల్గొన్నారు.

అఖండ మెజార్టీ ఇచ్చారు.. థాంక్స్: సీఎం నీతీశ్

అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి ప్రభుత్వం పట్ల విశ్వాసంతో ప్రజలు అఖండ మెజార్టీతో గెలిపించారని బిహార్ ముఖ్యమంత్రి, జేడీయూ చీఫ్ నీతీశ్ కుమార్ అన్నారు. తమకు అపూర్వ విజయాన్ని అందించిన ఓటర్లందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఎన్నికల్లో మద్దతుగా నిలిచిన ప్రధాని నరేంద్ర మోదీకి ప్రత్యేకంగా కృతజ్ఞతలు చెబుతూ 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. ఈ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి పూర్తి ఐక్యతతో అద్భుతమైన మెజార్టీని సాధించిందన్నారు. ఇంత గొప్ప విజయానికి దోహదం చేసిన మిత్రపక్షాల నేతలు చిరాగ్ పాసవాన్, జితన్ రామ్ మాంఝీ, ఉపేంద్ర కుష్వాహాలకు నీతీశ్ కృతజ్ఞతలు తెలిపారు.

# ఎంఐఎం మద్దతుతోనే జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ విజయం

పార్టీగా మారిందని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ పని అయిపోయిందని.. ఇక ఆయన పబ్జి ఆడుకోవాలంటూ వ్యంగ్యంగా పేర్కొన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపుపై మాట్లాడుతూ.. ఈ ఎన్నికల్లో గెలిచింది ఎంఐఎం అభ్యర్థి అని చెప్పారు. తెలంగాణలో హిందూ సమాజం ఒక్కటి కావాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. ఇక తెలంగాణ లో బీఆర్ఎస్ పార్టీ ప్రతిపక్ష నేత ఎవరు అంటూ సందేహం వ్యక్తం చేశారు. అసెంబ్లీకి రాకుండా ప్రధాన ప్రతిపక్ష నేత ఎలా అవుతారంటూ కేసీఆర్‌ను పరోక్షంగా విమర్శించారు. జూబ్లీహిల్స్‌లో డిపాజిట్ రాకపోయినా వచ్చే ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి వస్తుందని స్పష్టం చేశారు.

**ఎంఐఎం మద్దతుతోనే జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ విజయం: కిషన్‌రెడ్డి**

ఎంఐఎం మద్దతు, డబ్బుతోనే జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ పార్టీ గెలిచిందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. ప్రత్యేక పరిస్థితులలో జూబ్లీహిల్స్ ఎన్నికలు జరిగాయని.. తమ పార్టీ అక్కడ బలహీనంగా ఉందని తెలిపారు. జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ గెలుపుపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్పందించారు. జూబ్లీహిల్స్‌లో తాము ఎప్పుడూ ఒక కార్పొరేటర్ కూడా గెలవలేదని... స్వాతంత్య్రం వచ్చినప్పుడు నుంచి ఎప్పుడు గెలవలేదని అన్నారు. తాము ఉన్నంతలో ప్రయత్నం చేశామని చెప్పారు. జూబ్లీహిల్స్‌లో ఓటమిని విశ్లేషించుకుంటామని అన్నారు. ఓల్డ్ సిటీలో కూడా ఏ పార్టీ గెలవదన్నారు. ప్రజా తీర్పును తాము శిరసా వహిస్తామన్నారు. ఎంఐఎం సహకరించడం వల్లే కాంగ్రెస్ గెలిచిందన్నారు

# కేరళ రాష్ట్రంలో కూరగాయ పంటల సాగు భేష్

- రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి
- పాలక్కాడ్ జిల్లాలోని పలు గ్రామాల్లో సాగవుతున్న కూరగాయల తోటలను సందర్శించిన రైతు కమిషన్ బృందం



హైదరాబాద్ (జనంసాక్షి) : కేరళ రాష్ట్రంలో ఉద్యానవన పంటల సాగు కోసం అమలవుతున్న పాలసీ బాగుందన్నారు రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి. కౌలు రైతుల విషయంలో సైతం కేరళ ప్రభుత్వం అమలు చేస్తున్న విధానం ఆదర్శమన్నారు. కేరళలో అమలవుతున్న విధానాలను తెలంగాణలో అమలయ్యేలా రాష్ట్ర ప్రభుత్వానికి సిఫార్సు చేస్తామన్నారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సైతం కూరగాయల పంటల సాగు విస్తీర్ణం పెంచడానికి కృషి చేస్తున్నారని వివరించారు. అందులో భాగంగానే రైతు కమిషన్ బృందం కేరళలో పర్యటిస్తుందన్నారు. పాలక్కాడ్ జిల్లాలోని వడవన్నూర్, ఎలెవంచెరి గ్రామాల్లో సాగవుతున్న కూరగాయల తోటలను కమిషన్ బృందం సందర్శించింది. ఆయా గ్రామాల్లో రైతులు, కౌలు రైతులతో కమిషన్ నేరుగా మాట్లాడి వివరాలను తెలుకుంది. అంతేకాదు కేరళలో అమలులో ఉన్న సహకార వ్యవసాయ పద్ధతులను పరిశీలించారు. వడవన్నూర్, ఎలెవంచెరి గ్రామాల పరిధిలో కొనసాగుతున్న వెజిటేబుల్ అండ్ ఫ్రూట్ ప్రమోషన్ కౌన్సిల్ కేరళం (వీఎఫ్‌పీసీకే) యూనిట్లను సందర్శించారు. ఇక్కడ మార్కెట్ ధర, రైతుల లావా దేవీలు ఎలా జరుగుతున్నాయని కమిషన్ బృందం అడిగి తెలుసుకుంది. అదేవిధంగా కమిషన్ బృందానికి కేరళ రాష్ట్రంలో సాగు విధానంపై వీఎఫ్‌పీసీకే, కేరళ వ్యవసాయ శాఖ ఉన్నతాధికా రులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కేరళ ప్రభుత్వం తరుపు రైతులకు ఏం ఇస్తున్నారు ఎలా చేస్తున్నారు అనే విషయాలు చెప్పారు. రైతు ఉత్పాదకత, మార్కెటింగ్ సౌకర్యాలు, సమూహాల ఆధారిత వ్యవసాయ పద్ధతులపై వివరంగా కమిషన్ కు వివరించారు. ఈ కార్యక్రమం ద్వారా రెండు రాష్ట్రాల మధ్య వ్యవసాయ అనుభవాల పరస్పర మార్పిడి, రైతులకు ఉపయోగపడే సాంకేతిక పద్ధతుల అధ్యయనం, రైతు సంక్షేమానికి సంబంధించిన అనేక అంశాలపై చర్చించినట్లు కమిషన్ చైర్మన్ కొదండరెడ్డి తెలిపారు. ఈ పర్యటనలో కమిషన్ చైర్మన్ కొదండరెడ్డి తోపాటు సభ్యులు కేవీఎన్ రెడ్డి, గోపాల్ రెడ్డి, భవానీ రెడ్డి, గడుగు గంగాధర్, కమిషన్ మెంబర్ సెక్రెటరీ గోపాల్, ఉద్యనవన శాఖ అధికారి సురేష్, వ్యవసా య శాఖ అధికారులు హరివెంటక ప్రసాద్, శ్రావణి వున్నారు.

# రాష్ట్రంలో పలు అభివృద్ధి పథకాలు

- సిఎస్‌తో ఎడిబి ప్రతినిధుల చర్చలు



హైదరాబాద్, నవంబర్14 (జనంసాక్షి) : ముఖ్యమంత్రి నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్, మూసి నది సుందరీకరణ, యంగ్ ఇండియా స్కిల్, స్పోర్ట్స్ యూనివర్సిటి, రాష్ట్రంలో రోడ్ల విస్తరణ తదితర ప్రాజెక్టులపై ఆసియన్ డెవలప్మెంట్ బ్యాంక్ ప్రతినిధి బృందంతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు శుక్రవారం డా.బీ.ఆర్.అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో సమావేశమయ్యారు. తెలంగాణ రైజింగ్ 2047 లో భాగంగా హైదరాబాద్ మెట్రో రెండో దశ విస్తరణ, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లలో మౌళిక సదుపాయాల కల్పన, రాష్ట్రంలో వివిధ మున్సిపాలిటీలు, గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్, హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ లో సివరేజ్ ప్లాంట్ ల నిర్మాణం. రోడ్ల విస్తరణ, క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ ద్వారా వ్యవసాయ పంపు సెట్లకు సోలార్ విద్యుత్ అనుసంధానం, టి.ఎస్.ఆర్.టి.సి, యంగ్ ఇండియా స్కిల్, స్పోర్ట్స్ యూనివర్సిటి లలో చేపట్టే ప్రాజెక్టులకు ప్రభుత్వం ప్రతిపాదించిన ప్రాజెక్ట్ వివరాలు, ఆర్థిక పరమైన అంశాలపై ఈ సమావేశంలో చర్చించారు. పరస్పర సహాకారంతో నిర్దేశిరచిన ప్రాజెక్టులను వేగవంతం చేయాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా సి.ఎస్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం పెట్టుబడులకు అనువైనదని దేశంలో ఫాస్ట్ గ్రోయింగ్ స్టేట్ గా ఉన్నదని అన్నారు. ఈ సమావేశంలో రోడ్లు, భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్, ప్రణాళిక కార్యదర్శి జ్యోతి బుద్ధ ప్రకాష్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కార్యదర్శి టి.కె. శ్రీదేవి, విద్యా శాఖ కార్యదర్శి యోగితా రాణా, హైదరాబాద్ మెట్రో రైల్ మేనేజింగ్ డైరెక్టర్ సర్ఫరాజ్ అహ్మద్, టిజిఐఐసి డైరెక్టర్ శశాంక, మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ రెడ్డి, ముసి రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ ఇ.వి.నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# బాలోత్సవాల్లో పాల్గొన్న ఉప్పల



హైదరాబాద్ (జనంసాక్షి) : తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ వారి సౌజన్యంతో రవీంద్ర భారతిలో ఉపద్రష్ట అరుణ అశోక్ వ్యవస్థాపకులు, సాయి అలేఖ్య ఆధ్వర్యంలో రారండోయ్ బాలల్లారా రారండోయ్ .. మన భారత ప్రప్రథమ ప్రధాని చాచానెహ్రూ జన్మదిన వేడుకల్లో కేంద్ర మాజీ మంత్రి సముద్రాల వేణుగోపాలాచారి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త పాల్గొన్నారు. ఈ సందర్భగా సముద్రాల వేణుగోపాల్ చారి మాట్లాడుతూ విద్యతో పాటు వినయంగా ఉండటం కూడా నేర్చుకోవాలని, బాల్యంలో మంచి అలవాట్లు అలవడితేనే పెద్దయ్యాక మంచి లక్ష్యాలను సాధించగలరని ఆయన అన్నారు. ఉప్పల శ్రీనివాస్ గుప్త మాట్లాడుతూ నేటి బాలలే రేపటి నవ భారత నిర్మాతలు వారి బంగారు భవిష్యత్తు కోసం మనమంతా కలిసి పనిచేద్దామన్నారు. బాలల శ్రేయస్సే లక్ష్యంగా తెలంగాణని దేశానికి ఆదర్శంగా తీర్చి దిద్దుదామని, చిన్నారులందరికీ ముందస్తు బాలల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం చిన్నారులకు అనేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దైవాజ్ఞ శర్మ పలువు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# దేశప్రజలు నరేంద్ర మోడీ పాలన కోరుకుంటున్నారు

- రాబోయే రోజుల్లో అన్ని రాష్ట్రాల్లో ఇదే తీర్పు ఉంటుంది
- బిజేఎల్పి నేత మహేశ్వర్ రెడ్డి



నిర్మల్ రూరల్, నవంబర్ 14 (జనంసాక్షి) : భారతదేశమంతా ప్రధాని నరేంద్ర మోడీ పాలన కోరుకుంటున్నారని బిజేఎల్పినేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి తెలిపారు.బీహార్ లో ఎన్డీఏ భారీ మెజారిటీతో గెలిచిన సందర్భంగా శుక్రవారం హైదరాబాద్ లోని బిజెపి రాష్ట్ర పార్టీ కార్యాలయంలో సంబరాలు బిజెపి నాయకులు జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రామచందర్ రావు, కేంద్రమంత్రి బండి సంజయ్, పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి,బిజెపి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు,నాయకులు తదితరులు హాజరయ్యారు.ఈ సందర్భంగా మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వం దేశానికి అవసరమని బీహార్ ప్రజలు చాలా స్పష్టంగా ఏకగ్రీవంగా తీర్పునిచ్చారని అన్నారు.యావత్ భారతదేశమంతా ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వాన్ని బలపరుస్తున్నారన్నారు. బీహార్ ఎన్నికల్లో 95% పైగా స్ట్రైక్ రేట్ తో నరేంద్ర మోడీ పాలనపట్ల తీర్పు ఇచ్చారని తెలిపారు.రాబోయే రోజుల్లో ఏ రాష్ట్రంలోనైనా ఇదేవిధంగా తీర్పు ఉంటుందని అన్నారు.రాష్ట్రంలోని జూబ్లీహిల్స్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రజలను భయపెట్టి గెలిచారని ఆయన విమర్శించారు.కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి ఉంటే బిఆర్ఎస్ పార్టీ నుండి కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎమ్మెల్యేలను రాజీనామా చేయించాలని అన్నారు.

# ఆజాద్, అశోక్‌లను వెంటనే కోర్టులో హాజరుపరచాలి

- తెలంగాణ పౌరహక్కుల సంఘం రాష్ట్ర కమిటీ డిమాండ్

హైదరాబాద్ (జనంసాక్షి) : ములుగు జిల్లా పస్రా వద్ద మూడు రోజుల కింద అరెస్ట్ చేసిన ఆజాద్ అశోక్ లను వెంటనే కోర్టులో హాజరుపరచాలని తెలంగాణ పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్, కార్యదర్శి ఎన్ నారాయణరావు డిమాండ్ చేశారు. కొయ్యడ సాంబయ్య ఎలియాస్ ఆజాద్ భద్రాద్రి కొత్తగూడెం మావోయిస్టు పార్టీ కార్యదర్శిని, గోదావరిఖని చెందిన సికాస ఆర్గనైజర్ ఆజాద్ లను ములుగు జిల్లా పసరా వద్ద మూడు రోజుల క్రితం పోలీసులు అదుపులోకి తీసుకున్నారని, ఇంతవరకు కోర్టు ముందు వారిని ప్రవేశ పెట్టలేదని తెలిపారు. వారిని చిత్రహింసలు గురి చేస్తున్నారని మాకు అనుమానాలు ఉన్నాయని, వెంటనే వారి ఇరువురికి ప్రాణ హాని ఉందని, సిపిఐ మావోయిస్టు భద్రాద్రి కొత్తగూడెం కార్యదర్శి ఆజాద్, సికాస ఆర్గనైజర్ అశోక్‌లను కోర్టు ముందు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు.

# గిరిజనుల సంక్షేమం, అభివృద్ధిపై ప్రత్యేక చర్యలు

- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



మంచిర్యాల ప్రతినిధి, నవంబర్ 14, (జనంసాక్షి) : గిరిజనుల సంక్షేమం, అభివృద్ధి కొరకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం మంచిర్యాల జిల్లాలోని హాజీపూర్ మండలం పెద్దంపేట్ గ్రామపంచాయతీ పరిధిలోని కొలాంగూడ గ్రామంలో మండల ప్రభుత్వ ఉద్యోగులచే సేకరించిన దుప్పట్ల పంపిణీ కార్యక్రమానికి హాజరై గిరిజన కుటుంబాలకు దుప్పట్లు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ సంవత్సరం చలి తీవ్రత మరింత అధికంగా ఉన్నందున చలి ప్రభావిత ప్రాంతాలలో ప్రజల సంరక్షణ కోసం చర్యలు తీసుకోవడం జరుగుతుందని, హాజీపూర్ మండలం ప్రభుత్వ ఉద్యోగులు దుప్పట్ల పంపిణీ కార్యక్రమం చేపట్టడం అభినందనీయమని తెలిపారు. గ్రామంలోని 40 కుటుంబాల వారికి దుప్పట్లు అందజేయడం జరిగిందని, చలి తీవ్రత అధికంగా ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. జిల్లాలో పి.వి.టి.జి. లకు 200కు పైగా ఇండ్లు అందించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ఇంటి స్థలం కలిగి ఉన్నవారికి ఇల్లు నిర్మించుకునేందుకు ఆర్థిక చేయూత అందించడం జరుగుతుందని తెలిపారు. ఇంటి నిర్మాణానికి ఇసుకను ఉచితంగా అందిస్తున్నామని, లబ్ధిదారులు వినియోగించుకోవాలని తెలిపారు. గిరిజన పిల్లలు చదువుకునేందుకు పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలు ఏర్పాటు చేయడం జరిగిందని, ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. గిరిజన ప్రాంతాలలో అంతర్గత రహదారులు, త్రాగునీటి సమస్య లేకుండా అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. గ్రామంలో ఏమైనా సమస్యలు ఉన్నట్లయితే తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఓయూ కోర్సుల ఫలితాలు విడుదల



హైదరాబాద్, నవంబర్14 (జనంసాక్షి) : ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్షల ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంబీఏ (టెక్నాలజీ మేనేజ్‌మెంట్) రెండో సెమిస్టర్, దూరవిద్య ద్వారా అందించే అడ్వాన్స్‌డ్ డిప్లొమా కోర్సుల పరీక్షా ఫలితాలతో పాటు బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ మొదటి సెమిస్టర్ పరీక్షల రివాల్యుయేషన్ ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు. ఈ ఫలితాలను ఓయూ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.

# చదువే ధ్యేయంగా ధైర్యంగా ముందుకు సాగాలి

- ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్



ములుగు ప్రతినిధి, నవంబర్ 14(జనంసాక్షి) : చదువే ధ్యేయంగా ధైర్యంగా ముందుకు సాగాలని, విద్యార్థి దశలో చదువు ప్రధాన లక్ష్యంగా ఉండాలని స్పష్టమైన లక్ష్యంతో ముందుకు సాగితేనే బలమైన భవిష్యత్తు నిర్మించుకోవచ్చని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. బాలల దినోత్సవం సందర్భంగా దిశ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న ఈఎల్ఎఫ్ ఇంగ్లీష్ లెర్న్ టు రీడ్ కార్యక్రమం లో భాగంగా శుక్రవారం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ని తన ఛాంబర్లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఇంగ్లీష్ లో ఇంటర్వ్యూ నిర్వహించి అభిరుచులు, రోల్ మోడల్‌పై విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో ముఖాముఖి నిర్వహించారు. బాలల దినోత్సవం ప్రాముఖ్యతపై చిన్న రోల్ ప్లే కూడా చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ విద్యార్థులకు బాలల దినోత్సవం శుభాకాంక్షలు తెలియజేశారు. దిశా ఫౌండేషన్ భాగస్వామ్యంతో జిల్లా లోని 72 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ఇంగ్లీష్ చదవడం నేర్చుకునే ప్రోగ్రాం అమలవుతుందని అన్నారు. తద్వారా విద్యార్థులు నైపుణ్యాన్ని ప్రదర్శించే అవకాశం లభించిందని అన్నారు.




# క్రమశిక్షణతో కూడిన జీవితాన్ని కొనసాగించాలి

- వరంగల్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సాయి కుమార్

వరంగల్ బ్యూరో, నవంబర్ 14 (జనం సాక్షి) : బాలల దినోత్సవం సందర్భంగా ఆటో నగర్ లోని బాలుర పరిశీలక గృహము లో నిర్వహించిన కార్యక్రమంలో వరంగల్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి యం.సాయికుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. నెహ్రూ చిత్ర పటానికి పూలమాల వేసి, జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా చిన్నారులతో కేక్ కట్ చేపించి,అందరికీ బాలల దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. తెలిసీ, తెలియని వయసులో చేసిన తప్పులు తిరిగి పునరావృతం చేయకుండా, చట్ట వ్యతిరేక పనులకు స్వస్తి చెప్పి, క్రమశిక్షణతో కూడుకున్న జీవనాన్ని కొనసాగించాలని తెలిపారు. మంచి మిత్రులతో సహవాసం చేయాలని, చెడు స్నేహం చేయరాదన్నారు. ఇకనైనా చట్టవ్యతిరేకమైన పనులను మానివేసి, సమాజంలో మంచి గుర్తింపు తెచ్చుకునేలా వ్యవహరించాలని సూచించారు. తల్లిదండ్రులకు మంచి పేరు తెచ్చేలా నడుచుకోవాలని తెలిపారు. ఎటువంటి సహాయ సహకారాలకైననూ బాలురు ఎవరైననూ న్యాయ సేవాధికార సంస్థలను సంప్రదించి, తగిన సహాయం పొందవచ్చునని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఛీఫ్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ ఆర్.సురేష్, హోమ్ సూపరింటెండెంట్ రమణమూర్తి, జువైనల్ బోర్డు మెంబర్లు యం.సుభాష్, డా.గోపికా రాణి, హోమ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్ద పీట

- స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి
- పేదల ఆరోగ్యానికి ఆర్థికభరోసా సిఎంఆర్ఎఫ్
- కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుకు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ప్రజలిచ్చిన తీర్పే నిదర్శనం
- స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్ జెండా ఎగురవేయాలి



స్టేషన్ ఘన్ పూర్, నవంబర్ 14 ( జనం సాక్షి ) : ప్రజా సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుంద ని, బికారి నుండి బిలినియర్స్ వరకు ఉన్న మినీ ఇండి యా లాంటి జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ప్రజలుఇచ్చిన తీర్పుకాంగ్రెస్ ప్రభుత్వపనితీరుకు నిదర్శనమని మాజీ ఉపముఖ్యమంత్రి, స్టేషన్ ఘన్పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. స్టేషన్ ఘన్పూర్ పట్టణ కేంద్రంలోని ఎస్ కన్వెన్షన్ లో ఏర్పాటుచేసిన నియోజకవర్గ స్థాయి ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులపంపిణి కార్యక్రమా నికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరై 198 మంది ముఖ్యమంత్రి సహాయ నిధి లబ్ధిదారుల కు 1కోటి 05లక్షల 37వేల 250రూపాయల విలువగల చెక్కులను ఎమ్మెల్యే కడియం శ్రీహరి పంపిణి చేశారు. ముందుగా భారత దేశ తొలి ప్రధాని, భారత రత్న పండిత్ జవహర్ లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా అయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు.బాలల దినోత్సవం సందర్భంగా చిన్నారులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ప్రతిపక్షాలు సోషల్ మీడియాలో ఎన్ని రకాల దుష్ప్రచారం చేసిన కాంగ్రెస్ పార్టీ విజయాన్ని అడ్డుకోలేక పోయారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ అందరి అంచనా లను తలకిందులు చేస్తూ సుమారు 25 వేల ఓట్ల భారీ మెజారిటీతో విజయం సాధించారని తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి తీసుకువచ్చిన 1400కోట్ల అభివృద్ధి పనులను ప్రజల్లోకి బలంగా తీసుకు వెళ్లాల ని సూచించారు. గత 10 ఏళ్ల బిఆర్ఎస్ పాలనలో ఎమ్మెల్యే మొదలుకొని ముఖ్యమంత్రి వరకు రాష్ట్రాన్ని అడ్డగోలుగా దోచుకున్నారని ఆరోపించారు. ప్రస్తుతం కల్వకుంట్ల కుటుంబంలో వాటాల కోసమే కవిత పార్టీ నుండి బయటకు వచ్చిందని అన్నారు. ఇది నేను అంటుంది కాదని కవిత చేసిన ఆరోపణలే చెప్తున్నాని తెలిపారు.కాంగ్రెస్ పార్టీపై ఆరోపణలుచేయడం కాదని, కవిత చేస్తున్న ఆరోపణలకు హరీష్ రావు, కేటీఆర్, కేసీఆర్ లు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లాగ్రంథాలయసంస్థ చైర్మన్ మారు జోడు రాంబాబు,మార్కెట్ కమిటీ చైర్మన్ జూలుకుంట్ల లావణ్య రెడ్డి,చిల్పూర్ ఆలయకమిటీ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్ రావు, ఇతర ప్రజా ప్రతినిధులు, నియోజకవర్గ ముఖ్యనాయకులు, నాయకులు, కార్యకర్తలు,లబ్ధిదారు లు తదితరులు పాల్గొన్నారు.

# 30న సీఐటీయూ రాష్ట్ర మహాసభలు




రామకృష్ణాపూర్, నవంబర్ 14(జనంసాక్షి): ఈ నెల 30న మందమర్రి లో సీఐటీయూ రాష్ట్ర మహాసభలు నిర్వహిస్తున్నట్లు యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు తుమ్మల రాజారెడ్డి, జనరల్ సెక్రటరీ మంద నరసింహారావు అన్నారు. రామకృష్ణాపూర్ పట్టణంలోని యూనియన్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. సింగరేణిలో కార్మికుల హక్కుల సాధనకు సీఐటీయూ చేసిన కృషిని వివరించారు. 30 వ తేదిన నిర్వహించే మహాసభలో సింగరేణి పరిరక్షణకు అనేక తీర్మానాలు చేయనున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో అన్ని కార్మిక సంఘాలను సైతం కలుపుకొని కార్మికుల సంక్షేమం కొరకు ఐక్య పోరాటాలకు సిద్ధంగా ఉన్నామని తెలియజేశారు. ఈ సమావేశంలో బ్రాంచ్ కార్యదర్శి సాంబారు వెంకటస్వామి, ఉపాధ్యక్షులు వడ్లకొండ ఐలయ్య, రామగిరి రామస్వామి, నాయకులు రాజమౌళి, శ్రీనివాస్, యువ కార్మికులు పాల్గొన్నారు.

# జ్ఞాన భారతం మిషన్

## ప్రాచీన వారసత్వం డిజిటల్ యుగంలో సజీవం

భారతదేశం తన ఘన చరిత్రను మరోసారి జీవింపజేస్తోంది. ప్రాచీన హస్తప్రతులను డిజిటల్ రూపంలో సంరక్షించి ప్రపంచానికి అందుబాటులోకి తెచ్చే 'జ్ఞాన భారతం మిషన్' ద్వారా కేంద్ర ప్రభుత్వం ఈ మహోద్యమాన్ని చేపట్టింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించిన ఈ మిషన్, లక్షలాది హస్తప్రతులను రక్షించడమే కాక, వాటిని ఆన్‌లైన్ లైబ్రరీలో అందుబాటులో ఉంచి జ్ఞాన వ్యాప్తికి కొత్త దిశనిస్తోంది. 2003లో ప్రారంభమైన 'నేషనల్ మానుస్క్రిప్ట్స్ మిషన్' కంటే వేగవంతమైన, విస్తృతమైన ఈ ప్రాజెక్టు 2025–26 ఆర్థిక సంవత్సరానికి రూ.60 కోట్లు కేటాయించారు. ఇది కేవలం సంరక్షణ కాదు, భారత జ్ఞాన వారసత్వాన్ని ప్రపంచ 'విశ్వగురు'గా నిలిపే దిశగా ఒక మైలురాయి.

**మిషన్ లక్ష్యాలు: సంరక్షణ నుంచి వ్యాప్తి వరకు**

ప్రధాని మోదీ మాటల్లోనే ఈ మిషన్ సారాంశం దాగి ఉంది. "ప్రాచీన కాలంలో ఆధునిక సదుపాయాలు లేకపోయినా మన పూర్వీకులు విజ్ఞాన శాఖల్లో ముందుండేవారు. నలంద, తక్షశిల వంటి విశ్వవిద్యాలయాలు ప్రపంచాన్ని ఆకర్షించాయి. ఆ జ్ఞానం హస్తప్రతులు, స్మారక చిహ్నాలు, సాంస్కృతిక పద్ధతుల్లో సురక్షితంగా ఉంది. లక్షలాది హస్తప్రతులు నాశనమైనా, మిగిలినవి మన పూర్వీకుల జ్ఞాన ప్రయత్నాన్ని నిరూపిస్తున్నాయి" అని ఆయన అన్నారు. ఈ మిషన్ లక్ష్యం సంరక్షణ మాత్రమే కాదు, డిజిటలైజేషన్ ద్వారా ప్రపంచవ్యాప్తంగా జ్ఞాన వ్యాప్తి చేయడం. దేశవ్యాప్తంగా 'మానుస్క్రిప్ట్ రిసోర్స్ సెంటర్లు' (ఎంఆర్‌సీలు) స్థాపించి చెదురుమదురైన హస్తప్రతులను గుర్తించి, జాబితా తయారు చేస్తారు. ఇది 2047 నాటికి 'వికసిత భారత్' లక్ష్యానికి బలమైన మెట్టు.

**డిజిటల్ సాంకేతికత: ఏఐతో జ్ఞాన రక్షణ**

ఏఐ సాయంతో హస్తప్రతులను డిజిటల్ రూపంలో 'జ్ఞాన భారతం పోర్టల్'లో అందుబాటులోకి వస్తాయి. ఇది ప్రపంచంలోని ఎవరైనా ఎక్కడి నుంచైనా చదివే, పరిశోధన చేసే అవకాశం కల్పిస్తుంది.

కృత్రిమ మేధస్సు (ఏఐ) సాంకేతికతతో హస్తప్రతులను స్కాన్ చేసి డిజిటల్ రూపంలో మార్చుతున్నారు. ఈ డిజిటల్ డాటాను 'జ్ఞాన భారతం పోర్టల్' అనే ఆన్‌లైన్ లైబ్రరీలో ఉంచుతారు. ఇది ఏఐ ఆధారిత జాతీయ రిపోజిటరీగా పనిచేస్తుంది. ప్రపంచంలోని ఎవరైనా, ఎక్కడి నుంచైనా ఆన్‌లైన్‌లో వెతికి చదవొచ్చు, పరిశోధన చేయొచ్చు. ఇది జ్ఞానాన్ని ప్రజలకు చేర్చే సులభ మార్గం. పాఠశాలు, కళాశాల పాఠ్యాంశాల్లో ఈ జ్ఞానాన్ని చేర్చి యువతకు భారత వారసత్వాన్ని తెలియజేస్తారు. హస్తప్రతుల సంరక్షణ, అధ్యయనం కోసం యువకులకు శిక్షణ ఇస్తారు. 'మానుస్క్రిప్ట్ రిసోర్స్ పార్ట్నర్' వంటి కార్యక్రమాలతో కొత్త తరం నిపుణుల్ని తయారుచేస్తారు.

**తెలంగాణ పాత్ర: హైదరాబాద్ నుంచి జ్ఞాన ప్రసారం**

తెలంగాణ, ముఖ్యంగా హైదరాబాద్ ఈ మిషన్‌లో కీలక పాత్ర పోషిస్తోంది. స్టేట్ ఆర్కైవ్స్ ద్వారా హస్తప్రతుల సంరక్షణలో ముందుండి నడుస్తోంది. డీఆర్ బాబు అంబేడ్కర్ మెమోరియల్ లైబ్రరీలో అరబిక్, హిందీ, కన్నడ, మరాఠీ, పర్షియన్, సంస్కృతం, తమిళం, తెలుగు, ఉర్దూ భాషల్లో 6,428 హస్తప్రతులు ఇందులో ఉన్నాయి. మహాభారతం, భాగవతం వంటి మహా గ్రంథాల హస్తప్రతులు ఇందులో ఉన్నాయి. స్టేట్ సెంట్రల్ లైబ్రరీ (అసఫియా) ఈ సేకరణను డిజిటల్ చేయడంలో చురుగ్గా ఉంది. తెలంగాణ స్టేట్ గవర్నమెంట్ ఓరియంటల్ మానుస్క్రిప్ట్స్ లైబ్రరీ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (టీఎస్‌జీఓఎంఎల్ఆర్ఐ) హస్తప్రతులకు ప్రసిద్ధి. స్టేట్ ఆర్కైవ్స్ & రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లో పర్షియన్, ఉర్దూ భాషల్లో చారిత్రక హస్తప్రతులు ఉన్నాయి. ప్రపంచ ప్రసిద్ధ సాలార్‌జంగ్ మ్యూజియంలో కుతుబ్‌షాహీ రాజుల స్వహస్త సంతకాలతో కూడిన ముఖ్యమైన హస్తప్రతులు ఉన్నాయి.

**ప్రపంచ స్థాయి సహకారం: విశ్వగురు దిశగా అడుగు**

ఈ మిషన్ దేశ సరిహద్దులకు మాత్రమే పరిమితం కాదు. ఇతర దేశాల్లో ఉన్న భారతీయ హస్తప్రతులను తిరిగి పొందడం, అధ్యయనం కోసం అంతర్జాతీయ సహకారం అందిస్తారు. ఇది భారతీయ ప్రాచీన జ్ఞానం, ఆధునిక సాంకేతిక కలయికతో 'విశ్వగురు'గా నిలిపే ప్రయత్నం. జ్ఞాన భారతం మిషన్ కేవలం ప్రాజెక్ట్ కాదు, భారత జ్ఞాన వారసత్వానికి సజీవ స్మారకం. పూర్వీకుల సంపాదించిన అమూల్య జ్ఞానం భవిష్యత్ తరాలకు అందేలా చేస్తూ, 2047 నాటికి వికసిత భారత్ నిర్మాణంలో ఈ మిషన్ కీలక పాత్ర పోషిస్తుంది. ఇది భారతదేశం యొక్క దూరదృష్టి, సాంస్కృతిక గర్వం, సాంకేతిక పురోగతి కలయిక.



డాక్టర్ జి. రాధికా రాణి,
అసిస్టెంట్ ప్రొఫెసర్,
హెడ్ డిపార్ట్మెంట్ ఆఫ్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్, కాకతీయ యూనివర్సిటీ, వరంగల్

# జనంసాక్షి ఎగ్జిట్ పోల్ నిజాయితీకి నిదర్శనం




| | కాంగ్రెస్ | బీఆర్ఎస్ | బీజేపీ |
|---|---|---|---|
| నియోజకవర్గవ్యాప్తంగా పార్టీలవారీగా ఓటింగ్ శాతం | 48.5% | 44% | 7.5% |
| **డివిజన్ల వారీగా ఓటింగ్ శాతం** | | | |
| రహమత్‌నగర్ | 55% | 39% | 5.4% |
| బోరబండ | 33% | 60% | 6.8% |
| సోమాజిగూడ | 49.5% | 42% | 7.7% |
| యూసుఫ్‌గూడ | 48% | 38% | 14% |
| వెంగళరావునగర్ | 53% | 42% | 4.5% |
| ఎర్రగడ్డ | 43% | 52% | 5% |
| షేక్‌పేట్ | 53.2% | 35% | 11.7% |

ఎన్నికల సమయం ప్రజలకు ఉత్సాహభరితమే కాక, ఆత్రుతకలిగించే క్షణం. అలాంటి సమయం లో, జనం సాక్షి ఎగ్జిట్ పోల్ ఫలితాలు ప్రతిసారి నిజంగా తేలడం, ప్రజల నమ్మకానికి, రాజకీయ విశ్లేషకుల ప్రాముఖ్యతను ఇస్తుంది. ఎడిటర్ రెహ్మాన్ నిబద్ధతకు ఇది నిదర్శనం. ప్రతి ఎన్నికలో, ground level surgery ద్వారా క్షేత్ర స్థాయి ఓటర్లతో మాట్లాడి, క్షుణ్ణంగా విశ్లేషించి నిజాయితీగా ఓటర్ల నాడిని దొరకపట్టి గెలుపెవరిదో అంచనా వేయడం. సెఫాలజిస్టుల గణాంకాలు, రాజకీయ శాస్త్రం, సామాజిక శాస్త్రం అంశాలను సమీకరించి ఓటర్ల ప్రవర్తనను విశ్లేషిస్తారు. ఇదే విధంగా, జనం సాక్షి ఎగ్జిట్ పోల్ ఫలితాలు ప్రజల నిజమైన అభిప్రాయాలను అంచనా వేయడానికి, సమగ్ర మరియు నైపుణ్యాన్ని కలిపి న్యాయమైన ఫలితాన్ని అందిస్తుంది. ఈ రకంగా తెలంగాణ రాష్ట్రంలో జనం సాక్షి ఒక అగ్రగామి సెఫాలజీ సంస్థగా నిలదొక్కుకోవడం అభినందనీయం. "పీరిని ఓటమిపాలయ్యే పార్టీ శ్రేణులు ట్రోలింగ్ చేసినా, పట్టించుకోకుండా తమ పని తాము చేసుకుంటూ పోవడం వీరి ప్రత్యేకత." ప్రతిసారి ఫలితాలు సరిగ్గా తేలడం, ప్రజల నమ్మకాన్ని పెంచి, పార్టీ నేతలకు, సామాజిక విశ్లేషకులకు, సాధారణ ప్రజలకు మార్గదర్శకం అవుతుంది. ఎటువంటి ప్రాబల్యం, లాబీయింగ్ లేకుండా, నిజమైన ఓటు సంకేతాలను ప్రతిబింబించడం, జనం సాక్షి ఫలితాలను ప్రత్యేకం చేస్తుంది. "ప్రజలు ఓటు హక్కును వినియోగించిన సరైన ప్రతిబింబం – జనం సాక్షి ఇస్తున్న ఫలితాల్లో నిజమైన అవగాహన."







ఇలాంటి నిబద్ధత, ground level surgery, గణాంక విశ్లేషణ కలిపి జనం సాక్షి ఎగ్జిట్ పోల్ ప్రజాస్వామ్యానికి ఒక విశ్వసనీయ సూచికగా నిలిచింది. ఇది కేవలం ఓ మీడియా సంస్థ ఫలితం కాదుబీ ఇది ప్రజల నిజమైన సంకేతాలను ప్రజాస్వామ్యానికి అందించే ఒక మార్గం. జనం సాక్షి ఎగ్జిట్ పోల్ ప్రతిసారి నిజమైన, విశ్లేషణాత్మక, నిబద్ధతతో కూడిన ఫలితాలను ఇస్తూ, భారతీయ మీడియా మరియు ప్రజాస్వామ్యానికి గర్వకారణం.



రచయిత: సయ్యద్ రఫీ (చిత్ర దర్శకుడు)

# ఫాసిస్ట్ విధానాలను అమలుపరిచిన ఆర్ఎస్ఎస్-బిజెపి

ప్రజాస్వామ్యం మీద దాడి, ఎన్నికల మోసాలు, ఫాసిజం ప్రభావం వంటి కీలక అంశాలను లేవనెత్తుతోంది. 2025 బీహార్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు (నవంబర్ 6–11 తేదీల్లో జరిగినవి) ఇండియన్ నేషనల్ డెమాక్రటిక్ అలయన్స్ (ఎన్‌డీఏ)కు ప్రధానంగా బీజేపీ–జేడీయూ భారీ విజయాన్ని అందించాయి. 243 సీట్లలో ఎన్‌డీఏకు 200ల సీట్లు వచ్చాయి, నితీష్ కుమార్ ముఖ్యమంత్రి పదవిని కొనసాగించే స్థితిలో ఉన్నారు. ప్రధానమంత్రి మోదీ దీన్ని "మహిళలు, యువత (ఎంవై ఫార్ములా)"కు ఆపాదించారు. అయితే, మహాగఠబంధన్ (ఆర్జేడీ–కాంగ్రెస్) కేవలం 30–40 సీట్లకే పరిమితమైంది, కాంగ్రెస్ పార్టీ మరోసారి బలహీనపడింది (7 సీట్లకు మాత్రమే). వోటర్ టర్నౌట్ 67.13%గా రికార్డ్ స్థాయికి చేరింది.

ఈ ఫలితాలు "ప్రజల సంకల్పం" అని పాలకవర్గం చెప్పుకుంటున్నప్పటికీ, విపక్షాలు, సివిల్ సొసైటీలు ఎన్నికల ప్రక్రియలో మోసాలు జరిగాయని ఆరోపిస్తున్నాయి. ఎన్నికల సంఘం (ఈసీఐ)పై దాడులు, వోటర్ డిలీషన్, ఈవీఎం సమస్యలు వంటివి చర్చనీయాంశాలు. ఈ వివాదాలను బహుళ మూలాల నుంచి పరిశీలిస్తే, ఇక్కడ కొన్ని కీలక వాస్తవాలు:

**1. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్), వోటర్ డిలీషన్: 'క్లైట్ కూప్' కాదా?**

ఈసీఐ జులై–ఆగస్టు 2025లో ఎస్ఐఆర్ పేరుతో బీహార్ వోటర్ లిస్టును రివైజ్ చేసింది. ఫలితంగా 65–66 లక్షల మంది వోటర్ల పేర్లు తొలగించబడ్డాయి. విపక్షాలు (కాంగ్రెస్, ఆర్జేడీ) ఇది ముస్లింలు (30% డిలీషన్లు), దళితులు, ఆదివాసీలు, మహిళలు (7 లక్షలు మరిన్ని డిలీషన్లు)పై లక్ష్యంగా ఉందని ఆరోపించాయి. రాహుల్ గాంధీ "ఆటం బాంబ్ లెవల్ ప్రూఫ్" ఉందని, బీజేపీ–ఈసీఐ కొల్యూషన్‌ని ఆరోపించారు. ప్రశాంత్ భూషణ్ (ఏడీఆర్) సుప్రీంకోర్టులో "ఎక్స్‌క్లూడెడ్ వోటర్లు మెజారిటీ మైనారిటీలు" అని చెప్పారు. డూప్లికేట్ పేర్లు (5,000ల అనుమానాస్పద) చేర్పినట్లు కూడా ఆరోపణలు.

ఈసీఐ మాత్రం ఎస్ఐఆర్‌ను "రొటీన్ క్లీనప్"గా వర్ణించి, "ఇనెలిజిబుల్ వర్శన్లు తొలగించాం, ఎక్స్‌పాన్షన్ కూడా జరిగింది" అని డిఫెండ్ చేసింది. సుప్రీంకోర్టు అక్టోబర్‌లో "కన్ఫ్యూజన్ ఫ్లాగ్" చేసి, ఈసీఐకు కొత్త వోటర్లపై స్పష్టత ఇవ్వాలని ఆదేశించింది. బీజేపీ సైడ్ నుంచి "ఓపోజిషన్ డిస్‌క్రెడిట్ చేయాలని ఇల్లీగల్ మైగ్రేంట్స్" అని ఆరోపణలు. ఎక్స్ (ట్విట్టర్)లో కూడా ఈ విషయం హాట్ టాపిక్: "బీహార్ వోటర్ పర్జ్ 66 లక్షలు, ఓపోజిషన్ వోట్ థెఫ్ట్ అంటోంది" అనే పోస్టులు వైరల్.

**2. ఈవీఎం, డబుల్ వోటింగ్, కౌంటింగ్ అనుమానాలు: మోసాలు లేక మిథ్యలు?**

లెక్కింపు రోజు (నవంబర్ 14) "సర్వర్ వ్యాస్లు", నెమ్మది కౌంటింగ్, ఈవీఎం మార్పిడి వీడియోలు వైరల్ అయ్యాయి. ఆర్జేడీ నేతలు, రోహతాస్‌లో "సీసీటీవీలు 30 నిమిషాలు ఆఫ్, ఈవీఎం ట్యాంపరింగ్" అని ఆరోపించింది. సమస్తీపూర్‌లో వీవీప్యాట్ స్లిప్స్ బయటపడ్డ వీడియోలు, 5,000ల డబుల్ వోటింగ్ కేసులు (బీజేపీ నేతలపై కూడా) బయటపడ్డాయి. రాహుల్ గాంధీ "వోట్ చోరీ" క్యాంపెయిన్ నడిపారు, కానీ వోటర్లు దాన్ని తిరస్కరించారని ఈకనామిక్ టైమ్స్ విశ్లేషణ.

ఈసీఐ "అన్నీ సెక్యూర్, మిథ్యా ఆరోపణలు" అని తిరస్కరించింది. బీజేపీ "ప్రజల మండేట్" అని చెప్పుకుంటూ, విపక్షాలను "సోర్ లూజర్స్"గా పిలిచింది. ఫ్రంట్‌లైన్ మ్యాగజైన్ ప్రకారం, ఈసీఐ బీహార్ నుంచి "లెసన్స్ లెర్న్" చేసుకుని, భవిష్యత్ ఎన్నికల్లో బద్దెన్ పార్టీలకు మార్చింది.

**3. ప్రతిపక్ష బలహీనత, హిందుత్వ ప్రచారం: ఐక్యత లోపం**

ఎడిటోరియల్‌లో చెప్పినట్లుగానే, మహాగఠబంధన్ సీట్ల కోసం తగాదాల్లో చిక్కుకుంది. బీజేపీ "డబుల్ ఇంజన్" (కేంద్ర–రాష్ట్ర), మహిళలకు డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డీబీటీ), వెల్ఫేర్ స్కీమ్స్, హిందుత్వ ప్రచారాన్ని పూర్తిగా ఉపయోగించింది. అల్ జజీరా విశ్లేషణ ప్రకారం, మోదీ అలయన్స్ "స్వీప్" చేసింది %జేఐఎం%, కానీ కాంగ్రెస్ "వీక్ లింక్"గా మిగిలింది. సీపీఐ(ఎంఎల్) రెడ్ స్టార్ వంటి ఎక్స్‌ట్రీమ్ లెఫ్ట్ గ్రూపులు "ఫాసిజం" అని పిలువులు ఇస్తున్నారు, కానీ మెయిన్‌స్ట్రీమ్ మీడియా (ఎన్‌డీటీవీ, హిందూ) దీన్ని "పొలిటికల్ స్కార్క్"గా చూస్తోంది.

**ప్రజాస్వామ్యం రక్షణ: పోరాటం లేక పరిశీలన?**

ఈ ఫలితాలు భారత ప్రజాస్వామ్యాన్ని పరీక్షిస్తున్నాయి. వికీపీడియా ప్రకారం, 2025 ఇండియన్ ఎలక్టోరల్ కాంట్రవర్సీలో రాహుల్ గాంధీ ఆగస్టు 1న "ఎవిడెన్స్ ఆఫ్ మ్యానిపులేషన్" చెప్పారు. బీబీసీ రిపోర్ట్‌లో "డెడ్ పీపుల్, రాంగ్ ఫోటోలు" ఇంకా లిస్టులో ఉన్నాయని బయటపడింది. బీబీసీ, అల్ జజీరా వంటి అంతర్జాతీయ మీడియా వివక్ష ఆరోపణలను హైలైట్ చేస్తున్నాయి, మరోవైపు పీఐబీ, ఈసీఐ అధికారిక సైట్లు "ఫెయిర్ ప్రాసెస్"ని నొక్కి చెబుతున్నాయి.

ఎడిటోరియల్ చివరి పిలుపు "ఫాసిజం నశించాలి, ప్రజా పోరాటం వర్ధిల్లాలి" – ప్రజల అవగాహనను రెచ్చగొట్టేలా ఉంది. అయితే, ఇది సబ్జెక్టివ్ వ్యూపాయింట్‌లే వాస్తవాలు రెండు వైపుల సాక్ష్యాలను సమానంగా బలం చూపుతున్నాయి. ప్రజాస్వామ్య రక్షణకు ఐక్యత, పరిశోధన, కోర్టు చర్యలు కీలకం. మరిన్ని వివరాలకు ఈసీఐ సైట్ (రిజల్ట్స్.ఈసీఐ.గవ్.ఇన్) చూడవచ్చు.

కొల్లిపర వెంకటేశ్వరరావు,
రాష్ట్ర కార్యదర్శి, సీపీఐ(ఎంఎల్) రెడ్ స్టార్,
ఆంధ్రప్రదేశ్ కమిటీ (9392325652)

### ఆఖరి ఆరంభం

కొట్టి నన్ను బంధిస్తే
కట్టగట్టబడ్డాన్న నీ భ్రమ
కట్టి నిను నాపై కాటికి
నాల్గు భుజాలు నెట్టుకొట్టడానికదేవి వాస్తవం
నన్ను పడగొట్టి పెట్ట
పరిశ్రమలు నిలబెట్టానన్నది
నీ భ్రమ పెట్టి పడుకోబెట్టి నిను నాపై
తగలెట్టుకోడానికన్న వాస్తవం
నన్ను తరిగించి నీ ఇంట కాసులు
పెరిగించానన్నది నీ భ్రమ
మంచు కొండలు కరిగించి
ప్రళయంలో ప్రపంచాన్ని ముంచేయడానికన్నది వాస్తవం
నా తలను తొక్కి శిరాస్తి ధరలు కొండెక్కిం
వ్యాపారమన్నది నీ భ్రమ
నీ తలకు తగిలించే శ్వాసల సీసాల
నల్లబజారుకు నాంది అన్నది వాస్తవం
నన్ను నిలువునా చీల్చిన శబ్దం నా చావు కేకల
రాగాలన్నది నీ భ్రమ
మేఘాలు మొఖం చాటేస్తే నీటి ఎద్దడికి భూమి
పగిలిన శోక తబ్దాలన్నది వాస్తవం
నా మొదల్లో నువ్వు పెట్టిన గొడ్డలి నా ఆఖరి
శ్వాసకు ప్రారంభమని నీ భ్రమ
నీ ఆఖరి శ్వాస అంతానికదే ఆర్భాటాల
ఆరంభమనేది వాస్తవం

నేపా సంతోష్ అచ్యుత్ కుమార్,
అసిస్టెంట్ ప్రొఫెసర్.

# బీసీల కోసం కాన్షీరాం వలే విశారదన్ మహారాజ్ పోరాటం


భారతీయ సామాజిక వ్యవస్థలో సంఘ పరివర్తన కోసం రాజకీయ సాంస్కృతిక పరివర్తన ఉద్యమాల్లో భాగంగా పోరాడి అమరులైన వారిలో అగ్రవర్ణాల నుండి నాయకత్వం వహించిన వ్యక్తులు ఉన్నారు. అదే విధంగా అణగారిన వర్గాల నుండి ఉద్భవించిన గొప్ప వీరులు, మహనీయులు ఉన్నారు. కాకపోతే అగ్రవర్ణాలు తీసుకొచ్చిన కుల వ్యవస్థ మూలంగా సామాజికంగా రాజకీయంగా ఆర్థికంగా సాంస్కృతికంగా అగ్రవర్ణాల చేత తరతరాలుగా దోపిడికి గురై, అసమానతలకి వ్యతిరేకంగా ఉద్యమించిన గొప్ప నాయకులలో పీడిత కులాల నుండి ఉద్భవించిన నాయకుల సంఖ్య ఉండటం గమనార్హం. అందులో భాగంగా ప్రాచీన కాలంలో అగ్రవర్ణ మనువాద బ్రాహ్మణులు తీసుకొచ్చిన కుల అసమాన తత్వానికి అభిముఖంగా క్షత్రియ కులంలో జన్మించిన గౌతమ బుద్ధుడు స్వేచ్ఛ సమానత్వం సోదరభావం కోసం విప్లవాత్మక ఉద్యమాన్ని చేపాదనే విషయం జగమెరిగిన సత్యం. ఆ తరువాత బుద్ధుడి వారసత్వాన్ని బింబిసారుడు, అశోకుడు, పుష్యమిత్ర శుంగుడు కొనసాగించగా భారతదేశంలో సమానత్వం కోసం సామాజిక న్యాయం కోసం ఎందరో మహావీరుల నాయకత్వంలో ఎన్నో ఉద్యమాలు పురుడు పోసుకున్నాయని గత చరిత్ర నిరూపిస్తున్నది.

ఇక ఆధునిక యుగానికి వచ్చేసరికి ఉత్తర భారతంలో కంటే దక్షిణ భారతంలోని అనేక సాంస్కృతిక పరివర్తన ఉద్యమాలు జరిగాయి. ఎందుకంటే విదేశాల నుండి వచ్చిన అగ్రవర్ణ ఆర్యులు ఉత్తర భారతంలోనే వారి శరీర గుణగణాలకి సరిపడా వాతావరణం ఉండడం మూలంగా ఉత్తర భారతంలోని స్థిరపడి వ్యవహరించారు. వారి భయబ్రాంతులకు దాడులకి ఉత్తర భారతం నుండి దక్షిణ భారతానికి వలసెళ్ళిన దేశ నిర్మాతలైన, మూలవాసులైన అణగారిన కులాల దక్షిణ భారతానికి వచ్చి స్థిరపడినట్లుగా చారిత్రక ఆధారాలు తెలుపుతున్నాయి. అందులో భాగంగానే దక్షిణ భారతం నుండి అగ్రవర్ణ బ్రాహ్మణ అసమానత్వ సిద్ధాంతానికి అభిముఖంగా తమిళనాడు కేంద్రంగా బీసీ నాయకర్ కులంలో జన్మించిన పెరియార్ సామాజిక సాంస్కృతిక రాజకీయ పరివర్తన ఉద్యమాన్ని చేశారు. ఇక కేరళ నుండి అగ్రవర్ణ అసమానత్వ సిద్ధాంతానికి అభిముఖంగా సామాజిక న్యాయం కోసం, మనుషుల మధ్య సమానత్వం కోసం నారాయణ గురు ఉద్యమించారు. అలాగే కర్ణాటకలో బసవేశ్వరుడు సామాజిక అసమానతలని రూపుమాపడానికి సమానత్వం కోసం, మనుషులందరూ సమానమని చెప్పడం కోసం భక్తి ఉద్యమంలో ప్రముఖ సంఘ సంస్కర్త ఉన్నారు. ఇక మహారాష్ట్రకి వస్తే మాలి కులంలో జన్మించిన మహాత్మ జ్యోతిరావు పూలే, మహర్ కులంలో జన్మించిన బాబా సాహెబ్ అంబేద్కర్ వీళ్ళు వాళ్ల కులం కోసమే పోరాటం చేయకుండా, సంఘం లోని పీడిత ప్రజల కోసం, అగ్రవర్ణ మనువాద అసమానత సాంస్కృతి మూలంగా దోపిడీకి గురైన అణగారిన సమాజం కోసం పోరాటం చేశారు. అదేవిధంగా ఉత్తరప్రదేశ్ లో చమర్(మాదిగ) కులంలో పుట్టిన సంత్ రవిదాస్ 500 సంవత్సరాలక్రితమే చమర్ కులస్తుల కోసమే కాకుండా బహుజన సమాజ విముక్తి కోసం సాంస్కృతిక ఉద్యమాన్ని కొనసాగించి గొప్ప భక్తి ఉద్యమకారుడిగా చరిత్రలో అమరుడుగా ఉన్నారు. సంత్ రవిదాస్ శిష్యుడైన గురునానక్ సిక్కు మతంలో గొప్ప సాంస్కృతిక ఉద్యమాన్ని చేపట్టి సమానత్వం కోసం పాటుపడినాడు.

ఈ యొక్క మహనీయుల ఉద్యమ వరంపరలో భాగంగా తెలంగాణ కేంద్రంగా గత దశాబ్ద కాలంగా డా. విశారదన్ మహారాజ్ సమాజంలో పీడితులైన దుఃఖితులైన అణగారిన వర్గాల కోసం సామాజిక సాంస్కృతిక రాజకీయ పరివర్తన ఉద్యమాన్ని నీతి నిజాయితీతో అలుపెరుగని పోరాటం చేస్తున్నారు. అందులో భాగంగానే మొదటి ప్రాధాన్యతలో భాగంగా సమాజంలో అట్టడుగున ఉన్న మాదిగ కులస్తుల కోసం సామాజిక సాంస్కృతిక ఉద్యమం చేపట్టి, అక్టోబర్.14.2017 నుండి ఏప్రిల్.14.2018 లో ఐదు వేల కిలోమీటర్ల మహా పాదయాత్రలు చేసి మహా అధిగ(మాదిగ) కులస్తులలో ఆత్మస్థాయిత భావాన్ని తీసివేసి స్వతంత్ర స్వర్గంలో స్వరాజ్యం కోసం పోరాడి ఆత్మగౌరవంతో బ్రతికేలా మాదిగ కులస్తుల్లో గొప్ప విప్లవాన్ని సృష్టించారు. అంతేకాదు సమాజంలో అగ్రవర్ణాలు తీసుకొచ్చిన కుల మూలంగా వెనుకబడిన తరగతులైన బీసీల కోసం సామాజిక సాంస్కృతిక ఉద్యమాన్ని చేయాలని మార్చి.15.2022 నుండి ఏప్రిల్.30.2023 లో పదివేల కిలోమీటర్ల స్వరాజ్య పాదయాత్రను నిర్వహించి బీసీ కులాలలో, ఎస్సీ కులాలలో బలమైన సామాజిక రాజకీయ సాంస్కృతిక విప్లవాన్ని రగిలించారు. విశారదన్ మహారాజ్ పాదయాత్రల మూలంగానే నేడు తెలంగాణ సమాజంలో బీసీ, ఎస్సీలు తమ జనాభా దామాషా ప్రకారం సమస్త రంగాల్లో, రాజకీయాల్లో వాటా దక్కాలని అగ్రవర్ణ పార్టీలని ప్రశ్నిస్తు ఉద్యమిస్తున్నారని అనేక మంది మేధావులు, విద్యావంతులు అభిప్రాయ పడుతున్నారు. కాబట్టే ఇక్కడ మనం గమనించవలసిన చారిత్రక సత్యం ఏంటంటే భారతీయ సమాజంలో అసమానతలను రూపుమాపడానికి సమాజ స్థాపన కోసం ఏ కులంలో పుట్టిన నాయకుడు వారి సొంత కులాలకే సంస్కరించుకోవడం కోసం ఉద్యమించలేదు, సంఘంలో పీడనకు గురవుతున్న ప్రతి కులాన్ని ఉద్ధరించి, తిరిగిట్టి ఆత్మగౌరవంతో బ్రతికేలా ఉద్యమాలు చేపట్టారు. అదేవిధంగా తెలంగాణలో విశారదన్ మహారాజ్ కూడా జన్మతః ఎస్సీ మాదిగ కులంలో పుట్టిన ఒక్క మాదిగ సమాజం కొరకే కాకుండా, సమాజంలో 90% ఉన్న బీసీ ఎస్సీ ఎస్టీల కోసం దశాబ్ద కాలం పైనుండి సామాజిక రాజకీయ ఆర్థిక సాంస్కృతిక పరివర్తన ఉద్యమాన్ని రాజీ పడకుండా నీతి నిబద్ధతతో కొనసాగిస్తున్నారు. అందులో భాగంగానే బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీ పేరుతో సామాజిక న్యాయం కోసం అణగారిన వర్గాల రాజ్యాధికారం కోసం తెలంగాణ లోని అన్ని గ్రామాల్లో సామాజిక, రాజకీయ, సాంస్కృతిక చైతన్యాన్ని ఉద్యతంగా రగిలించడానికి గత ఏప్రిల్.14.2025 న ఒక లక్ష కిలోమీటర్ల మా భూమి రథయాత్రను చేపట్టి, మూడు సంవత్సరాల మూడు నెలల వరకు అనగా జూలై.31.2028 వరకు ఈ రథయాత్ర చేయనున్నారు. అంతే కాకుండా 42% బీసీ రిజర్వేషన్ సాధన సమితి పేరుతో ఉద్యమాన్ని కొనసాగిస్తూ, ఇందులో ప్రధాన వ్యక్తులుగా హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి మరియు జాతీయ బీసీ కమిషన్ చైర్మన్ ఐన జస్టిస్ ఈశ్వరయ్య, హనుమంత్ చైర్మన్ గా, రిటైర్డ్.మాజీ. కలెక్టర్.టి. చిరంజీవులు ఉద్యమ వ్యవస్థాపకులుగా, డా. విశారదన్ మహారాజ్ హనుమంత్ వైస్ చైర్మన్ గా, బాలరాజు గౌడ్ వర్కింగ్ ప్రెసిడెంట్ గా అగ్ర నాయకత్వంలో ఉన్నారు. వీరు చేస్తున్న ఉద్యమానికి ఇంకా అనేక బీసీ ఎస్సీ ఎస్టీల సంఘాలు నైతిక మద్దతు ఉండడం గమనార్హం. అందులో భాగంగానే నవంబర్.15.2025 న కామారెడ్డి లోని సత్య కన్వెన్షన్ ఫంక్షన్ హాల్ లో వేలాది మందితో బీసీ మందిని సమీకరించి వారికి తోడుగా సహబాధితులైన ఎస్సీ, ఎస్టీ విద్యావంతులని, సామాన్య ప్రజలు సైతం స్వతంత్ర స్వర్గంలో రావాలని పిలుపునిస్తూ ఆహ్వానించడం జరిగింది. ఈ సభలో ప్రధానంగా గతంలో కాంగ్రెస్ పార్టీ చేసిన కామారెడ్డి డిక్లరేషన్ కి అభిముఖంగా బీసీల 42% విద్యా ఉద్యోగ స్థానిక సంస్థల రిజర్వేషన్ సాధించడానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్డీఏ కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేలా 42% బీసీ రిజర్వేషన్ సాధన సమితి పేరుతో "బీసీ ఆక్రోశ" సభని నిర్వహించున్నారు.



ఇక్కడ ప్రధానంగా గమనించాల్సిన విషయం ఏంటంటే తాజాగా విశారదన్ మహారాజ్ బీసీ కులస్తుడు కాదు, అలాంటప్పుడు బీసీల కోసం ఎందుకు ఉద్యమించాలని కొందరు అగ్రకుల పార్టీలకి దళారి, చెంచాలుగా వ్యవహరించే వాళ్ళు విశారదన్ మహారాజ్ నాయకత్వాన్ని, మేధస్సుని శంకిస్తూ ప్రశ్నిస్తున్నారు.? అంతటితో ఆగకుండా ఎస్సీ మాదిగ కులంలో పుట్టిన విశారదన్ మహారాజ్ బీసీల హక్కుల కోసం ఎలా పోరాటం చేస్తారని వ్యక్తిత్వాన్ని కించపరిచేలా కుటుంబ మర్యాదలకు అగౌరవం వచ్చేలా తప్పుడు ఆరోపణలతో దుష్ప్రచారం మానవతా నైతిక విలువలకి మచ్చ తెస్తున్నారు.కానీ ఇక్కడ విశారదన్ మహారాజ్ ఏ ఒక్క బీసీ నాయకుడిని ఉద్దేశపూర్వకంగా తప్పుడు పద జాలంతో తిట్టి విమర్శించడం లేదు, ప్రస్తుతం ఉన్న బీసీ నాయకులని అగ్రకుల పార్టీలకి కృతజ్ఞతలు వారి ఆలోచనలకు బందీలుగా కాకుండా, ఇన్నాళ్ల ఓపికతో వ్యవహరించి అగ్రకుల పార్టీలని అభ్యర్థిస్తూ బీసీల హక్కుల్ని అడుక్కున్నది చాలు. ఇకపై బీసీలు స్వతంత్రంగా వ్యవహరిస్తూ అగ్రకులాలు ఇచ్చే భిక్షకు మెతుకుల కోసం ఆశపడకుండా, రాజ్యాంగ బద్ధమైన ప్రజాస్వామ్య బద్ధమైన హక్కుల కోసం అగ్రకుల పార్టీలకి అభిముఖంగా బీసీ నాయకులు స్వతంత్ర స్వర్గంలో నిబద్ధతతో రాజీ పడకుండా పోరాటం చేయాలని విశారదన్ మహారాజ్ పిలుపునిస్తున్నారు. అందుకు అగ్రకుల పార్టీలకి దళారీలుగా వ్యవహరించే కొందరు బీసీ నాయకులని విచక్షణ జ్ఞానం లేని సత్యాన్ని చూడలేని అజ్ఞాన మూర్ఖంలో ఉండే కొందరు బీసీ వ్యక్తులు విశారదన్ మహారాజ్ వ్యక్తిత్వాన్ని కించపరిచేలా నిరాధారాలతో తప్పుడు ఆరోపణలు చేస్తూ అగ్రకుల పార్టీ నాయకుల మన్ననలు పొందాలని చూస్తున్నారు. కానీ ఇక్కడ గమనించాల్సిన చారిత్రక అంశం ఏమిటంటే భారతీయ కుల,మత అసమానత వ్యవస్థలో సామాజిక రాజకీయ సాంస్కృతిక పరివర్తన కోసం ఉద్యమించిన ఏ మహనీయుడు కూడా ఒక్క కులంలో మార్పులు తీసుకురావడం కోసం పాటుపడకుండా పీడనకి దోపిడీకి గురైన సబ్బండ కులాలని సంస్కరించడం కోసం పాటుపడినారు. అందులో భాగంగానే బుద్ధుడు నుండి అశోకుడు, సాహు మహారాజ్,శివాజీ మహారాజ్,మహాత్మా జ్యోతిరావు పూలే, అంబేద్కర్, పెరియార్, నారాయణ గురు, బసవేశ్వరుడు, సంత్ రవిదాస్, కబీర్ గురునానక్ ఇలా మహనీయుల ఉద్యమానికి కొనసాగింపు ఉద్యమంలో భాగంగానే తెలంగాణ కేంద్రంగా విశారదన్ మహారాజ్ పని చేస్తున్నారని చారిత్రక సత్యాన్ని అణగారిన వర్గాల మేధావులు, విద్యావంతులు గ్రహించాలి తప్ప, జన్మతః ఎస్సీ సామాజిక వర్గంలో పుట్టిన విశారదన్ మహారాజ్ బీసీల కోసం ఉద్యమించాల్సిన అవసరం లేదనుకునే అల్ప బుద్ధితో ఆలోచించడం అంటే ఆధునిక అనాగరిక చర్యకి నిదర్శనం.! నాడు బీసీ కులానికి చెందిన సాహు మహారాజ్ ప్రోత్సాహంతోనే అంబేద్కర్ చదువుకున్నారని ఆదేవిధంగా బీసీ మాలి కులంలో జన్మించి, అంటరాని మహర్,చమర్ కులాన్ని సంస్కరించడం కోసం పాటుపడిన మహాత్మ జ్యోతిరావు పూలేని అంబేద్కర్ తన గురువుగా స్వీకరించారు.అంబేద్కర్ ఉద్యమానికి కాన్షీరాం సామాజిక రాజకీయ సాంస్కృతిక పోరాటాన్ని కొనసాగించారు. అందులో భాగంగానే దాదాపు రెండు నెలల పాటు పార్లమెంటు ముందు టెంట్ వేసుకొని నాటి వి.పి.సింగ్ ప్రభుత్వం దిగివచ్చి బీసీలకి 27% విద్యా, ఉద్యోగ రిజర్వేషన్ ఇచ్చేలా ఎస్సీ చమర్(మాదిగ) కులంలో పుట్టిన కాన్షీరాం బీసీల కోసం మహోత్తరమైన ఆదర్శవంతమైన పోరాటం చేశారు. ఈ మహనీయుల ఉద్యమ వరంపరలో భాగంగానే బీసీల రుణం చెల్లించుకోవడానికి వారి సామాజిక రాజకీయ హక్కుల కోసం ఉద్యమించి బీసీ సమాజానికి మరియు మహనీయులు పూలే, అంబేద్కర్ ల ఉద్యమానికి రుణపడి ఉంటానని అందులో భాగంగానే నేడు విశారదన్ మహారాజ్ బీసీ ల రాజ్యాంగ బద్ధ హక్కుల కోసం సామాజిక రాజకీయ పోరాటాన్ని చేస్తున్నారు. ఇక్కడ ప్రధానంగా బీసీ కులాల మేధావులు, విద్యావంతులు గ్రహించాల్సిన విషయం ఏంటంటే బీసీల హక్కుల కోసం, బీసీ కులాల విముక్తి కోసం సహ బాధితులైన అణగారిన వర్గాల హక్కుల కోసం, రాజ్యాధికారం కోసం సామాజిక రాజకీయ సాంస్కృతిక పరివర్తన కోసం ఎంతటి నీతి నిజాయితీతో నిబద్ధతతో విశారదన్ మహారాజ్ పని చేస్తున్నారా లేదా అనే అంశాన్ని చూడాలి తప్ప, ఆయనకి కులంతో కాదు, ఏ కులంలో పుట్టిన వ్యక్తి వారి కులాలనే సంస్కరించుకోవడం కోసం ఉద్యమించాలంటే ఇది ఆధునిక అనాగరిక, అప్రజాస్వామిక చర్యకి నిదర్శనంగా, మానవతా,నైతిక విలువలకు, భారత రాజ్యాంగ మౌలిక భావాలకు వ్యతిరేక అంశం అవుతుందని కుల,మతాలకతీతంగా మేధావులు, విద్యావంతులు, సామాన్య ప్రజలు సైతం గ్రహించాలని చారిత్రక సత్యం.



పుల్లెంల గణేష్
(ధర్మ సమాజ్ పార్టీ బి స్టడీ, రీసెర్చ్ టీం రాష్ట్ర ఇంచార్జ్)
95503041549

## రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజాపాలన ధ్యేయం

● ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య



**టేకులపల్లి, నవంబర్ 14 (జనంసాక్షి) :** రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా పాలన ధ్యేయమని ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. బేతంపూడి సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో బోడు గ్రామములో మొక్కజొన్న, వరి కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా బోర్ రైతు వేదికలో ఏర్పాటుచేసిన రైతు సమావేశంలో ఆయన మాట్లాడారు. దళారుల చేతిలో రైతులు మోసపోకూడదని ప్రభుత్వం రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లభించడం కోసం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పండించిన పంటలను దళారులకు అమ్మి మోసపోకుండా, కొనుగోలు కేంద్రాలలోనే అమ్ముకోవాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో బేతంపూడి సొసైటీ అధ్యక్షులు లక్కినేని సురేందర్ రావు, జిల్లా వ్యవసాయ అధికారి వేల్పుల బాబురావు, కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ భరత్, తహసిల్దార్ వీరభద్రం, ఇల్లందు వ్యవసాయ సంచాలకులు లాల్చంద్, ఏవో నీరుడు అన్నపూర్ణ, ఇల్లందు వ్యవసాయ మార్కెట్ చైర్మన్ రాంబాబు, విద్యుత్ ఏఈఈ దేవా, సొసైటీ సీఈవో ప్రేమాచారి, ఏఈఓలు శ్రావణి, భాగ్యలక్ష్మి, రమేష్, సొసైటీ డైరెక్టర్లు, రైతులు, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేసిన సబ్ కలెక్టర్

● రైతుల ప్రయోజనాలే ప్రభుత్వ ధ్యేయం
● సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ మాలెంపాటి

**మాడ్గులపల్లి, నవంబర్ 14 (జనంసాక్షి) :** రైతుల ప్రయోజనాలే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని మిర్యాలగూడ సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ మాలెంపాటి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో వేమలపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని స్థానిక తహశీల్దార్ సరోజ పావని తో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోలు కేంద్రంలోని ధాన్యాన్ని పరిశీలించి ధాన్యం కొనుగోలు కేంద్రంలో ఇప్పటివరకు కొనుగోలు చేసిన ధాన్యం ఎగుమతి దిగుమతి తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు 241 మంది రైతుల నుండి 17 వేల క్వింటాల దొడ్డు రకం ధాన్యాన్ని కొనుగోలు చేయగా, 15 మంది రైతుల నుండి 1100 క్వింటాల సన్నారకం దాన్యాన్ని కొనుగోలు చేసి 56 లారీలు మిల్లులకు ఎగుమతి చేసినట్లు ప్రాథమిక వ్యవసాయసహకార సంఘం




వేముల పల్లి కార్యదర్శి బోయినపల్లి రవీందర్ రావు తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రంలో లారీల కొరత ఉండగా ఎగుమతి చేసిన ధాన్యాన్ని తడిసి రంగు మారాయని కారణంతో మిల్లర్లు క్వింటాలు కు రెండు కిలోల ధాన్యం తగ్గించడం జరుగుతుందని రైతులు సబ్ కలెక్టర్‌కు తెలియజేశారు. గత సీజన్‌లో విక్రయించిన సన్నారకం దాన్యానికి చెల్లించాల్సిన బోనస్ ఇప్పటివరకు రాలేదని రైతులు సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకొని వెళ్లారు. 12 నుంచి 16 తేమ శాతం వచ్చిన ధాన్యానికి కాంటాలు పెట్టడం లేదని రైతులు మొరపెట్టుకున్నారు. లారీల కొరతను తీర్చి మిల్లర్లు ఇబ్బంది పెట్టకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని రైతులు సబ్ కలెక్టర్ కు తెలియజేశారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ మాలెంపాటి మాట్లాడుతూ లారీ అసోసియేషన్, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ వారితో మాట్లాడి అవసరమైన లారీలను పంపించి కాంటాలు వేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు ఎగుమతి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. అదేవిధంగా రైస్ మిల్లర్లు అసోసియేషన్ వారితో మాట్లాడి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో నాయక్ తహశీల్దార్ కత్తుల సైదులు, గ్రామ పరిపాలన అధికారి శ్రీనివాస్, ధాన్యం కొనుగోలు కేంద్రం ఇన్చార్జీలు గజనబోయిన శేఖర్, యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి వార్డు అధికారులు కృషి చేయాలి



**తాండూరు, నవంబర్ 14 (జనంసాక్షి) :** మున్సిపల్ పరిధిలోని వార్డుల్లో వార్డ్ ఆఫీసర్లు పర్యటించి సమస్యలు గుర్తించాలని మున్సిపల్ కమిషనర్ బి. యాదగిరి ఆదేశించారు. గుర్తించిన సమస్యలను పరిష్కరించేందుకు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని ఆయన చెప్పారు. తాండూర్ మున్సిపల్ కార్యాలయంలో పలు ఉద్యోగులతో మున్సిపల్ కార్యాలయంలో పలు విభాగాల అధికారులతో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. వీధి దీపాలు, మంచినీటి సరఫరా, మురుగు కాలువల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సాధించాలన్నారు. మున్సిపల్ ఆదాయం పెంపునకు బిల్ కలెక్టర్లు దృష్టి సారించాలని ఆదేశించారు. ఇంజనీరింగ్ విభాగం అధికారులు ఎప్పటికప్పుడు వార్డులో పర్యటించి వార్డ్ ఆఫీసర్లతో సమన్వయం చేసుకొని సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఆదేశించారు. శానిటరీ ఇన్స్పెక్టర్లు వార్డుల వారీగా తిరుగుతూ ఎక్కడ చెత్తలేకుండా చూడాలని చెప్పారు. అక్రమ నిర్మాణాలపై మున్సిపల్ టౌన్ ప్లానింగ్ విభాగ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో మున్సిపల్ డిఈ మణిపాల్, సానిటరీ ఇన్స్పెక్టర్లు, వార్డ్ ఆఫీసర్లు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

## వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు ప్రత్యేక చర్యలు



**కాప్రా, నవంబరు 14 (జనం సాక్షి) :** రాష్ట్రంలో వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ ను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం, ఉన్నాతాధికారులు చర్యలు తీసుకుంటున్నరని హబ్సీగూడ విద్యుత్ సర్కిల్ సూపరింటెండెంట్ అఫ్ ఇంజనీర్(ఎస్ఈ) ప్రతిమపోమ్ అన్నారు. చర్లపల్లి పారిశ్రామికవాడలోని విద్యుత్ సబ్ స్టేషన్ పరిదిలో గత కొన్ని రోజులుగా నెలకొన్న విద్యుత్ సమస్యలను పరిక్షరించేందుకు ఫీడర్ బైఫర్కేషన్లో భాగంగా రెండు కొత్త విద్యుత్ ఫీడర్లను ఏర్పాటు చేశారు. చర్లపల్లి పారిశ్రామికవాడలో నూతనంగా ఏర్పాటు చేసిన ఫిడర్లను సైనిక్ పురి డివిజన్ విద్యుత్ డీఈ అన్వర్ పాషా, చర్లపల్లి ఏడిఈ రాందాస్ లతో కలసి ఎస్ఈ ప్రతిమషోమ్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ స్థానికంగా నెలకొన్న విద్యుత్ సమస్యలను పరిక్షరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఇందులో భాగంగా వారంలో మూడు రోజులపాటు బస్తీ బాట, విద్యుత్ వినియోగదారుల శిబిరం వంటి కార్యక్రమాలు చేపడుతున్నమని తెలిపారు. విద్యుత్ సమస్యలు ఎప్పటికప్పుడు పరిక్షరించేందుకు 24 గంటల పాటు తమ సిబ్బంది పని చేస్తూ అందుబాటులో ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో చర్లపల్లి ఏఈ బాల్‌రాజు, విద్యుత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# భద్రాద్రి జిల్లాను బాల్య వివాహ రహిత జిల్లాగా మార్చాలి

● జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్

**మణుగూరు, నవంబర్ 14 (జనం సాక్షి) :** భద్రాద్రి జిల్లాను బాల్య వివాహ రహిత జిల్లాగా మార్చడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ పిలుపునిచ్చారు. యాక్షన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్మెంట్ (ఎయిడ్) సంస్థ ఆధ్వర్యంలో బాల్యవివాహాల నిర్మూలనకై వందరోజుల ప్రచార ఉద్యమ గోడ పత్రికను ఆయన తన చాంబర్లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ....బాల్యవివాహాలు లేని తెలంగాణ లక్ష్యం లో భాగంగా భద్రాద్రి జిల్లాను బాల్య వివాహ రహిత జిల్లా గా తెలంగాణలో కీర్తి కెక్కెలా అధికారులు స్వచ్ఛంద సంస్థలు జిల్లా ప్రజలు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు . స్వయం సహాయక బృందాల వారు అంగన్వాడీలు ఆశా కార్యకర్తలు మహిళలు ఈ బాల్య వివాహ నిర్మూలన ప్రచారోద్యమంలో కీలక భూమిక పోషించాలని మహిళలు తలుచుకుంటే ఏదైనా సాధిస్తారని ఆయన అన్నారు. ఆడపిల్లల సర్వతో ముఖాభివృద్ధికి బాల్య వివాహాలు అడ్డుగోడలు కాకూడదని,ఎవరైనా బాల్యవివాహాలను



చేయడానికి ప్రయత్నించిన సహకరించిన చట్ట ప్రకారం శిక్ష అర్హులవుతారని హెచ్చరించారు. బాలల సమస్యలను 24 గంటలు పని చేసే చైల్డ్ లైన్ 1098 కి ఫోన్ చేసి తెలపాలని కోరారు. జిల్లా బాలలందరికీ బాలల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. సంతోషకరమైన ఆహ్లాదకరమైన వాతావరణంలో బాలలందరూ ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎయిడ్ సంస్థ జిల్లా కోఆర్డినేటర్ వి. రాజేష్ టీం సభ్యులు మాన్సింగ్, జ్యోతి, మోహన్, మౌనిక, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## బాలలే నేటి భారత బావి పౌరులు

● శ్రీ చైతన్య పాఠశాల డైరెక్టర్ విద్య

**మొయినాబాద్.. జనం సాక్షి 14 (నవంబర్) :** నేటి బాలలు రేపటి భావి భారత పౌరులని శ్రీ చైతన్య పాఠశాల చైర్మన్ విద్య, డైరెక్టర్ శ్రీధర్ ఏజిఎం పల్లె వెంకట్లు పేర్కొన్నారు. శుక్రవారం మొయినాబాద్ లో గల శ్రీ చైతన్య పాఠశాలలో బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా ప్రధాన ఉపాధ్యాయులు బాలరాజ్ నేటి బాలలే రేపటి భావి భారత పౌరులు గా ఎదగాలని విద్యార్థులను వివిధ వేషధారణలతో రూపొందించి ఆటల పాటలతో విద్యార్థులలో ఉల్లాసాన్ని నింపించారు ఆయన మాట్లాడుతూ మన దేశ మొట్టమొదటి ప్రధానమంత్రి పండిట్ జవహర్లాల్ నెహ్రూ అని పేర్కొన్నారు మన దేశ పురోగతికి పునాదులు వేసిన మహనీయులని కొనియాడారు గొప్ప విద్యావేత్త మానవతావాది అని ప్రధానమంత్రి గొప్పతనాన్ని వివరించారు దేశభక్తి గురించి విద్యార్థిని విద్యార్థులకు తెలిపారు బాల బాలికలు చక్కగా చదువుకొని బంగారు భవిష్యత్ మాటలు వేసుకోవాలని సూచించారు బాలల చదువు భవితకు వెలుగు అని నినాదిస్తూ నేడు యావత్ భారతదేశం కన్యాకుమారి నుండి కాశ్మీర్ వరకు




దేశంలో ఉన్న బాల బాలికలు ఉత్సవముగా మన దేశ మొదటి ప్రధానమంత్రి జవహర్లాల్ నెహ్రూ జన్మదిన వేడుకలు సామస్యత కార్యక్రమాలతో జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు నా చిట్టి చేతులు చక్కని రాతలు లేదయ్యే అనే పాట బడిలోన ఆట ఉందిరా బడి లోన పాట ఉందిరా అంటూ పాట పాడుతూ విద్యార్థులను ఉత్సాహపరిచారు విద్యార్థులకు 3రోత్సవాలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు ఈ కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయులు బాలరాజ్ పాఠశాల డి వెంకటేశ్వర్ రెడ్డి ఇన్చార్జి భవాని ప్రైమరీ ఇన్చార్జ్ రూప ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# జనంసాక్షి వార్తపై స్పందించిన కార్పొరేటర్

● హైటెన్షన్ రోడ్డుకు వెట్ మిక్స్ పూడిక పనులు ప్రారంభం

**అల్వాల్, నవంబర్ 14 (జనంసాక్షి) :** హైటెన్షన్ లైన్ రోడ్డుపై ఏర్పడ్డ గుంతలపై జనంసాక్షి ప్రచురించిన వార్తపై కార్పొరేటర్ రాజ్ జేతేందర్ నాథ్ స్పందించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో రోడ్డంతా గుంతలమయమై స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన తెలిపారు. ఈ నేపథ్యంలో కార్పొరేటర్ అల్వాల్ సర్కిల్ డీసీ శ్రీనివాస్‌రెడ్డి, ఈఈ శ్రీకాంతిని ప్రత్యక్షంగా కలిసి వినతిపత్రం అందజేశారు. శాశ్వత రోడ్డు పనులు ప్రారంభమయ్యే వరకు తక్షణం తాత్కాలిక పూడిక చర్యలు చేపట్టాలని అధికారులకు కోరినట్టు పేర్కొన్నారు. హైటెన్షన్ రోడ్డుకు శాశ్వత పరిష్కారంగా రూ. 4.50 కోట్లు విలువైన సీసీ రోడ్ టెండర్ ప్రక్రియ కొనసాగుతోందని, టెండర్ పూర్తవడానికి ఇంకా కొద్ది రోజులు పట్టనున్నట్టు ఆయన వెల్లడించారు.



"ప్రజలకు వెంటనే ఉపశమనం కల్పించేందుకు తాత్కాలిక చర్యలు ప్రారంభించాం. శాశ్వత రోడ్డుపై ఉత్తమ సేవలు త్వరలో అందిస్తాం" అని కార్పొరేటర్ అన్నారు. ఈ మేరకు అధికారులు హైటెన్షన్ రోడ్డుపై ఉన్న పెద్ద గుంతలను వెట్ మిక్స్‌తో పూడుస్తున్నారు.

## అక్షరాస్యతతోనే ఆర్థికాభివృద్ధి



**పెద్దేముల్, నవంబర్ 14 (జనం సాక్షి) :** అక్షరాస్యతతోనే కుటుంబ ఆర్థిక అభివృద్ధి సాధించవచ్చని పెద్దేముల్ మండల ఏపీఎం శివయ్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ఉల్లాస్‌లో భాగంగా అమ్మకు అక్షరమాల కార్యక్రమం..ఈ సందర్భంగా ఏపిఎం శివయ్య మాట్లాడుతూ ఉల్లాస్ వయోజన విద్యపై ఓబి. వివోలకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించామన్నారు. పెద్దేముల్ మండలంలోని అన్ని గ్రామాల్లో, ప్రతి ఒక్కరు అక్షరాస్యతను కలిగి ఉండేలా ఇంట్లో వారందరూ చదువుకొని ఉంటే, ఆ కుటుంబం ఆర్థికంగా ఎంతో అభివృద్ధి చెందుతుందని అన్నారు. అలాగే కుటుంబ పెద్దకు చదువు అవసరమని ఆర్థికంగా ఎదిగేందుకు చదువు ఎంత దోహదపడుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ వేలిముద్ర నుండి సంతకం పెట్టడం చిన్నచిన్న పదాలను నేర్చుకోవడం కోసమే అమ్మకు అక్షరమాల కార్యక్రమం అని అన్నారు. ప్రతి గ్రామం నుండి ఇద్దరు ఓబీలు మరియు వివోఏ లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించి కావలసిన సామగ్రిని అందజేయడం నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చడం కొరకు వాలంటరీ టీచర్స్ లను గుర్తించి ఉల్లాస్ యాప్ లో నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. గ్రామంలలో నిరక్షరాక్షలను అక్షరాస్యులుగా మార్చటం వారి బాధ్యతను అన్నారు. ఈ కార్యక్రమంలో సీసీలు, వివోఏలు, గ్రామ సంఘంల లీడర్లు తదితరులు పాల్గొన్నారు.

## పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

● ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి
● రూ.1.20 కోట్ల కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కుల పంపిణీ



**తాండూరు, నవంబర్ 14 (జనంసాక్షి) :** పేదల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి అన్నారు. శుక్రవారం తాండూరు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో తాండూరు మున్సిపల్ పరిధి, తాండూరు మండలానికి సంబంధించిన లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మీ, షాదీముభారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి చేతుల మీదుగా 120 మంది లబ్ధిదారులకు రూ. 1కోటి 20 లక్షల 13వేల 920ల విలువైన కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి మాట్లాడుతూ అభివృద్ధి, పేదల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. పేదింటి పెళ్లిళ్లకు కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్ పథకాలు అండగా నిలుస్తున్నాయన్నారు. ఈ పథకాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తాండూరు మార్కెట్ కమిటి చైర్మన్ పట్లోళ్ల బాల్ రెడ్డి, డీసీసీబీ జిల్లా వైస్ చైర్మన్ రవీందర్ గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వడ్డె శ్రీనివాస్, నాయకులు ఉత్తమ్ చంద్, డా. సంపత్ కుమార్, తహసీల్దార్ తారాసింగ్, ఎంపీడీఓ విశ్వప్రసాద్, మున్సిపల్ కౌన్సిలర్లు పట్లోళ్ల నీరజాబాల్ రెడ్డి, ప్రభాకర్ గౌడ్, బొంబీనా, మాజీ ఎంపీటీసీ రాజ్ కుమార్, ఏఎంసీ డైరెక్టర్లు ఉదయ్ భాస్కర్, జర్నప్ప, నేతలు పండరి, హబీబ్ లాల తదితరులు పాల్గొన్నారు.

# పూర్వ ప్రాథమిక తరగతులతో నాణ్యమైన విద్య

**నంగునూరు, నవంబర్ 14 (జనం సాక్షి) :** పూర్వ ప్రాథమిక తరగతులను ప్రభుత్వ పాఠశాలల్లో ప్రారంభించడం వల్ల విద్యార్థులకు మరింత నాణ్యమైన విద్య అందుతుందని నంగునూరు మండల విద్యాధికారి తగిరెడ్డి దేశిరెడ్డి అన్నారు. సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం నర్మెట ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం పూర్వ ప్రాథమిక తరగతి విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన తరగతి చదువు ప్రారంభించారు. ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయుడు ఎనగందుల మనీష్ కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఈ తరగతి గదిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈవో దేశిరెడ్డి మాట్లాడుతూ పేద బడుగు బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులు చదివే ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కృత నిశ్చయంతో కృషి చేస్తోందన్నారు. దీంట్లో భాగంగానే ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో పూర్వ ప్రాథమిక తరగతులను ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటోందని చెప్పారు. ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో పూర్వ ప్రాథమిక విద్యార్థుల కొరకు



ప్రత్యేక తరగతి గదిని ఆకర్షణీయంగా రూపొందించి ప్రారంభించేందుకు అవసరమైన నిధులను కేటాయించిందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవడానికి పూర్వ ప్రాథమిక తరగతి గదులు దోహదం చేస్తాయని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా రూపుదిద్దుకుంటున్నాయని పేర్కొన్నారు. నర్మెట ప్రాథమిక పాఠశాలలో పూర్వ ప్రాథమిక తరగతి గదిని అందంగా రూపొందించిన ప్రధానోపాధ్యాయుడు, ఇతర ఉపాధ్యాయులను అభినందించారు. ప్రధానోపాధ్యాయుడు ఎనగందుల మనీష్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలను కాపాడుకోవడంలో సమాజం బాధ్యత అని చెప్పారు. నర్మెట గ్రామానికి చెందిన దాతలు పాఠశాల అభివృద్ధికి దోహద పడుతున్నారని చెప్పారు. దాతలు పాఠశాలకు వివిధ సౌకర్యాలను దాతల ద్వారా సమకూరుస్తున్నారని తెలిపారు. బాలల దినోత్సవం సందర్భంగా పాఠశాలకు విద్యుత్తుతో నడిచే ఎలక్ట్రిక్ బెల్ (ఎలక్ట్రిక్ బడి గంట)ను నర్మెటకు చెందిన గట్టు కనకయ్య అందించారు.ఈ సందర్భంగా గట్టు కనకయ్యను అభినందించారు. పాఠశాల అభివృద్ధికి సహాయం చేస్తున్న దాతలకు కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రభుత్వ పాఠశాలను కాపాడుకుని గ్రామాభివృద్ధికి తోడ్పడాలని తల్లిదండ్రులను కోరారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్ పర్సన్ లింగంపల్లి రజిత, పాఠశాల ఉపాధ్యాయులు తహసీన్ సుల్తానా, ఎం.డి.హర్షద్, దాసరి సునీత, లలిత, కవిత, నిర్మల, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## తడిసిన ధాన్యం కొనుగోలు చేయడం లేదని రైతులు ఆవేదన

● రైస్ మిల్లు ముందే ధాన్యం రాశి పోసి నిరసన



**నేరేడుచర్ల, నవంబర్ 14 (జనంసాక్షి) :** మండలం దిర్శించర్ల రైస్ మిల్లులో తడిసిన ధాన్యం కొనుగోలు చేయడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. గత రెండు రోజుల క్రితం కూడా రైతులు యాజమాన్యంతో మాట్లాడి తడిసిన ధాన్యాన్ని 20 రూపాయలు తక్కువ చొప్పున కొనుగోలు చేయాలని అభ్యర్థించారు.శుక్రవారం ఉదయం వచ్చిన ట్రాక్టర్ దాన్యమును వద్దు అనడంతోనే రైతు నిరసనగా రైస్ మిల్లు ముందే ధాన్యం రాశిగా పోసి నిరసన వ్యక్తం చేశారు. రైస్ మిల్లు నిర్మాణం చేపట్టేటప్పుడు మార్కెట్ రేటు కంటే అధికంగా 50 రూపాయలు చొప్పున కొనుగోలు చేస్తామని ఇప్పుడు రైతుల వద్ద నుండి తక్కువ ధరకు ధాన్యం ఆడుతున్నట్లు రైతులు మిల్లర్స్ యాజమాన్యంపై ఆరోపణలు చేశారు. కానీ మిర్యాలగూడలో క్వింటాకి 2500 చొప్పున కొనుగోలు చేస్తే ఈ రైస్ మిల్లులో 2400, 2300 చొప్పున మాత్రమే కొనుగోలు చేస్తున్నారని రైతులు మండిపడ్డారు.

# పోటీతత్వాన్ని పెంపొందించడానికే క్విజ్ పోటీలు

- రోజు అరగంట సేపు దినపత్రికలు చదవాలి
- కలెక్టర్ పి.ప్రావీణ్య



**సంగారెడ్డి ప్రతినిధి, నవంబర్ 14 (జనం సాక్షి) :** విద్యార్థుల్లో పోటీ తత్వాన్ని పెంపొందించడానికి క్విజ్ పోటీలు దోహదపడతాయని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య పేర్కొన్నారు. నారాయణఖేడ్ డివిజన్‌లో సబ్ కలెక్టర్ ఉమా హారతి, ఎస్‌డీఎమ్ ఆధ్వర్యంలో, విరూపాక్ష ఆర్గనైజేషన్ సంస్థ సి ఎస్ ఆర్ నిధులు, హైదరాబాద్ ఆధారిత టోకెన్ ఆర్గనైజేషన్ సహకారంతో క్విజ్ కార్యక్రమం నిర్వహించారు. డివిజన్ పరిధిలోని మొత్తం 49 ప్రభుత్వ పాఠశాలల్లో మొదట స్కూల్ స్థాయిలో నిర్వహించిన క్విజ్ పోటీల్లో మెరుగైన ప్రతిభ కనబరిచిన 8వ, 9వ, 10వ తరగతి విద్యార్థులను ఒక్కో స్కూల్ టీమ్‌గా ఎంపిక చేశారు. అనంతరం మండలస్థాయి పోటీలు జరగగా, విజేతలైన ఏడు మండలాల టీములు, జుకల్‌లోని సాంఘిక సంక్షేమ బాలుర పాఠశాలలో జరిగిన డివిజనల్ లెవెల్ క్విజ్ ఫైనల్స్‌లో పాల్గొన్నారు. మొత్తం 7 టీములు పాల్గొన్న, ఈ తుదిపోరు నాలుగు మెయిన్స్ రౌండ్లు, ఒక బజార్ రౌండ్‌తో ఉత్కంఠభరితంగా సాగింది. విద్యార్థులు చురుకుతనం, తెలివి తేటలను ప్రదర్శించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. విజేతలకు సర్టిఫికెట్లు, బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య,విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు ఇలాంటి పోటీలు విద్యార్థుల్లో పోటీతత్వాన్ని పెంపొందించడంతో పాటు, విజ్ఞానం-వ్యక్తిత్వ వికాసానికి దోహదపడతాయి అన్నారు. నారాయణఖేడ్ డివిజన్ ఈ కార్యక్రమంతో రాష్ట్రంలో విద్యా రంగానికి ఆదర్శంగా నిలిచిందని అని పేర్కొన్నారు. డివిజన్‌లో ఇంత పెద్ద స్థాయిలో నిర్వహించిన ఈ విద్యా కార్యక్రమం విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల్లో ప్రత్యేక ఉత్సాహాన్ని నింపింది అన్నారు. విద్యార్థులు ప్రతిరోజు చదివే అంశాలను క్విజ్ రూపంలో ప్రశ్నించడం ద్వారా విద్యార్థులకు విషయ సంగ్రహణ శక్తి, మేధాశక్తి పెరుగుతుందన్నారు. దీంతో విద్యార్థులు పోటీ పరీక్షల్లో రాణిస్తారు అన్నారు. ప్రతిరోజు విద్యార్థులు తప్పనిసరిగా 15 నిమిషాల నుండి అరగంట సేపు దినపత్రికలు చదవాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలోని కొన్ని పాఠశాలల్లో ఉదయం ప్రార్థన సమయం లో దినపత్రికలలోని ముఖ్యాంశాలు చదివి వినిపిస్తున్నారని ఈ పద్ధతి వల్ల విద్యార్థులకు జర్నల్ నాలెడ్జ్ పెరుగుతుందన్నారు. ఈ పద్ధతిని జిల్లాలోని అన్ని పాఠశాలల్లో చేపట్టాలని ఈ సందర్భంగా కలెక్టర్ సూచించారు.

**విజేతల వివరాలు..**

మొదటి బహుమతి నిజాంపేట్ మండలం ఎంజేపీ బాచేపల్లి గర్ల్స్ పాఠశాల, రెండవ బహుమతి నాగుల్ గిద్ద గర్ల్స్, కరస్ గుత్తి, మూడవ బహుమతి నారాయణఖేడ్ జేసీ బాయ్స్ విద్యార్థులు బహుమతులు గెలుచుకున్నారు.

## పత్తి రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు

- పత్తిని సీసీఐకి మాత్రమే విక్రయించాలి
- మండల వ్యవసాయ అధికారి రాంప్రసాద్



**రేగోడ్, నవంబర్ 14 (జనంసాక్షి) :** రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని పత్తిని సిసిఐకి మాత్రమే విక్రయించాలని రేగోడు మండల వ్యవసాయ అధికారి రాంప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేగోడ్ మండల పరిధిలోని ఆర్ ఇటిక్యాల గ్రామంలో శుక్రవారం మండల వ్యవసాయ అధికారి రాంప్రసాద్ కాపాస్ కిసాన్ యాప్ గురించి పత్తి రైతులకు అవగాహన కల్పించి ప్రతి రైతు సీసీఐకి మాత్రమే విక్రయించాలని పత్తి యొక్క దిగుబడి గురించి రైతులతో చర్చించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి మహేష్, రైతులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## హోమ్ కేర్ పేషెంట్లకు నాణ్యమైన చికిత్స అందించాలి



**గద్వాల నడిగడ్డ, నవంబర్ 14 (జనం సాక్షి) :** జోగులాంబ గద్వాల జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో శుక్రవారం సమీక్షా సమావేశం లో జిల్లా ఆస్పత్రిలో వివిధ విభాగాలలో పనిచేస్తున్న సిబ్బందికి సూచనలు, సలహాలను జిల్లా ఆరోగ్య వైద్య అధికారిని డాక్టర్ జె సంధ్య కిరణ్మయి తెలియజేశారు. జిల్లా ఆస్పత్రిలో వివిధ విభాగాల యందు పనిచేస్తున్న ఎల్డర్ లీకేర్, పాలేటివ్ కేర్,ఎన్సిడి క్లినిక్,సర్వైకల్ స్క్రీనింగ్, జిల్లా మెంటల్ హెల్త్ క్లినిక్, నందు పనిచేస్తున్న సిబ్బందికి రివ్యూ మీటింగ్ ఏర్పాటు చేసి అందుతున్న సేవలు గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా పాలియెటివ్ కేర్ నందు పేషెంట్లకు ఇస్తున్న సేవలు గురించి అడిగి తెలుసుకుని హోమ్ కేర్ వాహనాన్ని పూర్తిగా వినియోగించుకోవాలని, వెళ్లినప్పుడు పేషెంట్ వివరాలు అందుతున్న సేవలు సూచనలు సలహాలు తెలియజేసి అవసరమైన వారిని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకొచ్చి అడ్మిషన్ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో హైరిస్కు,ఈ మీడియం, లో,కేసులను పర్యవేక్షించాలని, ప్రతిరోజు ఒక గ్రామాన్ని ఎంచుకొని సరైన సమయంలో వెళ్లి చికిత్స అందివ్వాలని తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో సమావేశాలకు వెళ్లి వివరాలు తెలియజేయాలని,వివిధ విభాగాలు పనిచేస్తున్న వారి తీరు అడిగి తెలుసుకున్నారు.సర్వైకల్ స్క్రీనింగ్, మెమోగ్రఫీ, మహిళ కేసులను అర్బన్ సెంటర్ల నుండి వివిధ గ్రామాల నుండి నుండి మోటివేషన్ చేసి జిల్లా ఆస్పత్రికి పంపాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ శ్యాంసుందర్, వివిధ విభాగాల స్టాఫ్ నర్సులు, సిబ్బంది పాల్గొన్నారు.

# భూ సమస్యల దరఖాస్తులను సకాలంలో పరిష్కరించాలి

- గద్వాల జిల్లా కలెక్టర్ సంతోష్



**గద్వాల నడిగడ్డ, నవంబర్ 14 (జనం సాక్షి) :** భూభారతి, సాదాబైనామా, తదితర భూసమస్యలకు సంబంధించిన దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా సకాలంలో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ బి. ఎం. సంతోష్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు.శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో రెవెన్యూ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా రెవెన్యూ సదస్సుల సందర్భంగా 6,391 దరఖాస్తులు వచ్చాయని,వీటిలో వివిధ స్థాయిల్లో పెండింగ్ లో ఉన్న ఆయా దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి నిబంధనల ప్రకారం పరిష్కరించాలన్నారు.జిల్లాలో ప్రభుత్వానికి చెందిన వివిధ భూములు పలుచోట్ల ఆక్రమణలకు గురవుతున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని, వీటిపై దృష్టిపెట్టి ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ, కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్, తదితర దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చేపట్టిన ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణకు సంబంధించి జిల్లాలో ఇప్పటిదాకా 35% మ్యాపింగ్ ప్రక్రియ పూర్తయింది అన్నారు. ఆయా పోలింగ్ స్టేషన్ల వారీగా సూపర్వైజర్లు, బిఎల్‌ఓలు మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేసేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలను తహసిల్దార్‌లు తరచూ సందర్శిస్తూ అక్కడి కార్యకలాపాలపై పర్యవేక్షణ చేయాలని, అలసత్వం వహించే వారిపై తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ, ఆర్డీవో అలివేలు, ఆయా మండలాల తహసిల్దార్లు, ఇతర రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలి




**జడ్చర్ల, నవంబర్ 14 (జనంసాక్షి) :** విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని జడ్చర్ల ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జ్ జె. నిహారిక సూచించారు. శుక్రవారం బాలల దినోత్సవం పురస్కరించుకొని జడ్చర్ల న్యాయ విజ్ఞాన సంస్థ, న్యాయ సేవా సంస్థ, జూనియర్ సివిల్ జడ్జ్ కోర్టు ఆధ్వర్యంలో మున్సిపాలిటీ పరిధిలోని అక్షర కాన్సెప్ట్ హైస్కూల్ లో విద్యార్థులకు చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి నిహారిక హాజరై ముందుగా విద్యార్థులకు బాలల దినోత్సవం శుభాకాంక్షలు తెలియజేసి మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించాలని గౌరవ సుప్రీంకోర్టు సూచనల మేరకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందని, చట్టాలపై అవగాహన లేకపోవడంతోనే క్షణికావేశంలో నేరాలు, గొడవలు, తప్పులు చేసి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, పుట్టుక నుంచి మరణం వరకు చట్టాలు కలిగి ఉన్నాయన్నారు. మహిళల పట్ల ప్రతి ఒక్కరు గౌరవం కలిగి ఉండాలన్నారు. విద్యార్థులు క్రమ శిక్షణతో చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. చదువుకునే వయస్సులో చెడు వ్యసనాలకు అలవాటు పడి కేసుల బారిన పడవద్దని సూచించారు. మహిళల కోసం ఎన్నో చట్టాలు ఉన్నాయని, వాటి గురించి తెలుసుకోవాలన్నారు. ఆకతాయిలు ఎవరైనా మహిళలను, బాలికలను వేధిస్తే పోలీసులకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం అధ్యక్షులు ఎంఏ మాలిక్ షాకీర్, న్యాయవాదులు ప్రశాంత్, పురుషోత్తం రావు, పాండు కుమార్, సాహితీ రెడ్డి, మహమ్మద్ కౌసర్, పాఠశాల కరస్పాండెంట్ పడాల రేణుక జగదీష్, ప్రిన్సిపల్ మోహినుద్దీన్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## మెదక్ జిల్లాను బాల్య వివాహాలు లేని జిల్లాగా మార్చాలి



**కౌడిపల్లి, నవంబర్ 14 (జనంసాక్షి) :** మెదక్ జిల్లాను బాల్య వివాహాలు జరగని జిల్లాగా మార్చాలని జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారి హేమభార్గవి తెలిపారు. శుక్రవారం కౌడిపల్లిలో మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బిడబ్ల్యుఓ ముఖ్యఅతిథిగా హాజరుకాగా డిఎల్‌పిఓ సాయిబాబా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిడబ్ల్యుఓ మాట్లాడుతూ బాల్య వివాహాలు జరగకుండా ప్రజలకు అవగాహన కల్పించలన్నారు. బాల్య వివాహాలు జరగకుండా అంగన్వాడి, ఆశ, పంచాయతీ కార్యదర్శి, డ్వాక్రా మహిళల కమిటీ పక్కగా పనిచేయాలన్నారు. 18ఏళ్ల లోపు బాలికల జాబితా తయారుచేసి ఎవరు ఏం చేస్తున్నారో గమనించి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. చదువు మానేస్తే ఓపెన్ టెన్త్, ఓపెన్ ఇంటర్ చదివించేలా కృషి చేయాలనీ, స్వయం ఉపాధి అవసరమైన శిక్షణ సైతం ఇవ్వాలన్నారు. మెదక్ జిల్లాను బాల్యవివాహాలు జరగని జిల్లాగా మార్చాలని తెలిపారు. కిషోర్ బాలికలు ఎక్కడ చదువుతున్నారు, ఏం చదువుతున్నారు, ఏం చేస్తున్నారు అన్న విషయం తప్పనిసరిగా సేకరించాలని సూచించారు. అనంతరం చిన్నపిల్లలను తొట్టెలలో వేసి బారసాల నిర్వహించారు. అనంతరం రైతు వేదిక వద్ద మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి సునీత, తాసిల్దార్ కృష్ణ, ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీఓ రామారావు, డాక్టర్ ఫెర్నాజ్, ఐసిడిఎస్ మండల సూపర్వైజర్లు కమర్ సుల్తానా, లక్ష్మి, హెల్త్ సూపర్వైజర్ సుశీల, అంగన్వాడి టీచర్లు, ఆశ వర్కర్లు, పంచాయతీ కార్యదర్శులు ఐకెపి మహిళలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఖమ్మం వందేళ్ళ ముగింపు ఉత్సవం చారిత్రాత్మక ఘట్టం



**వనపర్తి బ్యూరో, నవంబర్ 14 (జనంసాక్షి) :** ఖమ్మంలో డిసెంబర్ 26న జరగనున్న సిపిఐ వందేళ్ళ ముగింపు ఉత్సవం ఒక చారిత్రాత్మక ఘట్టమని, పార్టీ శ్రేణులు కష్టజీవులు భాగస్వాములు కావాలని సిపిఐ వనపర్తి నియోజకవర్గ కార్యదర్శి రమేష్ కోరారు. శుక్రవారం వనపర్తి సిపిఐ ఆఫీసులో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సిపిఐకి మాత్రమే పొందేళ్ల పోరాట చరిత్ర ఉందన్నారు. కష్టజీవుల పక్షాన అనేక పోరాటాలు చేసి ఎన్నో చట్టాలను సాధించిందన్నారు. దేశంలో సిపిఐ పాత్రలేని పోరాటం లేదన్నారు. పేదలకు ఎర్రజెండా మాత్రమే అండగా ఉంటుందన్నారు. కమ్యూనిస్టు పార్టీ లేని సమాజాన్ని ఊహించలేమన్నారు. సంపన్న దోపిడీ నుంచి అన్ని వర్గాలను సిపిఐ కాపాడుతూ వస్తోందన్నారు. బూర్జువ పార్టీలు అధికారమే లక్ష్యంగా పనిచేస్తాయని సిపిఐ ప్రజల శ్రేయస్సు లక్ష్యంగా అధికారం ఉన్నా లేకున్నా ప్రజలను సమీకరించి పోరాడుతుందన్నారు. అలాంటి పార్టీ వందేళ్ళ ముగింపు ఉత్సవాలు ఖమ్మంలో అంగరంగ వైభవంగా జరగబోతున్న అన్నారు. డిసెంబర్ 26న ముగింపు సభ నేపథ్యంలో రాష్ట్రంలో మూడు ప్రచార జాతాలు బయలుదేరాయన్నారు. సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బాల నరసింహ నాయకత్వంలో రేపు గద్వాల నుంచి బయలుదేరిన జాత రేపు మధ్యాహ్నం పెబ్బేరుల ప్రవేశించి మధ్యాహ్నం రెండు గంటలకు వనపర్తి వస్తుందన్నారు. పార్టీ శ్రేణులు అభిమానులు శ్రేయోభిలాషులు పెద్దసంఖ్యలో స్వాగతం పలికి విజయవంతం చేయాలన్నారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కళావతమ్మ, నేతలు పృథ్వీనాదం, జయమ్మ శిరీష వంశీ అంజి తదితరులు పాల్గొన్నారు.

## గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలు



**మెదక్ జిల్లా బ్యూరో, నవంబర్ 14 (జనం సాక్షి) :** గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలు అని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చిలుముల సుహాసిని రెడ్డి అన్నారు. జిల్లా గ్రంథాలయంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చిలుముల సుహాసిని రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా ప్రారంభమైయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, ఎంపీ రఘునందన్ రావు లు హాజరయ్యారు. అనంతరం జవహర్ లాల్ నెహ్రూ, ఎస్.ఆర్ రంగనాథన్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చిలుముల సుహాసిని రెడ్డి మాట్లాడుతూ గ్రంథాలయ వారోత్సవం జవహర్ లాల్ నెహ్రు జయంతి సందర్భంగా బాలల దినోత్సవంగా జరుపుకోవడం జరుగుతుందని, ఎస్.ఆర్ రంగనాథన్ భారతదేశంలోని గ్రంథాలయాలకు వారు చేసిన కృషిని గ్రంథపాఠకులకు వివరించారు. మెదక్ జిల్లాలో అన్ని గ్రంథాలయాల్లో కలిపి లక్షా 50 వేల పుస్తకాలున్నాయని, మెదక్‌లోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో 25 వేల పుస్తకాలు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. జిల్లాలో నెలకు 45 వేల మంది గ్రంథాలయాల్లో పుస్తకాలు చదువుతున్నట్టు వివరించారు.

## ప్రమాదవశాత్తు పత్తి దగ్ధమైన రైతు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

- మాజీ ఎమ్మెల్యే డా.రసమయి బాలకిషన్



**బెజ్జంకి, నవంబర్ 14 (జనం సాక్షి) :** మండల కేంద్రంలో ఇటీవల ప్రమాదవశాత్తు పత్తి దగ్ధమైన ప్రమాద స్థలాన్ని చూసి రైతు బండి ఐలయ్య కుటుంబాన్ని మానకొండూరు మాజీ ఎమ్మెల్యే డా.రసమయి బాలకిషన్ పరామర్శించారు. అనంతరం రసమయి బాలకిషన్ మాట్లాడుతూ ప్రమాదవశాత్తు సుమారు 350 క్వింటాళ్ల పత్తి దగ్ధమై రైతు కుటుంబానికి సుమారు 30 లక్షల మేర నష్టం జరిగిందని, హృదయ విదారక ప్రమాద ఘటనగా పేర్కొంటూ, అధికారులు పంట అంచనా వేసి ప్రభుత్వానికి నివేదికలు పంపి,తక్షణమే ప్రభుత్వం స్పందించి రైతు కుటుంబాననీకి సహాయం చేయాలని బీఆర్ఎస్ పార్టీ తరఫున డిమాండ్ చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో భారత రాష్ట్ర సమితి మండల అధ్యక్షులు పాకాల మహిపాల్ రెడ్డి, సీనియర్ నాయకులు లింగాల లక్ష్మణ్, కనగండ్ల తిరుపతి, చింతకింది శ్రీనివాస్ గుప్తా, రావుల రామకృష్ణ రెడ్డి, ఎల శేఖర్ బాబు, ధీటి రాజు, బిగుల్ల మోహన్, కల్లూరి అజయ్ యాదవ్, లింగాల వెంకటేష్ పాల్గొన్నారు.

# వేగంగా ధాన్యం కొనుగోలు ప్రక్రియ

- 70శాతం మంది రైతుల ఖాతాలో డబ్బులు జమ
- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



**మెదక్ జిల్లా బ్యూరో, నవంబర్ 14 (జనం సాక్షి) :** జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతంగా సాగుతుందని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. మెదక్ జిల్లాలోని రామాయంపేట మండలం లక్ష్మాపూర్ గ్రామంలోని ప్యాక్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ జిల్లాలో దాదాపు 500 ధాన్యం కొనుగోలు కేంద్రాలు జిల్లాలో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సన్న రకం దొడ్డు రకం ధాన్యాన్ని పెద్ద ఎత్తున కొనుగోలు చేస్తున్నామన్నారు. కొనుగోలు సెంటర్లో అన్ని రకాల మౌలిక వసతులను కల్పించడం జరిగిందనీ వివరించారు. తేమ శాతం వచ్చిన వెంటనే కాంటబెట్టి వెంటనే మిల్లులకు తరలించడం జరుగుతుందన్నారు. రవాణాకు సంబంధించిన వాహనాలను అందుబాటులో ఉంచడం జరిగిందనీ, ధాన్యం తరలింపు కోసం 67 రైస్ మిల్లులు ట్యాగింగ్ చేయడం జరిగిందనీ, ఇంకా 20 మిల్లులను ట్యాగింగ్ కొరకు సిద్ధం చేస్తున్నామన్నారు. ఈరోజు వరకు లక్ష మెట్రిక్ టన్నులు ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరిగిందనీ ,గత సంవత్సరం ఇదే నెలలో 9060 మంది రైతుల నుంచి 44,718.960 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి 4.71 కోట్ల రూపాయలను చెల్లించగా ప్రస్తుత సీజన్‌కి ఇప్పటివరకు 24,700 మంది రైతుల నుండి 1,03,411.240 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి 84.19 కోట్ల చెల్లింపులు జరిగాయన్నారు. ఈసారి అంచనాలకు మించి సుమారు మూడు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసే దిశగా ముందుకు పోతున్నామన్నారు. రైతులందరూ ఈ అవకాశ సద్వినియోగం చేసుకుని తేమశాతం వచ్చిన వెంటనే ధాన్యాన్ని శుభ్రం చేసి కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చినట్లతే మద్దతు ధర పొందవచ్చని తెలిపారు. డిసెంబర్ కల్లా కొనుగోలు పూర్తిచేసి రైతుల ఖాతాలలో డబ్బులు జమ చేసే విధంగా పటిష్ట కార్యచరణ ద్వారా ముందుకు పోతున్నామన్నారు. ఈ కొనుగోలు కేంద్రం లో 80 మంది రైతుల ధాన్యాన్ని కొనుగోలు చేయగా 70 మందికి రైతుల ఖాతాలలో డబ్బులు జమ చేయడం జరిగిందనీ రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారని వివరించారు. జిల్లావ్యాప్తంగా 70% రైతులకు ధాన్యానికి సంబంధించి వారి ఖాతాలలో డబ్బులు జమ అయినట్లు వివరించారు. ప్రభుత్వం రైతుల పట్ల అత్యంత పారదర్శకంగా గౌరవిస్తుందని సన్న వడ్లకు బోనస్ చెల్లించే విషయంలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఈ సీజన్ కు సంబంధించిన డబ్బులు ఆకౌంట్లో జమవుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# మొంథా తుఫాన్‌తో పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి

- నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి
- కలెక్టర్ స్పందించి పంట నష్ట పరిహార సర్వేను పొడిగించాలి
- అన్నదాతలను ఆదుకోవాలి



**ఖానాపురం, నవంబర్ 13 (జనంసాక్షి):** మొంథా తుఫాన్ రైతును నిండా ముంచిందని పెట్టుబడులుపెట్టిన తర్వాత పంటలు దెబ్బతిని దిగుబడి రాకపోవడంతో రైతన్నలు కుదేలయ్యారని రాష్ట్ర ప్రభుత్వం అన్నదాతలను ఆదుకోవడానికి పంట నష్టపరిహారం సర్వేను పొడిగించి తక్షణమే అన్నదాతలకు సహాయం అందించాలని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే టిఆర్ఎస్ రాష్ట్ర సీనియర్ నాయకులు పెద్ది సుదర్శన్ రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం ఖానాపురం మండలంలోని అశోక్ నగర్ గ్రామంలో నర్సంపేట మాజీ ఎమ్మెల్యే బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నేత గౌరవ శ్రీ పెద్ది సుదర్శన్ రెడ్డి ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు.ఇటీవల కురిసిన మొంథా తుఫాన్ వల్ల వరంగల్ జిల్లా వ్యాప్తంగా వేలాది ఎకరాల్లో పంట నష్టం వాటిల్లిందని పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని అన్నారు.వరంగల్ జిల్లాలో ప్రధాన పంటలైన వరి, మొక్కజొన్న పత్తి పంటలు పూర్తిగా నేలమట్టం అయ్యాయని, రైతుకు తీవ్ర నిరాశ కలిగిందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వరంగల్ పర్యటన.. ఒక్క రైతును పరామర్శించిన దాఖలాలు లేవని విమర్శించారు. పర్యటన పూర్తిగా కాలక్షేపమే తప్ప రైతులకు, ఇండ్లు మునిగిన వారికి ఒరిగింది ఏమీలేదని మండిపడ్డారు. పంటనష్టం పై వ్యవసాయ శాఖ అధికారుల సర్వే అధికార కాంగ్రెస్ పార్టీ నాయకుల సూచన మేరకే నడుస్తుందని ఇది అధికారులకు మంచి పద్ధతి హెచ్చరించారు. పార్టీలు మారితేనే పంట నష్ట సర్వేలో పేరు వస్తుందంటూ చిల్లర మాటలు మాట్లాడుతున్న అధికార పార్టీ నాయకును హెచ్చరించారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న ఎమ్మెల్యే నీవు ఆనాడు ఎమ్మెల్యేగా ఉండి రైతులను పట్టించుకోలేదని గుర్తు చేశారు. దున్నపోతు మీద వాన పడ్డట్లుగా రైతులను పట్టించుకోకుంటే ఆనాడు రైతుల నష్టాన్ని తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ని తీసుకువచ్చి రైతులకు అండగా నిలబడ్డ చరిత్ర బిఆర్ఎస్ పార్టీది అని పెద్ది గుర్తు చేశారు. అధికార పార్టీ స్థానిక ఎమ్మెల్యే అధికార పార్టీ చోటా, మోటా లీడర్లకు కొనుగోలు సెంటర్లను ఇస్తూ రైతులను దోచుకో తింటున్న ఎమ్మెల్యే పట్టించుకోకపోవడం శోచనయమని అన్నారు. వరంగల్ జిల్లా నర్సంపేట నియోజకవర్గం లో 50 వేల ఎకరాల్లో తుఫాన్ వల్ల నష్టం వాటిల్లితే వ్యవసాయ అధికారులు కేవలం పదివేల ఎకరాల్లో నష్టం జరిగిందని రిపోర్టు ఇవ్వడం ఎంతవరకు సమంజసం.. దీనిపై అధికార పార్టీ నాయకులు, స్థానిక ఎమ్మెల్యే ఏం చేస్తున్నారని మండిపడ్డారు. రైతులకు పంట నష్టపరిహారం అందించండనీ బిఆర్ఎస్ పక్షాన పోరాడుతుంటే.. ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్నారని ఇదేనా ప్రజా ప్రభుత్వం అని చెప్పుకునే తీరు అని అన్నారు.రైతులకు అందించే పంట నష్టపరిహారం ముఖ్యమంత్రి ఇంట్లో నుండి ఇస్తున్నారా.. లేక అధికార పార్టీ నాయకుల ఇండ్ల నుండి ఇస్తున్నారా.. అని విమర్శించారు. రైతులు పండించిన పంటలు ఒక దిక్కు యూరియా కొరతతో సగం నష్టం వాటిలతో నేడు తుఫాను వల్ల ఉన్న పంటలు పూర్తిగా సర్వనాశనం అయ్యాయని అన్నారు. పంట మొదలు అయినప్పుడు వ్యవసాయ శాఖ అధికారుల గణాంకాల ప్రకారం పంటలు పూర్తిగా దిగుబడి తగ్గి రైతుకు నష్టం వాటిలిందని అన్నారు. నేడు వానాకాలం సీజన్ కు మండలంలోని ఓ గ్రామంలో ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీకి కొనుగోలు సంబంధించిన అన్ని అనుమతులు ఇచ్చి దాన్ని ఎందుకు రద్దు చేశారో కలెక్టర్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. వర్షాల వల్ల పత్తి మొక్కజొన్న వరి రైతులు పూర్తిగా నష్టపోయారని చిల్లర రాజకీయాలు చేయకుండా నష్టపోయిన రైతులందరికీ పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఖానాపురం మండలంలో కొన్ని సెంటర్లలో మిల్లర్లు, అధికార కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన నాయకులు కుమ్మక్కై పొలాలు లేని వ్యక్తుల పేర్ల మీద వడ్లు పెట్టి ప్రభుత్వం, సివిల్ సప్లై ద్వారా కోట్ల రూపాయలు దండుకున్నారని దీనిపై త్వరలో నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తానని తెలిపారు. తుఫాన్ వల్ల నష్టపోయిన రైతులందరూ రైతు వేదికలో తమ పట్టాదారు పాస్ పుస్తకాల జిరాక్స్, తమ పొలాలకు సంబంధించిన పత్రాలు ఇవ్వాలని రైతులకు సూచించారు. అధికారులు నష్టపరిహారం వివరాలు తీసుకొని పక్షంలో తమ గ్రామాల్లోని బిఆర్ఎస్ పార్టీ నాయకులను సంప్రదించాలని.. ఎక్కడికక్కడ రైతు వేదికల ముందు రైతులతో కలిసి ధర్నా చేయడానికి బిఆర్ఎస్ పార్టీ సిద్ధంగా ఉందని రైతులకు భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు, చైర్మెన్,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్,మాజీ ఎంపీపీ,మండల పార్టీ నాయకులు,క్లస్టర్ బాధ్యులు,మాజీ ఎంపిటిసి లు,మాజీ సర్పంచ్ లు,గ్రామ పార్టీ అధ్యక్షులు , యూత్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# గంజాయికి బానిసైన యువకున్ని డీ-అడిక్షన్ సెంటర్‌కు తరలింపు

**వివరాలు వెల్లడించిన ఎస్పీ**



**ఆదిలాబాద్ ప్రతినిధి (జనంసాక్షి) :** గంజాయికి బానిసైన యువకున్ని జిల్లా పోలీసుల సహాయంతో యువకున్ని కోర్టు ద్వారా చికిత్స కోసం డీ ఆడిక్షన్ సెంటర్‌కు తరలించారు. జిల్లాలో మొట్టమొదటిసారిగా జిల్లా పోలీసుల సహాయంతో గంజాయి లాంటి వ్యసనాలకు అలవాటు పడి, గంజాయికి బానిసై గుడిహత్నూర్ మండలానికి చెందిన ఒక వ్యక్తిని తన తల్లిదండ్రుల పూర్తి అనుమతితో న్యాయస్థానం ముందు హాజరుపరచగా భాధితునికి పూర్తి నయం అయ్యేంతవరకు పట్టణంలోని డవ్ సెంటర్ లో చికిత్సను అందించాలని ఆదేశించారు.ఈ సందర్భం గా ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ మొట్టమొదటిగా జిల్లాలో మార్పుకు నాంది పడిందని, గంజాయికి మాదకద్రవ్యాలకు బానిసగా మారిన వ్యక్తులకు నయం చేసేందుకు జిల్లా పోలీసు యంత్రంగా సరికొత్త ఆలోచనతో ముందుకు వెళ్ళడం జరుగుతుందని తెలిపారు. గూడిహత్నూర్ గ్రామం సమీపంలో ధాబా వద్ద వ్యక్తి ఒకరు గంజాయి సేవిస్తున్నాడన్న సమాచారం అందిన వెంటనే ఉన్నతాధికారుల ఆదేశాలతో అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. అతడు గంజాయి సేవిస్తున్నట్లు అంగీకరించగా, డ్రగ్ టెస్ట్ కిట్ ద్వారా పరీక్షించగా టీహెచ్‌సీ పాజిటివ్‌గా వచ్చింది. అనంతరం డ్రగ్ టెస్ట్ కిట్ కంటైనర్, మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకుని, స్టేషన్‌కు తీసుకురాగా, అవసరమైన చర్యలు తీసుకునేందుకు కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. మార్పును కోరుకునే తల్లిదండ్రులు వ్యసనాలకు బానిసైన వ్యక్తుల అలవాట్లను మార్చేందుకు జిల్లా పోలీసుల వద్దకు వచ్చినట్లయితే వారికి పూర్తి సహాయ సహకారాలు అందజేయడం జరుగుతుందని తెలిపారు. వ్యసనాల బారిన పడిన వ్యక్తులను మార్చేందుకు న్యాయస్థానం ద్వారా సహాయం అందజేయడం జరుగుతుందని హామీ ఇచ్చారు. తల్లిదండ్రులు దగ్గరలో ఉన్న పోలీస్ స్టేషన్ గాని, ఎలాంటి సహాయ సహకారాలకైన మెసేజ్ యువర్ ఎస్పి ద్వారా ఏర్పాటు చేసిన 8712659973 నెంబర్ కు వాట్సప్ ద్వారా సమాచారం అందించవచ్చని తెలిపారు.

# గ్రంథాలయాల అభివృద్ధికి కృషి

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు
- భూపాలపల్లిలో 58వ వారోత్సవాలు షురూ



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి) :** గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాకేంద్రంలోని గ్రంథాలయంలో శుక్రవారం 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను జ్యోతి ప్రజ్వలన చేసి ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కోట రాజబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ గ్రంథాలయ అభివృద్ధి కోసం ఇదే భవనంలో పైఅంతస్తు నిర్మాణానికి నిధులు మంజూరు చేయిస్తానని, యువతకు పోటీ పరీక్షల నిమిత్తం అవసరమయ్యే పుస్తకాలను గ్రంథాలయంలో అందుబాటులో ఉంచాలని, పుస్తకాల ఖర్చు కోసం రూ.10వేలు అందజేస్తానన్నారు. మండలకేంద్రాల్లో, మేజర్ గ్రామ పంచాయితీల్లో గ్రంథాలయ అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేయిస్తానని చెప్పారు. ముఖ్యంగా జిల్లా కేంద్రంలోని గ్రంథాలయాన్ని డిజిటల్ చేసేందుకు తనవంతు కృషి చేస్తానని తెలిపారు. గ్రంథాలయాలు విద్యా వికాసానికి మూల మని, అందుకే ప్రతీ ఒక్కరు గ్రంథాలయాలకు వచ్చి విజ్ఞానం పొందాలని తెలియజేశారు. గ్రంథాలయాల్లో విద్యా ప్రగతికి దోహదం చేస్తుందని, ప్రతీ ఒక్కరు విద్యను అభ్యసించాలని సూచించారు. అదేవిధంగా జీవిత పాఠాలు కూడా నేర్పిస్తుందని అన్నారు. గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు అని, నేడు సెల్ ఫోన్‌లు వచ్చిన తర్వాత ప్రతీ విషయాన్ని గూగుల్‌లో సెర్చ్ చేసి చూస్తున్నారని అన్నారు. అయితే వీటి వలన అనారోగ్యాలతో పాటు అవసరం లేని వాటిని గ్రహించి జీవితం అదుపు తప్పిపోయే ప్రమాదం ఉందని వివరించారు. సెల్‌ఫోన్ అవసరమే కానీ అతిగా వాడకూడదని సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మి, మార్కెట్ కమిటీ చైర్మన్ గూటోజు కిష్టయ్య, గ్రంథాలయ కార్యదర్శి శ్రీలత, కాంగ్రెస్ పార్టీ లీడర్లు చల్లూరి మధు, సమ్మయ్య, పిప్పాల రాజేందర్, అప్పం కిషన్, తోట రంజిత్, దాట్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# 'టీ-ఫైబర్ ' బ్యాటరీలు మాయం

- దొంగతనానికి గురైన బ్యాటరీల విలువ సుమారు 60 వేల రూపాయలు





**మంగపేట నవంబర్ 14(జనంసాక్షి) :** మండలంలోని బుచ్చంపేట గ్రామపంచాయతీలో టి. ఫైబర్ సర్వర్ యూనిట్ బ్యాటరీలు నిర్వహణ సిబ్బంది నిర్లక్ష్యపు వైఖరితో దొంగలు పాలు అయినా ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలు ఇలా స్థానికులు, గ్రామపంచాయతీ సిబ్బంది తెలిపిన ప్రకారం ఈనెల 7వ తారీకున ఉదయం రోజువారి విధులలో భాగంగా పంచాయతీ సిబ్బంది కార్యాలయానికి వచ్చి తమ విధులను నిర్వహిస్తున్నామని గదులను శుభ్రం చేసే సమయంలో సిబ్బంది టి. ఫైబర్ యూనిట్ ఉన్న రూమ్ లోకి వెళ్లి చూడగా బ్యాటరీలు కనిపించడం లేదని ఈ విషయాన్ని వెంటనే ఇంచార్జ్ కార్యదర్శికి తెలపడం జరిగిందని తెలిపారు. ఇన్చార్జి కార్యదర్శి రూమును పరిశీలించగా బ్యాటరీలు లేకపోవడానికి గుర్తించి దొంగల పనేనని వెంటనే ఫైబర్ ఆపరేషన్, మెయింటెనెన్స్ సిబ్బందికి సమాచారం ఇచ్చినట్లు అనంతరం ఇంచార్జ్ కార్యదర్శి పోలీస్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. టి ఫైబర్ సర్వర్ నెట్వర్క్ ను గత బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రతి ఇంటికి ఇంటర్నెట్ సౌకర్యం అందించాలనే ఉద్దేశంతో ప్రతి గ్రామపంచాయతీ కార్యాలయంలో టీ ఫైబర్ సర్వర్ యూనిట్లను ఏర్పాటు చేయడం జరిగింది. నాటి నుండి నేటి వరకు కూడా టీ ఫైబర్ సేవలు వినియోగంలోకి రాకపోవడంతో అలాగే వాటి నిర్వహణ బాధ్యతలను సక్రమంగా నిర్వహించకపోవడంతో దొంగతనానికి గురైనట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ దొంగతనానికి గురైన టీ. ఫైబర్ సర్వర్ యూనిట్ బ్యాటరీల విలువ సుమారు 60 వేల విలువ కలిగి ఉంటాయని వారు తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వ లక్ష్యం మేరకు వాటిని ఉపయోగంలోకి తెచ్చి ప్రజలకు మెరుగైన ప్రభుత్వ సేవలు పల్లెల్లో అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



# గంజాయితో తిరుగుతున్న నలుగురు యువకులు అరెస్ట్

- 750 గ్రాములు స్వాధీనం

**భీమదేవరపల్లి, నవంబర్ 14 (జనంసాక్షి) :** వంగర శివారులో గస్తీ నిర్వహిస్తున్న పోలీసులు శుక్రవారం అనుమానాస్పదంగా కనిపించిన నలుగురు యువకులను అడ్డుకుని తనిఖీ చేశారు.వారి వద్ద నుంచి 750 గ్రాముల ఎండు గంజాయి, మొబైల్ ఫోన్లు,రెండు మోటార్ సైకిళు స్వాధీనం చేసినట్టు సీఐ తెలిపారు. సమాచారం మేరకు భీమదేవరపల్లి మండలంలోని వంగర ఎస్సై దివ్య పోలీసు సిబ్బందితో కలిసి రూట్‌మార్చ్ చేస్తుండగా పోలీసులు కనిపించగానే యువకులు పరుగుతీయడంతో వెంటపడి పట్టుకున్నట్టు తెలిపారు.విచారణలో వారు భద్రాచలం వద్ద గుర్తు తెలియని వ్యక్తుల నుంచి గంజాయి కొనుగోలు చేసి వినియోగం కోసం ఇక్కడికి తెచ్చుకున్నట్టు అంగీకరించినట్లు చెప్పారు. జూపాకకు చెందిన ఇల్లందుల నిఖిల్ , హుజూరాబాద్‌కు చెందిన కలిపాక శ్రీనివాస్, పచిమట్ల సాయినాథ్, పెద్దపాపయ్యపల్లికి చెందిన బండ అజయ్‌లను అరెస్టు చేశారు. స్వాధీనం చేసిన గంజాయి,వస్తువులతో పాటు నిందితులపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించినట్టు సీఐ వెల్లడించారు.

## న్యాయవాదుల విధుల బహిష్కరణ



**ఖానాపూర్ నవంబర్ 14 (జనం సాక్షి) :** న్యాయవాది పుట్ట అనిల్ పై జరిగిన దాడికి నిరసనగా ఖానాపూర్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కోర్టు విధులను బహిష్కరిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.సురేష్ తెలిపారు. శుక్రవారం కోర్టు ముందు నిరసన తెలిపిన సందర్భంగా ఆయన మాట్లాడారు. నిర్మల్ జిల్లా కేంద్రంలోని సీనియర్ సివిల్ జడ్జి కోర్టు ప్రాంగణంలో ఈ నెల 12వ తేదీన జరిగిన ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. న్యాయవాది అనిల్ వాహనాన్ని ధ్వంసం చేసిన వారిపై క్రమశిక్షణ చర్యలతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఖానాపూర్ బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రాజలింగం, న్యాయవాదులు మట్టేరి రాజశేఖర్, వెంకట్ మహేంద్ర, బాసెట్టి శివ, షబ్బీర్ పాషా, సలీం ఖాన్, రాచమల్ల అశోక్, ఎర్ర రవి, కడార్ల వెంకటేష్, ఖదీర్, తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు ఇబ్బంది కలగకుండా త్వరితగతిన కొనుగోలు చేయాలి

- జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**చిట్యాల, నవంబర్ 14( జనం సాక్షి):** పత్తి కొనుగోలు ప్రక్రియను పూర్తిస్థాయిలో పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ సీసీఐ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం మండలంలోని ఆంజనేయ ఆగ్రో ఇండస్ట్రీస్ కాటన్ అండ్ జిన్నింగ్ మిల్లు, బాల మురగన్ మిల్లుల్లో పత్తి కొనుగోళ్లను పరిశీలించారు. పత్తి తేమ శాతం, తూకం (కాంటా), రైతుల నమోదు వివరాలు, కాపాస్ కిసాన్ యాప్‌లో నమోదులు వంటి అంశాలను సమగ్రంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా రైతులతో కలెక్టర్ ముఖాముఖీ మాట్లాడి మీ పేరేంటి.... పత్తి విక్రయంలో ఏమైనా ఇబ్బందులు వస్తున్నాయా అని వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు సమయంలో ఎదురవుతున్న సమస్యలు, సౌకర్యాలు, మిల్లుల వద్ద లేబర్ అందుబాటు, తూకం పద్ధతి వంటి అంశాలపై వివరాలను అడిగి అధికారులకు పలు సలహాలు సూచనలు చేశారు. అనంతరం ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులకు ఇబ్బంది కలగకుండా అన్ని శాఖలు సమన్వయంగా పనిచేస్తూ కొనుగోలు త్వరితగతిన సాగేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలో పత్తి కొనుగోళ్లు సజావుగా కొనసాగేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ సూచించారు. పత్తి కొనుగోలు ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించి అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, తహసీల్దార్ ఇమామ్ బాబా, సీసీఐ ఇంచార్జి పట్టాభి రామయ్య , మిల్లర్ యాజమాన్లు ఆకుల రాజయ్య, బచ్చు భాస్కర్,తదితరులు పాల్గొన్నారు.

## రామప్ప దేవాలయాన్ని సందర్శించిన నెదర్లాండ్ దేశస్తులు



**ములుగు/ వెంకటాపూర్, నవంబర్ 14 (జనం సాక్షి):** వెంకటపూర్ మండలం పాలంపేట గ్రామం లోని రామప్ప దేవాలయంను నెదర్లాండ్ దేశానికీ చెందిన జోహన్,హాలేన్ దంపతులు సందర్శించారు.ఈ సందర్భంగా ఆలయంలో పూజలు నిర్వహించగా అర్చకులు హరీష్ శర్మ, ఉమా శంకర్ లు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ చరిత్ర, శిల్పకళ ప్రాముఖ్యతను టూరిజం గైడ్ విజయ్ కుమార్ లు వివరించారు ఈ సందర్భంగా వారు మాట్లడుతూ గ్రేట్ అర్కిటెక్చర్, బ్యూటిఫుల్ టెంపుల్ రామప్ప అని కోనియాడారు అనంతరం రామప్ప చెరువును సందర్శించి బోటింగ్ చేశారు. వారి వెంట దేవాదాయ,టూరిజం, పురావస్తు శాఖల సిబ్బంది, టూరిస్ట్ పోలీస్ లు శ్రీనివాస్, అరుణ్, శ్రీకాంత్,దశరత్,బద్రు, ఉన్నారు.

# నేటి బాలలే రేపటి తెలంగాణ భవిష్యత్తు

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల ప్రతినిధి, నవంబర్ 14, (జనంసాక్షి) :** రేపటి తెలంగాణ భవిష్యత్తు నేటి బాలలపై ఆధారపడి ఉందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు జిల్లా సంక్షేమ అధికారి రౌఫ్ ఖాన్, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి చాతరాజుల దుర్గాప్రసాద్, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి నీరటి రాజేశ్వరి, పశుసంవర్ధక శాఖ అధికారి శంకర్, ఇతర అధికారులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... 2047 రైసింగ్ తెలంగాణ విజన్ లో పిల్లల పాత్ర అత్యంత కీలకమైనదని, రేపటి తెలంగాణ భవిష్యత్తు నేటి బాలలపై ఆధారపడి ఉంటుందని తెలిపారు. 0-18 సంవత్సరాల వయసు ఉన్న వారందరూ పిల్లలుగా పరిగణించబడతారని, పిల్లలకు రాజ్యాంగం చట్టపరమైన హక్కులను కల్పించిందని, వీటిపై బాలలు అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. బాలికలు తమ ప్రతి హక్కును తెలుసుకోవాలని, దాడులు, వేధింపులను నిర్మూలించేందుకు సమాజం కట్టుబడి ఉండాలని తెలిపారు. పిల్లలు ఆరోగ్యంగా, సంతోషంగా, ధైర్యంగా ఎదిగేందుకు ప్రభుత్వం అన్ని ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తూ సకల సదుపాయాలతో కూడిన నాణ్యమైన విద్యను అందిస్తుందని, మధ్యాహ్న భోజనంలో మెనూ ప్రకారం పౌష్టిక ఆహారం అందిస్తుందని తెలిపారు. బాలల దినోత్సవం సందర్భంగా "మా రోజు - మా హక్కు" నినాదంతో బాలల హక్కుల పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని తెలిపారు. పిల్లల హక్కులపై అవగాహన పెంపొందించేందుకు అనేక కార్యక్రమాలు చేపట్టి చైతన్య పరచడం జరుగుతుందని, ఆ దిశగా సంబంధిత అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమానికి ముందుగా సంతకాల సేకరణ చేపట్టి, బాలల దినోత్సవం సందర్భంగా కేక్ కట్ కట్ చేసి బాలలకు జ్ఞాపికలు అందజేశారు.

## విద్యార్థుల సృజనాత్మకత వెలికితీయడమే యువజన ఉత్సవాల లక్ష్యం

- జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



**నిర్మల్ రూరల్, నవంబర్13(జనం సాక్షి) :** విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభ,నైపుణ్యాలను వెలికితీయడానికి యువజన ఉత్సవాలు దోహదపడతాయని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు.గురువారం పట్టణంలోని ఎన్‌టిఆర్ మినీ స్టేడియంలో నిర్వహించిన జిల్లా స్థాయి యువజన ఉత్సవాల ప్రారంభోత్సవంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమానికి హాజరైన కలెక్టర్ కు ఎన్‌సిసి విద్యార్థులు బ్యాండ్ మేళాలతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి మనిషి జీవితంలో యవ్వన దశ ఎంతో కీలకమైనదని,ఈ దశలో ఎటువంటి చెడు వ్యసనాలకు లోనుకాకుండా,జీవితంలో స్పష్టమైన లక్ష్యం పెట్టుకుని దానిని సాధించడానికి కృషి చేయాలన్నారు.స్వామి వివేకానంద వంటి మహనీయుల ఆలోచనలను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.యువజన ఉత్సవాల ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకత, నాయకత్వ గుణాలు, బృందాత్మకత పెంపొందుతాయని తెలిపారు.గత ఏడాది రాష్ట్రస్థాయిలో నిర్మల్ జిల్లాకు రెండో స్థానం రావడం గర్వకారణమని తెలిపారు.ఈసారి మరింత ప్రతిభ కనబరచి రాష్ట్ర,జాతీయ స్థాయిలో జిల్లాకు పేరు తెచ్చేలా విద్యార్థులు కృషి చేయాలని కలెక్టర్ సూచించారు.జిల్లా స్థాయి యువజన ఉత్సవాలను ఎటువంటి లోటుపాట్లు లేకుండా సమర్థవంతంగా నిర్వహించాలని,ప్రతి విద్యార్థి పాల్గొనే అవకాశాన్ని కల్పించాలని తెలిపారు.ఉపాధ్యాయులు విద్యార్థులను ఇలాంటి సృజనాత్మక కార్యక్రమాల్లో పాల్గొనేలా ప్రోత్సహించాలని సూచించారు అనంతరం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ మాట్లాడుతూ క్రీడలు, సాంస్కృతిక పోటీలలో గెలవడం కంటే పాల్గొనడమే ముఖ్యమైందని తెలిపారు. ఇలాంటి ఉత్సవాలు విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంపొందించడంలో, ఆత్మవిశ్వాసం పెంచడంలో దోహదపడతాయని అన్నారు.స్వామి వివేకానంద జయంతి సందర్భంగా దేశవ్యాప్తంగా జాతీయ యువజన దినోత్సవాన్ని జరుపుకుంటామని, అదే స్ఫూర్తితో ఈ యువజన ఉత్సవాలను నిర్వహిస్తున్నామని వివరించారు.వివేకానంద భారత యువతకు ప్రేరణ. ఆయన చూపిన మార్గంలో నడిస్తే దేశం మరింత అభివృద్ధి చెందుతుందని అన్నారు.అనంతరం కలెక్టర్ వైజ్ఞానిక ప్రదర్శనలను ప్రారంభించి,విద్యార్థులు రూపొందించిన నమూనాలను పరిశీలించారు.విద్యార్థులు తమ ఆవిష్కరణలను కలెక్టర్,అదనపు కలెక్టర్‌కు వివరించారు.ఈ కార్యక్రమంలో డీఈఓ భోజన్న,డివైస్ఓ శ్రీకాంత్ రెడ్డి,డిపిఆర్ఓ విష్ణువర్ధన్, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్,పలు పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

# యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి



**కొండమల్లేపల్లి, నవంబర్ 14 (జనంసాక్షి) :** విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా ఉన్నత లక్ష్యాసాధనకు కృషి చేయాలని ఏఎస్పీ మౌనిక అన్నారు. మండల కేంద్రంలోని విష్ణు షాపింగ్ మాల్ స్వాగత్ రెసిడెన్సిలో శుక్రవారం బాలల దినోత్సవం సందర్భంగా మాదకద్రవ్యాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఆమె పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి ఏఎస్పి మాట్లాడుతూ విద్యార్థులు డ్రగ్స్, మత్తు పదార్థులు, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని అన్నారు. జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఆదేశాల మేరకు ప్రాజేక్టుశుద్ధిలో భాగంగా విద్యార్థులకు డ్రగ్స్, మత్తు పదార్థలపై అవగాహన కల్పించారు. మత్తు పదార్ధాలతో విద్యార్థులు తప్పుదోవ పట్టడంతో వారి భవిష్యత్ ఆటంకం ఏర్పడుతుందని అన్నారు. విద్యార్థులు, యువత మాదకద్రవ్యాలకు బానిపై జీవితాలను నాశనం చేసుకుంటున్నారని గంజాయి మత్తు పదార్ధాలు తాగితే ఆరు నెలల వరకు దాని ప్రభావం శరీరంలో ఉంటుందని తెలిపారు. విద్యార్థులు దురలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. చరవాణిలో విద్యార్థులు హద్దులు దాటుతున్నందుకు రోజువారీ ప్రవర్తనలలో చెడు మార్పులు తల్తెతున్నాయన్నారు. ఇలా కొనసాగితే సమాజానికి కలిగే చెడుతో పాటు మానసిక పురోగతి తగ్గుతాయన్నారు. సెల్ ఫోన్ అతిగా వాడటం వలన చెవి, కంటి సమస్యలతో పాటు మెడనొప్పి మతి మరుపులు వస్తాయన్నారు. ప్రతి విద్యార్థి చిన్నతనం నుంచే సత్ప్రవర్తనను అలవర్చుకొని లక్ష్యం వైపు నడవాలని ఆమె సూచించారు. డ్రగ్స రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరు పాటుపడాలని సూచించారు. మాదక ద్రవ్యాలకు అలవాటు పడితే యువత జీవితం అంధకారం అవుతుందని యువత సన్మార్గంలో నడిచి ఉన్నత ఉద్యోగాలు సాధించాలని కోరారు. చాప కింద నీరుల ప్రవహిస్తున్న డ్రగ్స్ మాఫియాను అరికట్టాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ నవీన్ కూమార్, ఎస్ఐ అజ్మీర రమేష్, ఎంఈఓ నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు, వివిద పాఠశాలలకు చెందిన విద్యార్థులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ వరి ధాన్యం రాకుండా నిరంతర పర్యవేక్షణ

- జిల్లా ఎస్పీ నరసింహ
- నేరేడుచర్ల పోలీస్ స్టేషన్ తనిఖీ



**నేరేడుచర్ల, నవంబర్ 14 (జనంసాక్షి) :** రాష్ట్రంలో సన్న వరి ధాన్యానికి బోనస్ ఉండడం వల్ల ఇతర రాష్ట్రాల నుంచి అక్రమంగా ధాన్యాన్ని తీసుకువచ్చే అవకాశం ఉన్నందున జిల్లాలో అన్ని సరిహద్దులను అప్రమత్తం చేసి అక్రమ వరి ధాన్యం రాకుండా నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నామని, నిఘా ఉంచాం అని జిల్లా ఎస్పీ నరసింహ అన్నారు. బిసేఫ్ హుజూర్నగర్ సర్కిల్ ప్రాజెక్ట్లో భాగంగా కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ ప్రారంభించిన జిల్లా ఎస్పి నరసింహ మాట్లాడుతూ, జిల్లాలో పోలీస్ స్టేషన్ల వార్షిక తనిఖీలలో భాగంగా జిల్లా ఎస్పీ నరసింహ ఐపిఎస్ నేరేడుచర్ల పోలీస్ స్టేషన్ తనిఖీ చేశారు. ముందుగా పోలీసు సిబ్బంది ఎస్పీకి గౌరవ వందనంతో స్వాగతం తెలిపినారు. పోలీస్ స్టేషన్ ప్రాంగణం,పరిసరాలు పరిశీలించి. సిబ్బంది చక్కని యూనిఫామ్, క్రమశిక్షణ, పోలీస్ పరికరాలను పరిశీలించారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు, ఎలాంటి సమస్యా ఉన్న అధికారుల ద్వారా పరిష్కరించుకావాలని సూచించారు. సిబ్బంది సంక్షేమానికి ఎల్లప్పుడు కృషి చేస్తామని తెలిపారు. అనంతరం పోలీస్ స్టేషన్ మరియు సర్కిల్ కార్యాలయం యొక్క రికార్డ్సని తనిఖీ చేసి కేసుల నమోదు దర్యాప్తు వేగంగా చేయాలని ఎక్కడ కూడా ఆలస్యం చేయవద్దని బాధితులకు వేగంగా పోలీసు సేవలు అందిస్తే ప్రజల్లో మరింత గౌరవం పెరుగుతుందని తెలిపారు.ప్రతి ఫిర్యాదుని అంతర్జాలంలో నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ వెంట కోదాడ డీఎస్పీ శ్రీధర్ రెడ్డి, డిసిర్బి డిఎస్పీ రవి, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ రామారావు, హుజూర్ నగర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ చరమందరాజు,నేరేడుచర్ల ఎస్ఐ రవీందర్, డిసిఆర్బి సిబ్బంది అంజన్ రెడ్డి, శేఖర్, సి.సి సందీప్, ఏఎస్ఐ లు పోలీస్ స్టేషన్ సిబ్బంది ఉన్నారు.

# దంత వైద్య విభాగం ఉన్నా సేవలు మాత్రం దూరం

- పెనుబల్లి వైద్యశాలలో అందుబాటులో లేని దంత వైద్య పరికరాలు
- దంత చికిత్సకు దూర ప్రాంతాలకు వెళుతున్న ప్రజలు




**పెనుబల్లి, నవంబర్ 14 (జనం సాక్షి) :** మారిన జీవనశైలిలో ఎంతోమంది దంత సమస్యలతో సతమతమవుతున్నారు,ఓపక్క ఆరోగ్యం పట్ల శ్రద్ధ పెరుగుతున్నా దంతాల పరిశుభ్రతపై ఇంకా ప్రజల్లో అవగాహన కలగడం లేదు, అందునా గ్రామీణ ప్రజల్లో దంతాల పట్ల అవగాహన మరీ తక్కువగా ఉంది, ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం, పెనుబల్లి వైద్యశాలలో దంత వైద్య విభాగం ఉన్నా సేవలు మాత్రం అందడం లేదు,అరుదుగా తప్ప దంత వైద్యులు అందుబాటులోనే ఉంటున్నారు, ఒకప్పుడు నామమాత్రంగా జరిగే దంత వైద్య సేవలు కూడా ప్రస్తుతం పూర్తిగా ఆగిపోయాయి,దంత విభాగానికి ఒక రూము, డెంటల్ కుర్చీ ఉండేది,పంటి సమస్యలతో వచ్చే వారికి కొద్దిపాటి వైద్యం, సలహాలైనా అందేవి,ప్రస్తుతం డెంటల్ కుర్చీ పాడైపోయి కనిపించడం లేదు, డెంటల్ విభాగానికి కేటాయించిన రూమును కూడా వేరే వైద్య సేవలకు ఉపయోగిస్తున్నారు, ఏడు కోట్ల రూపాయలతో ఆధునిక హంగులతో నిర్మాణం పూర్తయిన కొత్త భవనంలోకి తరలిన తర్వాతైనా దంత వైద్య సేవలు కొనసాగించాలని ఈ ప్రాంత ప్రజలు ఎంతో ఆశతో ఎదురుచూస్తున్నారు.

## దంత వైద్య పరికరాలు సమకూర్చాలి

దంత వైద్య విభాగాన్ని తక్షణం ప్రారంభించాలి. అందుకు అవసరమైన వైద్య పరికరాలను సమకూర్చాలి. పాతికేళ్ల క్రితం అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటించినప్పుడు ఆసుపత్రి సమస్యలను ఏకరవు పెట్టగా వైద్య విధాన పరిషత్ కమిషనరును పంపారు. ఆ సందర్భంలోనే దంత విభాగం మంజూరైంది. దంత శస్త్ర చికిత్స సేవలు కూడా అందేవి. ఇప్పుడు అధికారులు, ప్రజా ప్రతినిధులు దృష్టి పెట్టాలి. మళ్లీ పూర్వ వైభవం తీసుకురావాలి.



**కాటినేని శ్రీనివాసరావు, సామాజిక కార్యకర్త**

## మిక్కిలినేనికి మాతృవియోగం



**ఖమ్మం, నవంబర్ 14 (జనం సాక్షి) :** జిల్లా కాంగ్రెస్ నాయకుడు, 54వ డివిజన్ కార్పొరేటర్ మిక్కిలినేని మంజుల భర్త మిక్కిలినేని నరేంద్రబాబు మాతృమూర్తి మిక్కిలినేని ప్రమీలారాణి(71) శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆమె భౌతిక కాయాన్ని ఖమ్మంలోని వీడిఓస్ కాలనీలో ఉన్న మిక్కిలినేని స్వగృహం వద్ద ఉంచగా ప్రముఖులు సందర్శించి నివాళులర్పించారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆమె భౌతిక కాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కార్పొరేటర్ మిక్కిలినేని మంజుల, జిల్లా కాంగ్రెస్ నాయకుడు మిక్కిలినేని నరేంద్రబాబును పరామర్శించి ఓదార్చారు. నివాళులు అర్పించిన వారిలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్ తదితరులు ఉన్నారు.

# 70 కోట్ల నిధులతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన



**మిర్యాలగూడ, నవంబర్ 14 (జనం సాక్షి) :** గెలిచి రెండేళ్లయినా పట్టణ అభివృద్ధి చేపట్ట లేదంటూ ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలకు అభివృద్ధి పనుల తోటే దీటుగా తోటేదిటుగా బదిలిస్తామన్నారు మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి (బిఎల్ఆర్). శుక్రవారం సుమారు 70 కోట్ల నిధులతో చేపట్టే పలు అభివృద్ధి పనులకు తనకు సెంటిమెంట్ గా కలిసొచ్చినఈదులగూడెం లోని రామాలయంఎదుట సి సి రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్ల అధికారంలో ఉన్న బిఆర్ఎస్ పాలకులు అభివృద్ధిని కాగితాల్లోనే చూపించారని, క్షేత్రస్థాయిలో అస్తవ్యస్తమైన పనులతో పట్టణ అభివృద్ధిని కుంటుపరిచారని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జి.శ్రీనివాస్, డి ఈ వెంకన్న, ఏఈ నవీన్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్ రెడ్డి, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు ముదిరెడ్డి నర్సిరెడ్డి, మాజీ కౌన్సిలర్లు బండి యాదగిరి రెడ్డి, రవి నాయక్,కొమ్ము శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు బిఎల్ఆర్ బ్రదర్స్ పాల్గొన్నారు.

## పుస్తకపఠనం వల్ల జ్ఞానం పెరుగుతుంది

- అదనపు కలెక్టర్ కె.సీతారామరావు



**సూర్యాపేట ప్రతినిధి, నవంబర్ 14 (జనంసాక్షి) :** పుస్తక పఠనం వలన జ్ఞానం పెరుగుతుందని జిల్లా అదనపు కలెక్టర్ కె.సీతారామరావు అన్నారు. శుక్రవారం జిల్లా గ్రంథాలయంలో ప్రారంభమైన జాతీయ గ్రంథాలయ వారోత్సవాలకు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఇంటర్మీడియట్ చదువుకునే సమయంలో గ్రంథాలయంతో అనుబంధం ఏర్పడిందని తెలిపారు.కావాల్సిన పుస్తకాలను గ్రంథాలయం నందే వినియోగించుకొని నేడు ఉన్నత స్థాయిలో ఉన్నట్లు తెలిపారు.గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని పేర్కొన్నారు.ఒకప్పుడు ఇప్పుడున్న టెక్నాలజీ లేకపోవడం, మొబైల్ లు లేకపోవటం వలన పుస్తక పఠనం అనేది తమకు ఒక వ్యసనంగా ఉండేదని తెలిపారు.ఎక్కువ సమయం గ్రంథాలయం నందు గడపడం జరిగేదని తెలిపారు.యువత గ్రంథాలయాలను వినియోగించుకొని రాబోయే నోటిఫికేషన్లలో ఉద్యోగాలు సాధించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వంగవేటి రామారావు, కార్యదర్శి బాలమ్మ, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ యానాల యాదగిరి రెడ్డి, తోట శ్యామ్ ప్రసాద్,అసిస్టెంట్ లైబ్రరియన్ వి.శ్యామ్ సుందర్ రెడ్డి, లైబ్రరియన్స్ ఎంవి.రంగారావు, కె.విజయభాస్కర్, పి.సృజన, నిర్మల, లక్ష్మమ్మ, భవాని, శ్రీను, సోషల్ వర్కర్ ఆలూరు విక్టర్, పాఠకులు తదితరులు పాల్గొన్నారు.

# విశ్వసనీయతకే పట్టం కట్టిన జూబ్లీహిల్స్ ప్రజలు

- దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్



**కొండమల్లేపల్లి, నవంబర్ 14 (జనంసాక్షి) :** జూబ్లీహిల్స్ ఉపఎన్నికల ఫలితాలపై ఎమ్మెల్యే బాలు నాయక్ హర్షం వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ఫలితాల సందర్భంగా ఎమ్మెల్యే బాలు నాయక్ మాట్లాడుతూ జూబ్లీహిల్స్లో గెలుపు కోసం కృషి చేసిన అందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు చెప్పారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గ ప్రజలు, ఓటర్లకు ధన్యవాదాలు చెప్పారు. ఈ విజయం కాంగ్రెస్ పార్టీ బాధ్యతను మరింత పెంచిందని అన్నారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో గ్రేటర్ హైదరాబాద్లో కాంగ్రెస్కు సరైన ఫలితాలు రాలేదు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత హైదరాబాద్ ప్రజలకు కాంగ్రెస్పై క్రమంగా నమ్మకం పెరుగుతోందని అన్నారు. గెలుపోటములకు కాంగ్రెస్ ఎప్పుడూ కుంగిపోదు పొంగిపోదు అని చెప్పారు. ప్రజల తరపున నిలబడటం, పోరాడటమే కాంగ్రెస్ కర్తవ్యం అని అన్నారు. రాష్ట్రంలో రెండేళ్ల కాంగ్రెస్ పాలనను ప్రజలు నిశితంగా పరిశీలించి జూబ్లీహిల్స్లో తీర్పు ఇచ్చారని తెలిపారు. ఇప్పటికైనా బీఆర్ఎస్, బీజేపీ నేతలు అర్థం చేసుకొని ప్రభుత్వానికి, రాష్ట్ర అభివృద్ధికి సహకరించాలని కోరారు. రాష్ట్ర ఆదాయంలో 65 శాతం వరకు హైదరాబాద్ నుంచే వస్తోందని హైదరాబాద్ అభివృద్ధి కోసం ఎవరి పాత్ర వాళ్లం పోషిద్దామని పిలుపునిచ్చారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం పాలనకు జూబ్లీహిల్స్ ప్రజలు పట్టం



**తుంగతుర్తి, నవంబర్ 14 (జనం సాక్షి) :** రెండు సంవత్సరాల ప్రజా పాలన కాంగ్రెస్ పాలనకు జూబ్లీహిల్స్ ప్రజలు జై కొట్టి విపక్ష ప్రతిపక్ష పార్టీ బిఆర్ఎస్ కు తగిన గుణపాఠం చెప్పారని తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామేలు, తెలంగాణ రాష్ట్ర రైతు కమిషన్ సభ్యులు చెవిటి వెంకట యాదవ్ అన్నారు, శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూతెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి పదం వైపు నడిపిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిపాలనకు జూబ్లీహిల్స్ ప్రజలుప అత్యుత్తమ తీర్పు ఇచ్చారని అన్నారు.అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ఆ ప్రాంత ప్రజలు కాంగ్రెస్ పార్టీ వైపు మొగ్గుచూపి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ను భారీ మెజార్టీతో గెలిపించినందుకు జూబ్లీహిల్స్ ప్రజలకు కృతజ్ఞత తెలియజేస్తూ హర్షం వ్యక్తం చేశారు. నవీన్ యాదవ్ విజయం పట్ల హర్షం వ్యక్తం చేసిన వారిలో ఉమ్మడి నల్లగొండ జిల్లా డిసిసిబి డైరెక్టర్ తుంగతుర్తి సింగిల్ విండో చైర్మన్ గుడిపాటి సైదులు,తుంగతుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న, జిల్లా నాయకులు రేగటి రవి, సంవిధాన్ మండల కోఆర్డినేటర్ మాచర్ల అనిల్,దాసరి శ్రీను తదితరులు ఉన్నారు.

## అథ్లెటిక్స్ పోటీలలో షాట్‌పుట్ విభాగంలో మొదటి స్థానం సాధించిన చరణ్




**చింతలపాలెం, నవంబర్ 14 (జనంసాక్షి) :** చింతలపాలెం మండలం,దొండపాడు గ్రామంలో జువారి సిమెంట్ సౌజన్యంతో నడుస్తున్న డిఏవి పాఠశాలలో పదో తరగతి చదువుతున్న మాస్టర్ బి చరణ్ ఉమ్మడి నల్గొండ జిల్లా స్థాయి అండర్-17 బాలుర అథ్లెటిక్స్ పోటీలలో షాట్ పుట్ విభాగంలో మొదటి స్థానం సాధించాడు.తెలంగాణ రాష్ట్ర స్థాయిలో జరిగే అథ్లెటిక్స్ పోటీలలో పాల్గొనాల్సి ఉంటుంది.ఈ సందర్భంగా మాస్టర్ చరణ్ ను జువారీ హెడ్ వర్క్స్ జి యన్ బి రావు,డిఏవి పాఠశాల ప్రధానోపా ధ్యాయురాలు కె మాధవి,చింతల పాలెం మండల విద్యాధికారి నారపరాజు శ్రీనివాస్, యస్.జి.ఎఫ్ ఇంచార్జ్ ఉస్మాన్ షేక్, డిఏవి పాఠశాల వ్యాయామ విద్యా ఉపాధ్యాయు డు వీరభద్రం,ఉపాధ్యాయినీ ఉపాధ్యా యు లు మరియు తల్లిదండ్రులు అందరూ శుభా కాంక్షలు తెలియజేశారు. రాష్ట్రస్థాయిలో జరగబోయే క్రీడా పోటీలలో కూడా చక్కటి ఆట తీరును ప్రదర్శించి ప్రథమ బహుమతి సాధించాలని ప్రోత్సహిస్తూ ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది.

## స్నైడర్ ఎలక్ట్రిక్‌కు 87 మంది యస్‌బిఐటి విద్యార్థుల ఎంపిక



**ఖమ్మం, నవంబర్ 14 (జనం సాక్షి) :** ప్రముఖ అంతర్జాతీయ ఎలక్ట్రిక్ వాహన రంగ సంస్థ స్నైడర్ ఎలక్ట్రిక్ కు తమ కళాశాలకు చెందిన 87 మంది విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. శుక్రవారం కళాశాల ఆవరణలో జరిగిన ప్రాంగణ నియామకాలలో విద్యార్థులనుద్దేశించి ప్రసంగిస్తూ పెరుగుతున్న ప్రమాణాల దృష్ట్యా వాహన రంగంలో రానున్న రోజులలో మరింత ఆదరణ ఉంది అని కృష్ణ తెలిపారు. అత్యంత వేగంగా విస్తరిస్తున్న రంగాలలో వాహన రంగం ముందుంటుందని గుర్తు చేశారు. కాగా స్నైడర్ ఎలక్ట్రిక్ 2025వ సంవత్సరానికి గాను ప్రపంచంలో అత్యంత స్థిరత్వం కలిగిన కంపెనీగా టైమ్ మ్యాగజైన్‌లో మొదటి స్థానం సాధించిందని తెలిపారు. స్నైడర్ ఎలక్ట్రిక్ వంటి అంతర్జాతీయ సంస్థలలో తమ విద్యార్థులు ఎంపిక అవ్వడం హర్షించదగ్గ విషయం అని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డా? జి. ధాత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపికలు నిర్వహించిన స్వింగార్ ఎంటర్ప్రైజెస్ హెచ్.ఆర్ ఎగ్జిక్యూటివ్ కార్తీక్ అన్నామలై తో పాటు కళాశాల అకడమిక్ డైరెక్టర్స్ గుండాల ప్రవీణ్ కుమార్, గంధం శ్రీనివాసరావు, డా. ఎ.వి.వి. శివ ప్రసాద్, డా? జె. రవీంద్రబాబు, టి.పి.ఒ.యన్. సవిత, కోఆర్డినేటర్ డా. జి. ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు క్రమశిక్షణను అలవర్చుకోవాలి

**వేములపల్లి, నవంబర్ 14 (జనంసాక్షి) :** విద్యార్థులు క్రమశిక్షణను అలవర్చుకోవాలని, విద్యతోనే విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు ఆధార పడి ఉంటుందని మిర్యాలగూడ మండల విద్యాధి కారి బాలునాయక్, జనయేత్రీ ఫౌండేషన్ వ్యవస్థా పక అధ్యక్షుడు డా. మునీర్ అహ్మద్ షరీఫ్ లు అన్నారు.శుక్రవారంమిర్యాలగూడ పట్టణం బంగారి గడ్డ లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చాచా నెహ్రూ పుట్టినరోజును పురస్కరించుకొని బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా జనయేత్రీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకి పెన్నులు, రాత పుస్తకాలు , అల్పాహారం బిస్కెట్ ప్యాకెట్లు అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి. లక్ష్మి మాట్లాడుతూ భవిష్యత్ తరాల బంగారునిధి పిల్లలేనని వారికి మనం నేర్పే చదువు సంస్కారం క్రమశిక్షణతో భవిష్యత్ లో మంచి స్థానల్లో రాణిస్తారన్నారు. పిల్లలకు మంచి భవిష్యత్తు ఇవ్వాలంటే వాళ్లను విలాసాలతో కాదు విలువలతో పెంచాలని పిల్లల కోసం ఆస్తులు పెంచకుండా పిల్లలనే ఆస్తులుగా పెంచాలని ఆమె కోరారు. పాఠశాలలో బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించిన జనయేత్రీ ఫౌండేషన్ కి కృతజ్ఞతలు తెలియజేశారు. జనయేత్రీ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డా. మునిర్ అహ్మద్ షరీఫ్ మాట్లాడుతు భారతదేశ మొదటి ప్రధానిగా నెహ్రూ దేశసేవలో ఎంతో స్ఫూర్తిదాయకంగా పనిచేశారని, ముఖ్యంగా పసిపిల్లలు అంటే చాచా నెహ్రూకి ఎనలేని ప్రేమని నెహ్రు జన్మదినం సంధర్భంగావిద్యార్థులతో గడపటం చాల సంతోషంగా ఉందని తల్లిదండ్రులు గర్వించే స్థాయిలో విద్యార్థులు తమ ప్రతిభ చాటి చదువు నేర్పిన గురువులకి మంచిపేరు తీసుకురావలని కోరారు. ఈ కార్యక్రమంలో జనయేత్రీఫౌండేషన్ జిల్లా గౌరవ అధ్యక్షులు అహ్మద్,పాఠశాలఉపాధ్యాయులు వీరనారాయణ, మహమ్మద్



ఫెరోజ్ , జనార్ధన్,ఎల్లమ్మ, రజని,శ్రీనివాస్,సైదిరెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ వెంకటయ్య. జననేత్రి ఫౌండేషన్ జిల్లా కార్యనిర్వహక అధ్యక్షులు కొమరొజు యాదగిరి, జనయేత్రీ ఫౌండేషన్ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.




# రూల్స్ మార్చరూ..

## ట్రాయ్‌కు జియో విన్నపం



**న్యూఢిల్లీ:**5జీ సాంకేతికత రాకతో అంత ర్జాతీయంగా మార్కెట్లలో మార్పులు, టెక్నాలజీ పురోగతికి అనుగుణంగా నెట్ న్యూట్రాలిటీ నిబంధనలను సడ లించాలని టెలికం రంగ నియంత్రణ సంస్థ ట్రాయ్‌ని రిలయన్స్ జియో కోరింది. దేశవ్యాప్తంగా 5జీ సేవల విస్తరణతో, గేమింగ్ కోసం తక్కువ లేటెన్సీ ఉండే విధంగా, అప్‌లోడ్స్ కోసం వేగం ఎక్కువగా ఉండేలా వివిధ అవసరాలకు తగ్గ వేగంతో ఇంటర్నెట్ లభ్యత ఉండేలా ప్రోడక్టులను రూపొందించాలనే ప్రతిపాదనలు వస్తున్నాయని వివరించింది. బ్రిటన్ నియంత్రణ సంస్థ ఆఫ్‌కామ్ కూడా ప్రత్యేక సర్వీసులు, ప్రీమియం నాణ్యత గల ఇంటర్నెట్ సర్వీసులను అందించేందుకు అనుమతిస్తోందని పేర్కొంది. ఈ నేపథ్యంలో దేశీయంగా కఠినతరమైన నిబంధనలను సడలించాలని కోరింది. జియో, ఎయిర్‌టెల్‌లాంటి ఇంటర్నెట్ సర్వీస్ ప్రొవైడర్లు ఏ ఒక్క యాప్, వెబ్‌సైట్ లేదా సర్వీసులపై పక్షపాతం చూపకుండా అన్నింటినీ ఒకే దృష్టితో చూస్తూ, ఒకే రకమైన వేగంతో అందించాలని నెట్ న్యూట్రాలిటీ నిబంధనలు నిర్దేశిస్తున్నాయి. అంతేకాక, నెట్ న్యూట్రాలిటీపై ప్రస్తుతం జరుగుతున్న చర్చల్లో 5జీ, ఎడ్జ్ కంప్యూటింగ్, ఐఓటీ వంటి ఆధునిక సాంకేతికతల వల్ల ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ మరింత క్లిష్టమవుతున్నట్లు నిపుణులు చెబుతున్నారు. విపరీతంగా పెరుగుతున్న డేటా వినియోగాన్ని సమర్థంగా నిర్వహించాలంటే నెట్‌వర్క్‌లలో 'క్వాలిటీ ఆఫ్ సర్వీస్' ఆధారంగా ప్రాధాన్యత కేటాయించే అవకాశాలు పరిశీలించాల్సి వస్తుందని అభిప్రాయపడుతున్నారు. అయితే ఇదే సమయంలో, వినియో గదారుల ప్రాథమిక హక్కులు, ఏ యాప్‌కైనా సమాన యాక్సెస్ లభించాలనే సూత్రం దెబ్బతినకుండా జాగ్రత్తలు అవసరమని హెచ్చరిస్తున్నారు.

## ఉద్యోగులకు అనిల్ అంబానీ వరాలు

**న్యూఢిల్లీ:**అనిల్‌అంబానీనేతృత్వంలోనిరిలయన్స్ గ్రూప్ తొలిసారిగా తమ గ్రూప్‌లోని రెండు సంస్థల ఉద్యోగులకు స్టాక్ ఆప్షన్స్‌ను (ఎసాప్స్) ప్రకటించింది. రిలయన్స్ ఇన్‌ఫ్రా (ఆర్‌ఇన్‌ఫ్రా), రిలయన్స్ పవర్‌లోని 2,500 మంది ఉద్యోగులకు ఇవి లభిస్తాయని ఒక ప్రకటనలో తెలిపింది. దీని ప్రకారం రూ. 10 ముఖ విలువ గల షేరును అదే విలువకు ఉద్యోగులకు కేటాయిస్తారు. దీర్ఘకాలంగా, నమ్మకంగా కొనసాగుతున్న చాలా మటుకు ఉద్యోగుల సేవలకు గుర్తింపుగా నవంబర్ 3న ఎసాప్స్ ప్రతిపాదనకు షేర్‌హోల్డర్లు ఆమోదం తెలిపినట్లు కంపెనీ వివరించింది. రిలయన్స్ గ్రూప్‌లో 28,000 మంది ఉద్యోగులు, రూ. 1,07.123 కోట్ల అసెట్స్ ఉన్నాయి. రిలయన్స్ ఇ న్ఫ్రాసెప్టెంబర్ 2025 త్రైమాసికంలో నికర లాభం 50% తగ్గి రూ. 1,911 కోట్లకు పడిపోయింది. ఇది ఒక సంవత్సరం క్రితం రూ. 4,082 కోట్లుగా ఉంది. ఆదాయం కూడా రూ. 7,346 కోట్ల నుంచి రూ. 6,309 కోట్లకు తగ్గింది. వృద్ధి కార్యక్రమాలకోసం 600 మిలియన్ డాలర్లసమీకరణ ప్రణాళికలను కంపెనీ ఇటీవల ప్రకటించింది.

# ఆఖర్లో కొనుగోళ్లతో స్వల్ప లాభాల్లోకి..


**ముంబయి:** బిహార్ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి దూకుడు నేపథ్యంలో స్టాక్ మార్కెట్ సూచీలు దూసుకెళ్తాయని భావించారంతా. కానీ, అందుకు విరుద్ధంగా స్టాక్ మార్కెట్ సూచీలు నేడు రోజంతా నష్టాల్లోనే కదలాడాయి. ఆఖర్లో కాస్త కొనుగోళ్ల మద్దతుతో స్వల్ప లాభాలకే పరిమితమయ్యాయి. వాల్‌స్ట్రీట్‌లో నిన్న ఏఐ లింక్డ్ స్టాక్స్‌లో అమ్మకాలు, డిసెంబర్‌లో వడ్డీ రేట్ల కోత ఉండకపోవచ్చన్న ఫెడ్ అధికారులు సంకేతాలు మార్కెట్ సెంటిమెంట్ దెబ్బతింది. ఈ ప్రభావాన్ని నేడు ఆసియా మార్కెట్లు చవిచూశాయి. దీంతో బిహార్ ఎన్నికల ఫలితాలు సూచీలపై పెద్దగా ప్రభావం చూపలేకపోయాయి. సెన్సెక్స్ ఉదయం 84,060.14 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 84,478.67) నష్టాల్లో ప్రారంభమైంది. దాదాపు రోజంతా నష్టాల్లోనే కొనసాగింది. ఇంట్రాడేలో 84,029.32 వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచీ.. ఆఖరి గంటలో కొనుగోళ్ల మద్దతు కలిసొచ్చింది. ముఖ్యంగా పీఎస్‌యూ బ్యాంకుల్లో కొనుగోళ్లతో సెన్సెక్స్ చివరికి 84.11 పాయింట్ల లాభంతో 84,562.78 వద్ద ముగిసింది. నిఫ్టీ 30.90 పాయింట్ల లాభంతో 25,910.05 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 88.73గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో ఎటెర్నల్, బీఈఎల్, ట్రెంట్, యాక్సిస్ బ్యాంక్, ఎస్‌బీఐ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. ఇన్ఫోసిస్, టీఎంపీఈవీ, టాటా స్టీల్, ఐసీఐసీఐ బ్యాంక్, టెక్ మహీంద్రా షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 64.50 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4162 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.



# అమెరికన్ కంపెనీ లేఆఫ్స్

## 15వేల మంది బయటకు!

వాషింగ్టన్(జనంసాక్షి):ఏడాది (2025) ముగుస్తున్నా.. ఉద్యోగులలో లేఆఫ్స్ భయం మాత్రం తగ్గడం లేదు. దీనికి కారణం దిగ్గజ కంపెనీలు ముందస్తు హెచ్చరికలు లేకుండానే.. ఉద్యోగులను జాబ్స్ నుంచి తొలగించడమే. ఇప్పుడు ఈ జాబితాలోకి ప్రముఖ అమెరికన్ టెలికమ్యూనికేషన్స్ కంపెనీ వెరిజోన్ చేరింది. కంపెనీలో పనిచేస్తున్న ఉద్యోగులలో 15 శాతం మందిని తొలగించడానికి సిద్ధమవుతున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. వెరి జోన్ కంపెనీ పునర్వ్యవస్థీకరణలో భాగంగా.. సంస్థ సీఈఓ డాన్ షుల్మాన్ ఆధ్వ ర్యంలో వేలాది ఉద్యోగాలను తగ్గించనున్నట్లు రాయిటర్స్ నివేదించింది. ఈ ప్రభావం 15000 నుంచి 20000 ఉద్యోగులపై పడుతుంది. కంపెనీ ఇంత పెద్ద మొత్తంలో ఉద్యోగులను తొలగించడం బహుశా ఇదే మొదటిసారి. వెరిజోన్‌లో 2024 చివరి నాటికి దాదాపు 1,00,000 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. వెరిజోన్ సంస్థ న్యూజెర్సీ, టెక్సాస్, ఫ్లోరిడా, న్యూయార్క్ ప్రాంతాల్లో ఎక్కువమంది ఉద్యోగులను కలిగి ఉంది. కంపెనీ ఉద్యోగుల తొలగింపును చేపట్టిన తరువాత.. ఈ ప్రభావం చిన్న చిన్న కార్యాలయాలపై పడే అవకాశం ఉంది. దీంతో అవి మూతపడే అవకాశం కూడా ఉంది. కాగా కంపెనీ యాజమాన్యంలోని 200 స్టోర్లను ఫ్రాంచైజీలుగా మార్చాలని యోచిస్తోందని సమాచారం. వెరిజోన్ వరుసగా రెండు త్రైమాసికాల నుంచి సబ్‌స్క్రైబర్ల క్షీణతను ఎదుర్కుంటోంది. అంతే కాకుండా ఇది దాని ప్రత్యర్థుల కంటే కూడా వెనుకబడి ఉంది. ఇదే సమయంలో డాన్ షుల్మాన్ కొత్త సీఈఓగా బాధ్యతలు స్వీకరించారు. కస్టమర్లకు అత్యుత్తమ సేవలను అందిస్తూ.. ప్రత్యర్థులకు గట్టి పోటీ ఇస్తామని, మా వాటాదారులకు స్థిరమైన రాబడిని అందించడానికి కృషి చేస్తామని ఆయన (డాన్ షుల్మాన్) పేర్కొన్నారు.



# ఇన్ఫోసిస్‌ప్రైజ్ 2025 విజేతల ప్రకటన

విభిన్న రంగాల్లో అత్యుత్తమ కృషి చేసిన ఆరుగురు పరిశోధకులు, శాస్త్రవేత్తలకు ఇన్ఫోసిస్ సైన్స్ ఫౌండేషన్ 'ఇన్ఫోసిస్ ప్రైజ్ 2025'ను ప్రకటించింది. ఆరు వేర్వేరు విభాగాల్లోని సమకాలీన పరిశోధకులు, శాస్త్రవేత్తల విజయాలను గుర్తించి ఏటా ఈ అవార్డును అందజేస్తారు. వీరి ప్రతిభను గౌరవిస్తూ ప్రతి ఒక్కరికీ బంగారు పతకం, ప్రశంసా పత్రం, 1,00,000 డాలర్లు (సుమారు రూ. 88 లక్షలు)ఇస్తారు.

**విజేతలు:**

ఫిజికల్ సైన్సెస్: కాల్‌టెక్‌లోని కెమికల్ ఇంజినీరింగ్, కెమిస్ట్రీ ప్రొఫెసర్ కార్తీష్ మంతిరామ్ ఈ బహుమతిని గెలుచుకున్నారు. పునరుత్పాదక విద్యుత్తును ఉపయోగించి స్థిరమైన రసాయన ప్రక్రియలను సృష్టించడంపై ఆయన చేసిన కృషికి గాను ఈ అవార్డు లభించింది.

**గణిత శాస్త్రం:** ముంబైలోని టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్‌లో అసోసియేట్ ప్రొఫెసర్ అయిన సవ్యసాచి ముఖర్జీ విజేతగా నిలిచారు. గ్రూప్ డైనమిక్స్, సంక్లిష్ట విశ్లేషణ వంటి గణితంలోని వివిధ రంగాలను అనుసంధానించే ఆయన పరిశోధన, నమూనాలకు గుర్తుగా ఈ గుర్తింపు లభించింది.

**లైఫ్ సైన్సెస్:** బెంగళూరులోని నేషనల్ సెంటర్ ఫర్ బయోలాజికల్ సైన్స్‌లో అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ అంజనా బద్రినారాయణన్ విజేతగా నిలిచారు. జీవన వ్యవస్థలను స్థిరంగా, ఆరోగ్యంగా ఉంచే ముఖ్యమైన ప్రక్రియలను అర్థం చేసుకోవడంలో సహాయపడే ఆమె పరిశోధనకు ఈ అవార్డు దక్కింది.

ఇంజినీరింగ్, కంప్యూటర్ సైన్స్: టొరంటో విశ్వవిద్యాలయంలో అసోసియేట్ ప్రొఫెసర్ సుశాంత్ సచ్‌దేవకు ఈ బహుమతి లభించింది. ప్రపంచవ్యాప్తంగా కమ్యూనికేషన్, ఆరోగ్య సంరక్షణ, రవాణా వ్యవస్థల కోసం మెరుగైన అల్గోరిథమ్‌లను రూపొందించడంలో ఆయన చేసిన కృషికి ఈ అవార్డు లభించింది.

హ్యుమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్: చికాగో విశ్వవిద్యాలయంలో అసోసియేట్ ప్రొఫెసర్ ఆండ్రూ ఓలెట్‌కు ఈ అవార్డు దక్కింది.

**ఎకనామిక్స్:** ఎంఐటీలో ఎకనామిక్స్ ప్రొఫెసర్‌గా ఉన్న నిఖిల్ అగర్వాల్ ఈ అవార్డును గెలుచుకున్నారు.

విజేతలను ప్రకటించిన సమావేశంలో ఇన్ఫోసిస్ సైన్స్ ఫౌండేషన్ ట్రస్టీ, ఇన్ఫోసిస్ లిమిటెడ్ వ్యవస్థాపకుడు ఎన్‌ఆర్ నారాయణ మూర్తి మాట్లాడుతూ..'పరిశోధన చేయడానికి ధైర్యం, పట్టుదల, ఊహ అవసరం. ఇది సైన్స్, సమాజం, విలువలు, నైతికతను వారధిగా ఉపయోగించుకుంటుంది. ఆకలి, పేదరికం, మూఢనమ్మకాలు, ఆచారాలు, సంప్రదాయాల్లోని సమస్యలను సైన్స్ మాత్రమే పరిష్కరించగలదు. భారతదేశాన్ని, ప్రపంచాన్ని మెరుగ్గా మార్చడానికి పరిశోధనే ఏకైక మార్గం' అని పేర్కొన్నారు.

# హెూండా రీకాల్..

హెూండా మోటార్‌సైకిల్ స్కూటర్ ఇండియా భారత మార్కెట్లోని బిగ్‌వింగ్ అవుట్‌లెట్‌ల ద్వారా విక్రయించే ప్రీమియం 1000 హార్నెట్ కోసం రీకాల్ ప్రకటించింది. ఇంతకీ కంపెనీ ఎందుకు రీకాల్ ప్రకటించింది?, సమస్య ఏమిటనే వివరాలు ఈ కథనంలో చూసేద్దాం. ఎగ్జాస్ట్ నుంచి వచ్చే వేడి వల్ల సీటు ఉపరితలం మృదువుగా మారే అవకాశం ఉంది. ఈ సమయంలో పెడల్ పివోట్ వదులయ్యే అవకాశం ఉందని హెూండా చెబుతోంది. ఈ వేడి కారణంగా గేర్ బోల్ట్ వదులైతే.. అది రైడింగ్ చేస్తున్నప్పుడు పడిపోవచ్చు. తద్వారా గేర్‌లను మార్చేటప్పుడు సమస్య తలెత్తుతుందని కంపెనీ స్వచ్ఛందంగా రీకాల్ ప్రకటించింది.

**జనవరి 2026 నుంచి సర్వీస్**

ఈ సమస్యను పరిష్కరించడానికి.. మోటార్ సైకిల్ వారంటీ స్థితితో సంబంధం లేకుండా, ప్రభావిత భాగాలను కంపెనీ ఉచితంగా చెక్ చేసి భర్తీ చేస్తుంది. రీకాల్ సర్వీస్ జనవరి 2026 నుంచి భారతదేశం అంతటా ఉన్న హెూండా బిగ్‌వింగ్ టాప్‌లైన్ డీలర్‌షిప్‌లలో ప్రారంభమవుతుంది. హెూండా మోటార్‌సైకిల్.. దాని బిగ్‌వింగ్ డీలర్‌లతో కలిసి కస్టమర్లకు ఫోన్ కాల్స్, ఎస్ఎమ్ఎస్ ఈమెయిల్స్ ద్వారా రీకాల్ గురించి తెలియజేస్తుంది.



## గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 6.02 | ₹ 6.04 |

## బంగారం ధరలు (10 గ్రాములు)

హైదరాబాద్

| ₹ 1,16,450 | ₹ 1,27,040 |
|---|---|
| (22 క్యారెట్లు) | (24 క్యారెట్లు) |

## వెండి ధరలు (కేజీ)

హైదరాబాద్

₹ 1,83,100



ఎంతో ఉత్కంఠ మధ్య కొనసాగుతున్న బిహార్ అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపులో ఎన్డీయే కూటమి ఘన విజయం సాధించింది ప్రస్తుత ట్రెండ్స్ ఫలితాల్లోకి మారితే, నితీష్ కుమార్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టే అవకాశం ఉంది. ఎన్డీయే అధికారికంగా సీఎం అభ్యర్థిగా ఆయన పేరు ప్రకటించనప్పటికీ, నాయకులు ఆయనే సీఎం అని గట్టిగా నమ్ముతున్నారు. అయితే ఎన్డీయే విజయభేరి వెనుక రహస్యం ఏంటి అనేది చర్చనీయాంశంగా మారింది. నవంబర్ 14న జరిగిన బిహార్ అసెంబ్లీ ఎన్నికల లెక్కింపులో నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్ మెజారిటీ మార్కును దాటింది, ఎగ్జిట్ పోల్స్ అంచనాలకనుగుణంగా నితీశ్ కుమార్ నాయకత్వానికే ప్రజలు మొగ్గు చూపారు. కాంగ్రెస్-ఆర్జేడీ నేతృత్వంలోని మహాఘట్‌బంధన్‌కు ఘోర పరాభవం తప్పలేదు. బిహార్ సీఎంకోసం తేజస్వి కలలు కల్లలయ్యాయి.

# మహిళలే 'కింగ్ మేకర్స్'

## బిహార్ ఎన్నికల ప్రభంజనంలో వారిదే పైచేయి

**పాట్నా:**బిహార్ ఈసారి ఓటింగ్ రికార్డులను బద్దలు కొట్టింది. ఈ సారి నమోదైన రికార్డ్ఓటింగ్‌ను ఎన్డీయే విజయానికి మార్గం సుగమం చేసింది. 60 శాతం అధిక పోలింగ్ శాతం ఉంది. చిన్న పోలింగ్ కేంద్రాలు, సవరించిన ఎన్నికల జాబితా యాక్సెస్ ఓటింగ్ శాతాన్ని పెంచిందంటున్నారు అధికారులు. అలాగే ముఖ్యంగా బలమైన స్థానిక సంబంధాలు ఉన్న అభ్యర్థుల ఎంపిక కూడా అధిక ఓటింగ్‌కు కారణమని భావిస్తున్నారు. మహిళలు యువ ఓటర్ల బలమైన భాగస్వామ్యం కీలక ఫలితాలను నిర్ణయించడంలో కీలకమైనదని, ఇదే రాబోయేప్రభుత్వ విధాన ప్రాధాన్యతలను రూపొందిస్తుందని విశ్లేషకులు సూచిస్తున్నారు. ముఖ్యంగా 'దశజారీ' ముఖ్యమంత్రి మహిళా రోజ్‌గర్ యోజన పథకం ప్రకటించిన తర్వాత మహిళలు భారీ సంఖ్యలో ఓటు వేశారు. వివిధ ప్రాంతాలలో పురుషుల కంటే మహిళల ఓటింగ్ శాతం ఎక్కువగా నమోదైంది. పురుషుల కంటే 5 లక్షల మంది మహిళలు ఓటు వేయడంరికార్డు స్థాయిలో ఓటింగ్‌కు దారితీసింది. మహిళా రోజ్‌గార్ యోజన కింద 1.4 కోట్ల మహిళలకు రూ. 10,000 నగదు, ఉచిత సైకిల్ పథకం, పంచాయతీల్లో 50శాతం రిజర్వేషన్, ప్రభుత్వ ఉద్యోగాల్లో 35శాతం రిజర్వేషన్, ఉచిత విద్యుత్ లాంటి వాటితోపాటు, మహిళా సంక్షేమ పథకాల కింద రూ. 2 లక్షల సాయం లాంటి హామీలు భారీ ప్రభావాన్ని చూపాయని అంచనా. అలాగే కుల సమీకరణాల్లో ఎన్డీయే ఆధిపత్యాన్ని చాటుకుంది. అగ్ర కులాలలో 10శాతం కుష్వాహాలలో 4శాతంకంటే ఎక్కువ, పాశ్వాన్లలో 5శాతం కంటే ఎక్కువ, ముసాహర్లలో 3శాతం కంటే ఎక్కువ, మల్లాలలో 2.6శాతం వంటి విభిన్న వర్గాల మద్దతును కూడగట్టింది.

**ఎస్ఐఆర్ వివాదం:**స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఓటర్ల జాబితాలపై గందరగోళం, సామూహిక తొలగింపు ఆరోపణలు ఉన్నప్పటికీ, చాలా ప్రాంతాలలో రికార్డు స్థాయిలో పోలింగ్ శాతం, సజావుగా జరిగిన ఓటింగ్ ఈ ప్రభావ పెద్దగా లేదని తెలిపింది. అలాగు కేంద్రం బిహార్‌కు కేటాయించిన 1.62 లక్షల కోట్ల అభివృద్ధి ప్యాకేజీలు, ఎక్స్‌ప్రెస్‌వేలు, మౌలిక సదుపాయాల మెరుగుదల లాంటివాటిని బాగా ప్రచారంలో పెట్టుకోవడంతో ఇది బాగా కలిసి వచ్చింది.

**'మోదీ హనుమాన్' చిరాగ్:**చిరాగ్ పాశ్వాన్ నేతృత్వంలోని రామ్ విలాస్ పార్టీ 2025 బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో పెద్ద సంచలనంగా చెప్పవచ్చు. 2020లో కేవలం ఒక సీటు మాత్రమే గెలుచుకుని ఒకప్పుడు రద్దైన ఆపార్టీ, అనూహ్యంగా ఈఎన్నికల్లో పుంజుకుంది. ప్రస్తుత ట్రెండ్స్ ప్రకారం 22 సీట్లలో ఆధిక్యంలో ఉంది.

**మోదీ మ్యాజిక్:**పధానమంత్రి నరేంద్ర మోదీ చార్మ్, చాణక్యం అప్రతిహతంగా కొనసాగుతోంది. అసాధారణమైన 2024 లోక్‌సభ ఎన్నికలు మొదలు హర్యానా, మహారాష్ట్ర, ఢిల్లీలను కైవసం చేసుకునే మోదీ హవా ప్రత్యేకంగా నిలుస్తోంది. ఇపుడు బిహార్ మరో ప్రధాన విజయంగా మారనుంది.

**నితీశ్ రాజకీయాలు:**సంక్షేమం ఈ ఎన్నికలను నిర్వచించింది. ఓటర్లు తాజా వాగ్దానాల కంటే వారు ఇప్పటికే అనుభవించిన పథకాలను -రుణ బదిలీలు, పెన్షన్లు, మహిళా కేంద్రీకృత మద్దతు లాంటి పథకాలు వారిని మెప్పించాయి. సంక్షేమ విశ్వసనీయత, స్థిరమైన ప్రభుత్వంగా నితీష్ ప్రభుత్వాన్ని విశ్వసించడంతో ప్రభుత్వ వ్యతిరేకత బలహీనపడి, విజయభేరీ దిశగా నడిపించింది. 2025 బీహార్ అసెంబ్లీ ఎన్నికలు ముఖ్యమంత్రి నితీష్ కుమార్‌కు ఒక విధంగా లిట్మస్ పరీక్ష. అయితే, గత 20 సంవత్సరాలుగా ప్రతి బిహార్ ఎన్నికలలోనూ నితీష్ కుమార్ శాశ్వత ప్రజాదరణ స్పష్టమైన అభివృద్ధి ,సమ్మిళిత వృద్ధిపై ఆయన దృష్టి ఫలించింది. నితీష్ పాలనా శైలి రెండు దశాబ్దాలకు పైగా అధికారాన్ని నిలబెట్టుకోవడానికి సహాయపడింది. అభివృద్ధి, కలుపుగోలుతనం ఆయనను బీహార్ రాజకీయాల్లో ఒక బలీయమైన శక్తిగా మార్చింది.

# ఫీనిక్స్‌లా పుంజుకుని..

## అంధకారం నుంచి 'చిరాగ్' వెలుగులు!



**పాట్నా:**బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి భారీ విజయం దాదాపు ఖాయం. ఇక్కడ ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నితీష్ కుమార్‌ల గురించి ప్రత్యేకంగా చెప్పుకుంటూనే మరో యువనేత చిరాగ్ పాశ్వాన్ గురించి కూడా ప్రస్తావించాల్సిన అవసరం ఉంది. ఈ ఎన్నికల్లో చిరాగ్ పార్టీ లోక్ జనశక్తి హవా మామూలుగా లేదు, రాబోయే కాలమంతా చిరాగ్‌దే అన్నంతంగా చాటి చెప్పాయి ఈ ఎన్నికలు. ఈ ఎన్నికల్లో 29 సీట్లను పట్టుబట్టి తీసుకున్న ఆయన.. ఏకంగా 21 సీట్లలో గెలుపు దిశగా పయనిస్తున్నారు. తండ్రి రామ్ విలాస్ పాశ్వాన్‌కు తగ్గ తనయుడిగా తనదైన ముద్రను వేశారు చిరాగ్ పాశ్వాన్. గతేడాది జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఐదు స్థానాల్లో పోటీ చేసి అన్నింటిలోనూ విజయం సాధించిన చిరాగ్ పాశ్వాన్.. ఇప్పుడు అసెంబ్లీ ఎన్నికల్లో సైతం తన పార్టీ ప్రభావం ఏమిటో చెప్పకనే చెప్పేశారు. చిరాగ్ పాశ్వాన్ తిరిగి పుంజుకున? తీరు ఫీనిక్స్ పక్షిని గుర్తు చేస్తుంది. 2020 అసెంబ్లీ ఎన్నికల సమయంలో చిరాగ్ పాశ్వాన్ రాజకీయ భవిష్యత్ అంతా గందరగోళమే. జేడీయూ అధినేత నితీష్ కుమార్‌తో విభేదాల వల్ల ఆ సమయంలో ఒంటరిగానే పోటీకి సిద్ధమయ్యారు. 130కి పైగా స్థానాల్లో పోటీ చేసిన చిరాగ్.. కేవలం ఒక్క సీటును మాత్రమే సాధించారు. దాంతో ఆయన రాజకీయ అంధకారంగా కనిపించింది. అదే సమయంలో చిరాగ్ అవమానాలను సైతం ఎదుర్కొన్నాడు. ఆపై 2021లో సొంత బాబాయ్ పశుపతి కుమార్ పారస్ పార్టీని చీల్చి, రామ్ విలాస్ పాశ్వాన్ వారసత్వం కోసం పోటీపడ్డారు. అప్పుడు చిరాగ్ రాజకీయ భవిష్యత్ అంతా అంధకారంగానే కనిపించింది. బిహార్ రాజకీయాల్లో ఓ శక్తిగా వెలిగిన రామ్ విలాస్ పాశ్వాన్ వారసత్వాన్ని అందిపుచ్చుకునే లక్షణాలు చిరాగ్‌లో లేవనే విమర్శలు వినిపించాయి. తండ్రిలో ఉన్న చరిష్మా చిరాగ్‌లో లేదని విమర్శకులు అభిప్రాయపడ్డారు. అయితే ఐదేళ్ల వ్యవధిలోనే ఎంతలా పుంజుకున్నారో తాజాగా ఆయన తన అభ్యర్థులను ముందువరుసలో నిలిపిన తీరే ప్రస్తుతం మనకు కనిపిస్తోంది. లోక్‌సభ ఎన్నికల్లో వంద శాతం స్ట్రైక్‌రేట్ సాధించిన చిరాగ్.. ఇప్పుడు కూడా అదే జోరుతో ముందుకు సాగుతున్నారు. చిరాగ్ అంటే కాగడా అని అర్థం.. ఇప్పుడు బిహార్ ఎన్నికల ఫలితాల్లో ఆయన ఎన్డీఏ కూటమిలో కాగడా మాదిరి మారి మరింత వెలుగు నింపారు. అదే సమయంలో ఆయన రాజకీయ జీవితాన్ని అంధకారం నుంచి ఆకాశమంత వెలుగుల వరకూ తీసుకెళ్లడంలో సక్సెస్ అయ్యారు చిరాగ్. ఇక బిహార్‌లో అంతా చిరాగ్ శకమే అన్నంత గ్రాండ్ రీఎంట్రీ ఇచ్చారాయన.

# ట్రంప్ కు సారీ చెప్పిన బీబీసీ..

## పరిహారం మాత్రం ఇవ్వమని వెల్లడి..

న్యూయార్క్:బీబీసీ ,అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు క్షమాపణలు తెలిపింది. క్యాపిటల్ హిల్స్ పై దాడి జరిగిన సందర్భంలో ట్రంప్ చేసిన ప్రసంగాన్ని వక్రీకరించినట్లు అంగీకరించింది. అందుకు క్షమాపణలు కోరుతూ బీబీసీ ఛైర్మన్ వైట్ హౌస్‌కు లేఖ పంపారు. అయితే ట్రంప్ పరువునష్టం దావా వేసిన ఒక బిలియన్ డాలర్ల పరిహారాన్ని ఇవ్వడానికి మాత్రం బీబీసీ అంగీకరించలేదు. 2021లో క్యాపిటల్ హిల్ పై ట్రంప్ మద్దతు దారులు దాడి చేశారు. ఆ సమయంలో ట్రంప్ చేసిన ప్రసంగాన్ని మరో అర్థం వచ్చేలా ఎడిట్ చేసి బీబీసీ ప్రసారం చేసింది. అయితే తనపై తప్పుడు ప్రసారం చేసినందుకు గానూ బిలియన్ డాలర్ల పరిహారం చెల్లించాలని ట్రంప్ బీబీసీకీ లేఖ పంపారు. దానికి శుక్రవారం డెడ్ లైన్ విధించారు. దీంతో బీబీసీ ఛైర్మన్ సమీర్ షా క్షమాపణలు కోరుతూ వైట్ హౌస్ కు లేఖ పంపారు. ట్రంప్ ప్రసంగం చేసిన వీడియో క్లిప్‌ను సవరించినందుకు తీవ్రంగా విచారిస్తున్నామని తెలిపారు.

# బీహార్‌లో మళ్లీ ఎన్డీయేనే..

ప్రేమ్ కుమార్, బిజేంద్ర ప్రసాద్ యాదవ్ తదితర కీలక నేతలు గెలుపొందారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి 125 సీట్లు సాధించింది. ఇందులో భాజపా (74), జేడీయూ (43), వీఐపీ (04), హెచ్ఏఎం (04) స్థానాల్లో గెలుపొందాయి. ఈసారి నీతీశ్ కుమార్ పార్టీ భారీగా పుంజుకుంది. 2020 ఎన్నికలతో పోలిస్తే దాదాపు రెట్టింపు సీట్లలో (85) విజయం సాధించడం గమనార్హం. కాషాయ పార్టీ సైతం 15 సీట్లు అదనంగా తన ఖాతాలో వేసుకుంది. మరోవైపు, ప్రతిపక్ష మహాగట్‌బంధన్ ఘోర ఓటమిని చవిచూసింది. 2020 ఎన్నికల్లో 110 స్థానాల్లో విజయం సాధించగా.. ఈసారి 35 సీట్లకే పరిమితమైంది. ఆర్జేడీ 2020 ఎన్నికల్లో 75 సీట్లు సాధించగా.. ఈసారి 25 స్థానాల్లోనే గెలిచింది. ఏకంగా 50 సీట్లు కోల్పోయింది. కాంగ్రెస్ 19 నుంచి ప్రస్తుతం ఆరు స్థానాలకే పరిమితమైంది. రాష్ట్ర ఎన్నికలకు సంబంధించి పార్టీ చరిత్రలోనే ఇది రెండో పేలవ ప్రదర్శన. 2010లో హస్తం పార్టీకి నాలుగు సీట్లే వచ్చాయి. వామపక్షాలు కూడా ఈసారి మూడు స్థానాలే దక్కించుకున్నాయి.



# ప్రపంచంలో పవర్‌ఫుల్ మిలిటరీ దేశాలు

## 2025 గ్లోబల్ ఫైర్ పవర్ ర్యాంకింగ్స్

**న్యూయార్క్:**ప్రపంచవ్యాప్తంగా కొన్ని దేశాల మధ్య ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో అత్యంత శక్తివంతమైన సైనిక దళాల తాజా ర్యాంకింగ్స్‌ను గ్లోబల్ ఫైర్ పవర్ వెల్లడించింది. ఈ ర్యాంకింగ్స్‌లో యునైటెడ్ స్టేట్స్ అగ్రస్థానంలో ఉండగా, భారత్ సైనిక బలం పరంగా ప్రపంచంలో నాలుగో స్థానంలో నిలిచింది. నివేదికల ప్రకారం గ్లోబల్ ఫైర్ పవర్ ఈ సంవత్సరం 145 దేశాల సాయుధ దళాలను వారి వనరులు, యుద్ధ పరికరాల ఆధారంగా అంచనా వేసింది. దళాల బలం, ఆర్థిక స్థితి, వనరులతో సహా 60కి పైగా ప్రమాణాలను లెక్కించి, ఆయా దేశాల మిలిటరీలను పోల్చి ర్యాంకింగ్‌ను కేటాయించింది. ఈ ర్యాంకింగ్‌లో దేశాల అణు సామర్థ్యాలను కూడా పరిగణనలోకి తీసుకున్నారు.



టాప్ 10 అత్యంత శక్తివంతమైన మిలిటరీ దేశాలు

1. యునైటెడ్ స్టేట్స్
పవర్ ఇండెక్స్ స్కోరు: 0.0744
ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన సైన్యంగా ర్యాంక్ పొందింది. 2024 లో 873 బిలియన్ డాలర్లు దాటిన ప్రపంచంలోనే అతిపెద్ద రక్షణ బడ్జెట్‌ను కలిగి ఉంది.

2. రష్యా-2వ స్థానం:
పవర్ ఇండెక్స్ స్కోరు: 0.0788
విస్తారమైన అణ్వాయుధాలు కలిగి ఉంది. విమానాలు, హెలికాప్టర్లు, ట్యాంకుల పరంగా ఇది రెండో స్థానంలో ఉంది.

3. చైనా: 3వ స్థానం
పవర్ ఇండెక్స్ స్కోరు: 0.0788
పవర్ ఇండెక్స్‌లో రష్యాకు సమానంగా ఉంది.

4. భారతదేశం: 4వ స్థానం
పవర్ ఇండెక్స్ స్కోరు: 0.1184
సైనిక బలం పరంగా ప్రపంచవ్యాప్తంగా నాలుగో స్థానంలో ఉంది.

5. దక్షిణ కొరియా: 5వ స్థానం
పవర్ ఇండెక్స్ స్కోరు: 0.1656

6. యునైటెడ్ కింగ్‌డమ్ :6వ స్థానం
పవర్ ఇండెక్స్ స్కోరు: 0.1785

7. ఫ్రాన్స్: 7వ స్థానం
పవర్ ఇండెక్స్ స్కోరు: 0.1878

8. జపాన్: 8వ స్థానం
పవర్ ఇండెక్స్ స్కోరు: 0.1839

9. టర్కీ: 9వ స్థానం
పవర్ ఇండెక్స్ స్కోరు: 0.1902
ఫ్రిగేట్ నౌకాదళాలు, హెలికాప్టర్లు, నావికాదళ కార్వెట్లు, జలాంతర్గాములు వంటివి అధికంగా ఉన్నాయి.

10. ఇటలీ: 10వ స్థానం
పవర్ ఇండెక్స్ స్కోరు: 0.2164

# రాజన్న ఆలయం చుట్టు అష్ట దిగ్బంధం



- ఆలయంలో ఏమి జరుగుతుందో రాజన్నకే ఎరుక..
- అభివృద్ధి పనుల వార్తా కవరేజ్‌కి మీడియాకు నో ఎంట్రీ..
- లోనికి వెళ్లకుండా పోలీసుల పహారా..

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి నవంబర్ 14 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్రంలో అతిపెద్ద శైవ క్షేత్రమయినా వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయం అభివృద్ధి చెందాలనేది ప్రతి ఒక్కరి ఆకాంక్ష.ఇన్నేండ్లకు రాజన్న ఆలయ అభివృద్ధి విస్తరణ జరుగుతుండడాని ప్రతి ఒక్కరు స్వాగతిస్తున్నారు. అయితే అధికారుల అత్యుత్సాహం, వివాదాస్పద నిర్ణయాలు వివాదాలకు దారితీస్తుంది. ఆలయంలో జరిగే అభివృద్ధి పనులకు సంబంధించే వార్తలను భక్తులకు,ప్రజలకు తెలియజేసే విధంగా మీడియాలో వార్తా కథనాలు ప్రచురితం అవుతున్నాయి.అయితే వార్తా కవరేజ్ కి ఆలయంల్లోకి వెళ్లకుండా ఆలయ అధికారులు అష్టదిగ్బంధం చేయడంతో విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. అసలు ఆలయంలో ఏం జరుగుతుందో అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**ఆలయ అభివృద్ధిపై అది ప్రత్యేక దృష్టి..**

వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ విస్తరణ అభివృద్ధిపై ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ ప్రత్యేక దృష్టి సారించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన అనంతరం ప్రజా ప్రభుత్వం గతంలో ఎన్నడూ లేని విధంగా బడ్జెట్లో రూ150 కోట్లను కేటాయించడంతో పాటు మొదటి దశ పనుల కోసం రూ 76 కోట్లకు పైగా నిధులతో పనులను సియం రేవంత్ రెడ్డి గత కొన్ని రోజుల క్రితం ప్రారంభించారు. అభివృద్ధిలో బాగాంగా ఇప్పటికే ఈవో



కార్యాలయం,కల్యాణ కట్ట, కళా భవన్,ప్రాకారాలు, ఆలయంలో రేకుల షెడ్లు తొలగించారు.రాజన్న ఆలయానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా రాజగోపురం ముందు భాగంలో ప్రచార రథం ఏర్పాటు చేసి భక్తులకు స్వామివారి దర్శన సౌకర్యం కల్పిస్తున్నారు.ఎల్ఈడీ స్క్రీన్ ద్వారా స్వామివారి దర్శన సౌకర్యం కల్పిస్తున్నారు.భక్తులు తమ మొక్కుబడులు చెల్లించుకునెందుకు భీమేశ్వరాలయంలో అభిషేకాలు,అన్నపూజలు, కళ్యాణం, కోడె మొక్కులు, సత్యనారాయణ స్వామి వ్రతాలు, కుంకుమార్చన ఇతర పూజలకు అవకాశం కల్పిస్తూ ఏర్పాటు చేశారు. మరోవైపు రాజన్న ఆలయంలో యధావిధిగా స్వామివారికి ప్రతిరోజు 4 సార్లు నిత్య పూజలు కైంకర్యాలు అర్చకులు ఏకాంతంగా నిర్వహిస్తున్నారు.ఇప్పటి వరకు బాగానే ఉన్న ఆలయ అధికారుల అత్యుత్సాహం పలు వివాదాలకు దారితీస్తుంది.

**అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లే మీడియాకు నో ఎంట్రీ..**

వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ విస్తరణ అభివృద్ధి కార్యక్రమాలను నిరంతరం ఎప్పటికప్పుడు ప్రజలకు, భక్తులకు చేరవేసే మీడియాకు ఆలయ పరిసరాల్లోకి నో ఎంట్రీ అంటూ ఆలయ అధికారులు అతి ఉత్సహం చూపడం పలు విమర్శలకు తావిస్తోంది.

ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనుల పరిసర ప్రాంతాలు కవరేజ్ చేయడానికి వెళ్లిన మీడియా ప్రతినిధులను పోలీసుల ద్వారా వెనక్కి పంపించడం వివాదానికి దారి తీసింది. దీంతో జర్నలిస్టు సంఘాల నాయకులు రమాదేవి వద్ద నిరసన వ్యక్తం చేయడంతో మరోసారి ఇలాంటి సంఘటన చోటు చేసుకోకుండా చూస్తానని హామీ ఇచ్చారు. అసలు రాజన్న ఆలయంలో ఏం జరుగుతుందోనని అందుకే మీడియా ప్రతినిధులను కూడా కవరేజ్ కి వెళ్ళనీయడం లేదని అనుమానాలను పలువురు భక్తులు వ్యక్తం చేస్తున్నారు. ఆలయ అభివృద్ధికి సంబంధించి లోపల ఉన్న దర్గాను తొలగించిన తర్వాతే కోటి లింగాలను తొలగించాలని ఇప్పటికే బీజేపీ, విశ్వహిందూ పరిషత్ నాయకులు డిమాండ్ చేస్తున్నారు.ఇలాంటి సమయంలో మీడియాను అనుమతించకపోవడం మరింత అనుమానాలకు తావిస్తోందని ప్రజలు చర్చించుకుంటున్నారు.

# 'జోష్‌గా.. ఉషారుగా'



- అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్‌లో బాలల దినోత్సవ సంబరం
- అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా.వి.నరేందర్ రెడ్డి

**కరీంనగర్, నవంబర్ 14 (జనంసాక్షి) :** బాలల దినోత్సవ వేడుకలకు మన భారతదేశంలో ప్రత్యేకత ఉన్నదని, యావత్ భారతదేశం చాలా గొప్పగా నిర్వహిస్తుందని భారతదేశ తొలి ప్రధానమంత్రి జవహర్లాల్ నెహ్రూ సేవలు చాలా విశిష్టమైనమని, భారతదేశ కీర్తిని మన దేశాలకు వ్యాపింప చేశారని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా. వి.నరేందర్ రెడ్డి స్థానిక కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో బాలల దినోత్సవం పురస్కరించుకొని ఏర్పాటు చేసినటువంటి ప్రత్యేక సంబరాల ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరై వారు మాట్లాడారు. ప్రారంభానికి ముందు వారు ప్రాంగణంలో ఏర్పాటు చేసినటువంటి పండిట్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా పుష్పాంజలి ఘటించి వారు చేసిన సేవలను కొనియాడుతూ ప్రతి ఒక్కరు నెహ్రూ మార్గదర్శకాలను పాటిస్తూ వారు ఏర్పరచుకున్నటువంటి లక్ష్యాలను సాధించాలని చెప్పారు. విద్యార్థుల్లో దాగిన ప్రతిభను వెలికితీయటంలో అల్ఫోర్స్ అగ్రగామిగా ఉంటుందని ఆ పరంపరను కొనసాగిస్తున్నదని హర్షం వ్యక్తం చేస్తూ ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం బాలల దినోత్సవ వేడుకలను చాలా గొప్పగా నిర్వహించడం జరిగిందని వారు చెప్పారు. పిల్లల మాట – బంగారు బాట, పిల్లలు దేవుళ్ళు – చల్లని వారు నృత్యాలు ఆకర్షింపచేశాయని, వేడుకలను పరిష్కరించుకొని పలువురు విద్యార్థులు పండిట్ నెహ్రు వేషధారణలో విచ్చేసి తోటి విద్యార్థులకు వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# లక్ష్యసాధనకు కఠోరంగా శ్రమించాలి

- ధ్యాస అంతా చదువుపైనే కేంద్రీకరించాలి
- బాలల దినోత్సవ వేడుకల్లో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి



**కరీంనగర్ జిల్లా బ్యూరో, నవంబర్ 14 (జనంసాక్షి):** విద్యార్థులు ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని దాన్ని సాధించేందుకు నిత్యం కఠోరంగా శ్రమించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పిలుపునిచ్చారు. బాల బాలికలు నిత్యం చదువుపైనే ధ్యాస పెట్టాలనీ, అనవసర విషయాలను పట్టించుకోవద్దనీ సూచించారు. కరీంనగర్ కలెక్టరేట్ ఆడిటోరియంలో మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్, మాజీ ప్రధాని స్వర్గీయ జవహర్లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బాలల దినోత్సవ వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... విద్యార్థులు చదువుపై ఇంట్రెస్ట్ చూపాలని బాధ్యతయుతంగా క్రమశిక్షణతో చదువుతూ మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. లక్ష్యాన్ని సాధించేవరకు పట్టుదలతో ముందుకెళ్లాలని పేర్కొన్నారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే మాట్లాడుతూ... చిన్నారులు ఎంజాయ్ చేస్తూ చదువుపై దృష్టి పెట్టాలని సూచించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల నమ్మకాన్ని మమ్ము చేయకుండా మంచి పేరు తీసుకురావాలని కోరారు. అత్యుత్తమ ఫలితాలను సాధించాలని సూచించారు. ఈ వేడుకల్లో బాలభవన్ బాలసాధనం కేజీబీవీ సంక్షేమ ట్రస్ట్ విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ఎంతో ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు కలెక్టర్, పోలీస్ కమిషనర్, జడ్జ్, టీచరు, రైతు, డాక్టరు, అడ్వకేట్ వృత్తి నిర్వహించి ప్రజలకు వారు ఏ విధంగా సేవలందిస్తారో అవగాహన కల్పించారు. అద్భుతమైన ప్రతిభ కనబరిచి ఆహుతులను ఆకట్టుకున్నారు. ఇందులో ప్రతిభ చూపిన విద్యార్థులకు జిల్లా కలెక్టర్ ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, జిల్లా సంక్షేమ అధికారి సబిత, సి డబ్ల్యూ సి చైర్ పర్సన్ ధనలక్ష్మి, జెసిబిఓ కృపారాణి, డిసి పిఓ పర్వీన్, 1098 జిల్లా కోఆర్డినేటర్ ఆవుల సంపత్, సిడిపివోలు, పలువురు అధికారులు, విద్యార్థిని విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల లిస్టు విడుదల చేయాలి

- మంథని ఆర్డీవో కు మెమొరండం ఇచ్చిన బీజేపీ నాయకులు



**మంథని, (జనంసాక్షి) :** బీజేపీ పార్టీ మాజీ జిల్లా అధ్యక్షుడు చంద్రుపట్ల సునీల్ రెడ్డి ఆదేశాల మేరకు మంథని మండలంలోని అన్ని గ్రామాలలో ఇందిరమ్మ ఇండ్ల అర్హులైన లబ్ధిదారుల లిస్ట్ వెంటనే విడుదల చేయాలని ఆర్డిఓ శుక్రవారం బిజెపి మండల పట్టణ నాయకులు వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా మంథని మండల బీజేపీ అధ్యక్షుడు వీరబోయిన రాజేందర్ మాట్లాడుతూ.. మంథని మండలంలోని 34 గ్రామపంచాయతీలలో కేవలం ఒకే గ్రామపంచాయతీలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం మొదలుపెట్టి మిగతా 33 గ్రామపంచాయతీలలో ఒక్క గ్రామంలోనైనా ఇందిరమ్మ ఇండ్లకు ఇప్పటి వరకు ఎందుకు ముగ్గులు పోయలేదని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. గ్రామాలలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక కాగితాలకి పరిమితమైందని ఇప్పటికైనా మంత్రి శ్రీధర్ బాబు, కాంగ్రెస్ ప్రభుత్వం మంథని మండలంలోని ప్రతి గ్రామపంచాయతీలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక చేసి నిరుపేదలకు ఇందిరమ్మ నిర్మాణం చేసుకునే అవకాశం కల్పించి వాళ్లకు వెంటనే ప్రొసీడింగ్స్ మంజూరు చేసి ఇండ్ల నిర్మాణాలకు వెంటనే ముగ్గులు పోయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షుడు విరబోయిన రాజేందర్, పట్టణ అధ్యక్షుడు సబ్బని సంతోష్, నియోజకవర్గ కో కన్వీనర్ నాంపల్లి రమేష్, జిల్లా కౌన్సిల్ మెంబర్ తోట మధుకర్, మండల ఓబీసీ మోర్చా అధ్యక్షుడు రేపాక శంకర్, కిసాన్ మోర్చా అధ్యక్షుడు ఎల్కా సాధానందం, ఎస్సీ మోర్చా అధ్యక్షుడు కరెంగుల రాజశేఖర్, పట్టణ ప్రధాన కార్యదర్శి సామల అశోక్, ఎడ్ల సాగర్, జిల్లా సీనియర్ నాయకులు నార్మల కృష్ణ, బూడిద తిరుపతి, గురువేష్,బూత్ అధ్యక్షుడు బోసిల్లి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# గంజాయి ముఠా గుట్టు రట్టు

- గంజాయి అమ్ముతున్న ముగ్గురు వ్యక్తులను పట్టుకున్న కరీంనగర్ రూరల్ పోలీసులు



**కరీంనగర్ జిల్లా బ్యూరో, నవంబర్ 14 (జనంసాక్షి):** శుక్రవారం రోజు కరీంనగర్ రూరల్ పోలీసు స్టేషన్ సీఐ ఎ.నిరంజన్ రెడ్డి ఆదేశానుసారం ఎస్ఐ లక్ష్మా రెడ్డి, తన కానిస్టేబుల్, మహిళ సిబ్బంది తో కలిసి గంజాయి ముఠాను పట్టుకున్నారు. పోలీసులు గుంటూరుపల్లి , బొమ్మకల్ ప్రాంతంలో వెహికల్ చెకింగ్ చేస్తుండగా ముగ్గురు వ్యక్తులు దుర్శేడ్ గ్రామానికి చెందిన నేరెళ్ల చరణ్ (తండ్రి రాజు), గోపాల్ పూర్ గ్రామానికి చెందిన బెజ్జంకి లోకేష్ (తండ్రి శ్రీనివాస్), మైనర్ బాలుడు కలిసి గంజాయితో తమ యమహా మోటార్ సైకిల్ పై వస్తూ పోలీస్ వారిని చూసి పారిపోయే ప్రయత్నం చేయగా వారిని పట్టుకొని తనిఖీ చేయగా వారి మోటార్ సైకిల్ పై ఉన్న కవర్లో గంజాయి లభించింది. ఆ తరువాత విచారణ చేయగా పై ముగ్గురు వ్యక్తులు పరిచయస్తులు, స్నేహితులకు అమ్ముతూ అదే క్రమములో వారి అవసరాలను తీర్చుకొనుటకు గంజాయి ని మరో వ్యక్తి నుండి కొనుకొని వచ్చి కరీంనగర్ లోని చుట్టూ ప్రక్కల ప్రాంతాలలో అమ్ముతూ గత కొంత లాభాలు పొందుతున్నారు. ఇదే క్రమములో ముగ్గురు వ్యక్తులు మరో వ్యక్తి వద్ద గంజాయిని కొనుగోలు చేసి కొంత అధిక లాభాలకు అమ్మినారు. మరికొంత శుక్రవారం రోజు అమ్ముటకు వెళుతుండగా పోలీస్ వారు పట్టుకోవడం జరిగింది. వారి వద్ద నుండి గంజాయి 260 గ్రాములు, ఒక యమహా మోటార్ సైకిల్, కొంత నగదు, సెల్ ఫోన్స్ స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భముగా సీఐ ఎ.నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ... యువత చెడు అలవాటులకు బానిసలూ కావద్దని, జీవితాలను నష్టపరుచుకోవద్దని, ఎవరైనా గంజాయి అమ్ముతూ పట్టుబడితే వారిని జైలు కు పంపడం తో పాటు, వారిపై రౌడీ షీట్ ఓపెన్ చేసి, ఇంకా మారకపోతే వారిపై పిడిఆక్ట్ పెట్టుతామని హెంచరించారు. దొంగలను పట్టుకోవడంలో పాల్గొన్న ఎస్ఐ లక్ష్మారెడ్డిని, కానిస్టేబుళ్లను, మహిళా సిబ్బందిని, కరీంనగర్ రూరల్ ఎసిపి విజయకుమార్ అభినందించారు.

# సిసిఐ నిబంధనలు సడలించి పత్తి కొనుగోలు చేయాలి

- కిసాన్ కపాస్ యాప్ రిజిస్ట్రేషన్ ఉపసంహరించుకోవాలి..
- సిపిఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవ రెడ్డి..



**జమ్మికుంట, నవంబర్ 14 (జనం సాక్షి):** జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ ఆవరణంలో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సిసిఐ) పత్తి కొనుగోలు చేయాలని, సిసిఐ నిబంధనలు సడలించి పత్తి కొనుగోలు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవ రెడ్డి డిమాండ్ చేశారు.శుక్రవారం రోజున సిపిఎం పార్టీ ప్రతినిధి బృందం జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో పత్తి కొనుగోళ్ల తీరును పరిశీలించింది.అనంతరం వాసుదేవ రెడ్డి మాట్లాడుతూ ఈ వ్యవసాయ సీజన్లో ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాల మూలంగా పత్తి పంట పొలాల్లో వర్షం నీరు నిల్వ ఉండి మొక్కలు వేర్లు చచ్చు పడి, ఆకులు రాలి, కాయలు నల్లబారి పంట దిగుబడి మూడవ వంతుకి పడిపోయిందన్నారు. అరకోరగా రైతు చేతికి వచ్చిన పత్తి కూడా సిసిఐ కఠిన నిబంధనలు పెట్టి కొనుగోలు చేయడం లేదని అన్నారు.జమ్మికుంటలో నాలుగు సిసిఐ జిన్నింగ్ మిల్లులవద్ద కొనుగోలు కేంద్రాలు ప్రారంభం చేసి ఇరవై రోజుల దాటినా 300 క్వింటాళ్ల లోపు మాత్రమే కొనుగోలు చేశారన్నారు. జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ లో ప్రతి రోజు 8 నుంచి పన్నెండు వేల క్వింటాళ్ల పత్తి ప్రైవేటు ట్రెడర్స్ కొనుగోలు చేస్తున్న పరిస్థితి ఉందన్నారు.కేంద్ర ప్రభుత్వ సంస్థ కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సిసిఐ)కిసాన్ కపాస్ రిజిస్ట్రేషన్ తీసుకువచ్చి, కఠిన నిబంధనలు విధించి పత్తి రైతులను హరిగోశ పెడుతున్నారని అన్నారు. కిసాన్ కపాస్ రిజిస్ట్రేషన్ లో అనేక టెక్నికల్ సమస్యలు తలెత్తి అగచాట్లు పడుతున్నారన్నారు.

కిసాన్ కపాస్ యాప్ రిజిస్ట్రేషన్ ఉపసంహరించుకోవాలనీ డిమాండ్ చేశారు. తేమశాతం నిబంధనలు, ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఎకరాకు ఏడు క్వింటాళ్ల కొనుగోలు నిబంధన తొలగించి గతంలో లాగా 12 క్వింటాళ్లు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.నాణ్యత ప్రమాణాలు సడలించి కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర క్వింటాలకు రూ 8110 పత్తి రైతులకు అందించాలని కోరారు.తెలంగాణ రాష్ట్రంలో ఉన్న ఇద్దరు బిజెపి మంత్రులు కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి పత్తి రైతులపై పెట్టిన ఆంక్షలు, సడలించే విధంగా ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు.జిల్లాలో పత్తి రైతులకు పెద్ద ఎత్తున నష్టం వాటిల్లిందన్నారు.

పత్తి రైతుల సమస్యలు పరిష్కారం కోసం ఐక్య ఉద్యమ పోరాటాలే మార్గం అన్నారు. రైతాంగానికి అండగా ఉండి వారి సమస్యల పరిష్కారం కోసం అనునిత్యం పోరాడుతామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు, మండల కమిటీ సభ్యులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



## అంగన్వాడీ కేంద్రాల సేవలను

# సద్వినియోగం చేసుకోవాలి

- తల్లి పోషకాహారం తీసుకోవాలి
- కుటుంబంలోని అందరూ ఆరోగ్యంగా ఉంటారు
- ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్
- గంభీరావుపేట లో అంగన్వాడీ కేంద్రం ప్రారంభం

**గంభీరావుపేట, నవంబర్ 14 (జనం సాక్షి):** గర్భిణులు, బాలింతలు, పిల్లలు అంగన్వాడీ కేంద్రాలను వినియోగించుకోవాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపు ఇచ్చారు. గంభీరావుపేటలో రూ. 14 లక్షల నిధులతో నిర్మించిన అంగన్వాడీ కేంద్రాన్ని శుక్రవారం ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ప్రారంభించారు. అంగన్వాడిల్లో చదివే విద్యార్థులకు కుట్టించిన యూనిఫాంలను, పోషకాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడారు. ప్రతి చిన్నారికి సమీప అంగన్వాడీ కేంద్రాల్లో చదవాలని, కేంద్రాల్లో అందించే కోడి గుడ్లు, బాలామృతం, అన్నం ఇతర పోషకాహారాన్ని వారికి తినిపించాలని సూచించారు. ఆరోగ్యంగా ఉన్న పిల్లలు ఆటల్లో, చదువులో రాణిస్తారని వివరించారు.

పిల్లలు బడి బయట ఉండవద్దని, రోజూ అంగన్వాడీ కేంద్రాలకు రావాలని, చేతులు శుభ్రం చేసుకోవాలని, తినాలని, ఆడుకోవాలని సూచించారు. పోషకాహార లోపం ఉన్న పిల్లలను గుర్తించి, అంగన్వాడిలో మూడు నెలలపాటు పోషకాహారం ఇవ్వాలని ఆదేశించారు. గర్భిణులు, బాలింతలు మునగ ఆకు, నువ్వులు, ఇతర కూరగాయలు, కోడి గుడ్లు, పాలు ఆహారంలో భాగం చేసుకుంటే మందులు అవసరం ఉండదని స్పష్టం చేశారు. ప్రతి ఇంట్లో మహిళలు పోషకాహారం తీసుకోవాలని, వారు ఆరోగ్యంగా ఉంటే కుటుంబం అంతా బాగుంటుందని తెలిపారు.

**ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన**

గంభీరావుపేటలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ పరిశీలించారు. ధాన్యం నిల్వలు పరిశీలించి, రైతులతో మాట్లాడారు. ఇప్పటిదాకా ఎన్ని క్వింటాళ్ల ధాన్యం రైస్ మిల్లులకు తరలించారో అధికారులతో ఆరా తీశారు.కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం, తహసీల్దార్ మారుతి రెడ్డి, ఎంపీడీఓ రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

**CHANGE OF NAME AND DATE OF BIRTH**

I,RAJENDAR NAIK , D.O.B:01/01/2011 R/OH.NO:3-66,MEDICHETTUTHANDA(V), CHOWDARPALLE(POST) M)BOMRASPET,D)VIKARABAD,TELANGANA STATE ,PIN:509350,CHENGED MY NAME AND DATE OF BIRTH AS FOR STUDY BONAFIDE CERTIFICATE RATHOD RAJESH S/O RATHOD SURYA NAIK,D.O.B:28/03/2012.

## "యశోద హాస్పిటల్‌లో "

# ప్రోస్టేట్ గ్రంథి సమస్యకు అధునాతన చికిత్స

### ప్రముఖ యురాలజిస్ట్ డా. అమాన్ చంద్ర దేశ్పాండే



**కరీంనగర్ జిల్లా బ్యూరో, నవంబర్ 14 (జనంసాక్షి):** ప్రోస్టేట్ గ్రంథి సమస్యకు అధునాతన చికిత్స అందుబాటులో ఉందని త్వరగా గుర్తిస్తే ఎలాంటి ఇబ్బంది ఉండదని ప్రముఖ యురాలజిస్ట్ డా.అమన్ చంద్ర దేశాపాండే అన్నారు.కరీంనగర్లోని యశోద ఆస్పత్రిలో శుక్రవారం ఈ వ్యాధిపై అవగాహన కల్పించారు. పురుషులలో వయసు పెరిగే కొద్దీ ప్రోస్టేట్ గ్రంథి అనే చిన్న సమస్య పెద్దదవుతుందని దీనికి సోమాజిగూడ ఆస్పత్రిలో ఆధునిక పరిజ్ఞానంతో కూడిన చికిత్స ఉందన్నారు. తరుచుగా మూత్రం రావడంతో పాటు హార్మోన్ మార్పులు డైహైడ్రో టెస్టోస్టిరాన్ అనే హార్మోన్ ప్రభావం వల్ల ప్రోస్టేట్ కణాలు పెరుగుతాయన్నారు. ఈ సమస్యకు మొదటి దశలో మందులతో నయం చేయవచ్చని, ప్రబావం పెరిగితే ఎలాంటి కోతలు లెకుండా ఆధునిక చికిత్సతో సమస్యను పరిష్కరించవచ్చన్నారు. ప్రోస్టేట్ గ్రంథిలో పెరిగిన అదనపు మాంసాన్ని ఎలక్ట్రిక్ విధానంతో తొలగించవచ్చని, ఫలితం బాగున ప్పటికి ఓ సందర్భంలో శస్త్ర చికిత్స అవసరమన్నారు. దీనిపై ప్రజల్లో అవగాహన కలిగితే ఎలాంటి సమస్యలు రావన్నారు. సోమాజిగూడ యశోద ఆస్పత్రిలో ఈ వ్యాధికి సంబందించి ప్రతి నెల 5, 6 కేసులు వస్తున్నాయని, వీటిని 100 శాతం పరిష్కరిస్తున్నామని డా.అమన్ చంద్ర దెశ్పాండే తెలిపారు.

## మంథని పీఏసీఎస్ ఆధ్వర్యంలో

# 9 వరి కొనుగోలు కేంద్రాల ప్రారంభం



**మంథని, (జనంసాక్షి):** మంథని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తొమ్మిది వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సింగిల్‌విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ శుక్రవారం ప్రారంభించారు. మండలం లోని సూరయ్యపల్లి, కాకర్లపల్లి, అక్కేపల్లి, పుట్టపాక, నగరంపల్లి, మహబూబ్‌పల్లి, లక్కెపూర్, గుమ్నూర్, గాజులపల్లి కేంద్రాలు ఇందులో ఉన్నాయి. ప్రజాప్రతినిధులు, నాయకులు, రైతులతో కలిసి ఆయన ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. సంఘ డైరెక్టర్లు ఆకుల రాజబాపు, కొత్త శ్రీనివాస్, దాసరి లక్ష్మి, దేవళ్ల విజయకుమార్, మేదరవేన ఓదెలు, మాజీ ఎంపీపీ కొండ శంకర్, ఏఎంసీ మాజీ చైర్మన్ ఆకుల కిరణ్, యూత్ అధ్యక్షులు సాదుల శ్రీకాంత్, నాయకులు భీముని వెంకటస్వామి, అరెల్లి కిరణ్, వరుణ్, మెండే రాజయ్య, రేపాక శ్రీనివాస్, మంథని రాకేష్, కృష్ణవంశీ, రామక్క, ఆర్ల వెంకన్న, తన్నీరు లక్ష్మణ్, అయిలి శ్రీనివాస్, పోరెడ్డి తిరుపతి రెడ్డి, రేపాక లక్ష్మణ్, కన్నూరి సుదర్శన్, పెయ్యాల రమేష్, పెయ్యాల గట్టయ్య, మబ్బు శంకర్, చాట్లపల్లి సంతోష్, హుస్సేన్ భీ, ఎడ్ల శ్రీనివాస్, ఆకుల సురేష్, చాట్లపల్లి రాజయ్య, గద్దల రాజయ్య, శ్రీనివాస్, బూడిద రాజయ్య తదితర నాయకులు, కార్యకర్తలు, రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# సింగిల్ విండో కార్యాలయంలో అటెండెన్స్ రిజిస్టర్ మాయం?

- చైర్మన్ కక్షతో సీఈవోకు ఇబ్బందులు
- కోర్టు ఆదేశాలు ధిక్కరిస్తూ జీతాల నిరాకరణ
- విచారణకు రెండు నెలలు.. అధికారుల నిర్లక్ష్యం
- కో-ఆపరేటివ్ అధికారుల కుమ్మక్కు ఆరోపణలు





**వనపర్తి బ్యూరో, నవంబర్ 14 జనంసాక్షి :** వనపర్తి జిల్లా కేంద్రంలోని నాగవరం సింగిల్‌విండో కార్యాలయంలో అటెండెన్స్ రిజిస్టర్ మాయమైందన్న ఆరోపణలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. సీఈవో కె.రవీందర్‌ను ఇబ్బందులకు గురిచేసేందుకు పీఏసీఎస్ చైర్మన్ మధుసూదన్ రెడ్డి కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సెప్టెంబర్ 6 నుంచి రిజిస్టర్ కనిపించకపోవడంతో రవీందర్ డీసీవో, రూరల్ పోలీస్ స్టేషన్, ఎస్పీ, మహబూబ్‌నగర్ డీసీసీబీ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో జిల్లా కో-ఆపరేటివ్ అధికారి రాణి ఆడిటర్ నరేంద్రను ఎంక్వైరీ అధికారిగా నియమించారు. అయితే ఈ నెల 4న సీఈవో లేని సమయంలో వచ్చిన ఆయన చైర్మన్, సిబ్బందితో సంతకాలు చేయించుకుని రిజిస్టర్ ఉన్నట్లు నివేదిక ఇచ్చారు. కానీ ఇప్పటికీ కార్యాలయంలో రిజిస్టర్ లేకపోవడంతో అయోమయం నెలకొంది. 2020 అక్టోబర్ 9న జీతభత్యాల అక్రమం ఆరోపణలపై చైర్మన్ ఫిర్యాదుతో రవీందర్‌ను సస్పెండ్ చేశారు. హైకోర్టు ఆదేశాలతో ఆరు నెలల్లోనే విధుల్లోకి తీసుకున్నా చెక్ పవర్ ఇవ్వకుండా, జీతాలు చెల్లించకుండా చైర్మన్ కక్ష సాధింపు చర్యలు చేపట్టారని ఆరోపణలు ఉన్నాయి. సెప్టెంబర్ 3, 2025న ఉమ్మడి జిల్లా బదిలీల్లో ముచ్చింతల సింగిల్‌విండోకు బదిలీ చేశారు. కానీ హైకోర్టు స్టే స్టేటస్‌కో ఆదేశాలతో నాగవరంలోనే కొనసాగుతున్నారు. ఖిల్లా ఘణపురం సింగిల్‌విండో స్టాఫ్ అసిస్టెంట్‌కు అర్హత లేకున్నా ప్రమోషన్ ఇచ్చి వనపర్తికి తీసుకొచ్చారని మరో ఫిర్యాదుతో కోర్టు మళ్లీ స్టే ఇచ్చింది. సస్పెన్షన్ కాలం, ప్రస్తుత విధుల కాలానికి మొత్తం జీతభత్యాలు చెల్లించాలని ఆదేశించింది. రిజిస్టర్‌ను దాచి 10-15 రోజులకు ఒకసారి సిబ్బందితో సంతకాలు చేయించి, తాను సంతకం పెట్టకపోతే విధులు నిర్వహించడం లేదని చూపి బదిలీకి మార్గం సుగమం చేసుకుంటున్నారని రవీందర్ ఆరోపించారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని ఇతర సీఈవోల మాదిరిగానే పాలకవర్గ తీర్మానం ప్రకారమే జీతం తీసుకున్నానని, అక్రమ ఆరోపణలు అవాస్తవమని ఆయన స్పష్టం చేశారు. జిల్లా కో-ఆపరేటివ్ అధికారులు చైర్మన్‌కు మద్దతుగా వ్యవహరిస్తున్నారని, విచారణను రెండు నెలలు సాగదీస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్టోబర్ 4న మరోసారి హైకోర్టు బదిలీ రద్దు చేస్తూ యథాస్థానంలో కొనసాగించి జీతాలు ఇవ్వాలని ఆదేశించింది. రిజిస్టర్‌ను తిరిగి కార్యాలయంలో ఉంచేలా చూడాలని, సస్పెన్షన్ కాలం జీతాలు చెల్లించాలని, చైర్మన్‌పై చర్యలు తీసుకోవాలని రవీందర్ డిమాండ్ చేశారు. ఈ విషయంపై జిల్లా అధికారులు, సిబ్బంది స్పందన కోరగా స్పష్టమైన సమాధానం ఇవ్వకుండా బుట్ట దాటవేశారు.

# వైద్య రంగంలో సాంకేతిక మార్పులకు కృషి

- ఎస్ఐఎస్ సాఫ్ట్వేర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ మెల్కియస్ మంగళం ఆంథోనీ
- ఘనంగా వార్షికోత్సవ వేడుకలు



**హైదరాబాద్, నవంబర్ 14 :** వైద్య రంగంలో సాంకేతిక మార్పులకు కృషి చేస్తున్నట్లు ఎస్ఐఎస్ సాఫ్ట్వేర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ మెల్కియస్ మంగళం ఆంథోనీ తెలిపారు. ఎస్ఐఎస్ సాఫ్ట్వేర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ (సర్జికల్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్ (ఎస్ఐఎస్)కు అనుబంధ సంస్థ తన 25వ వార్షికోత్సవ వేడుకలను అజీజ్‌నగర్‌లోని అయానా రిసార్ట్స్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య రంగంలో ఆవిష్కరణాత్మక సాఫ్ట్‌వేర్ పరిష్కారాలు అభివృద్ధి చేయడంలో కీలక పాత్ర పోషిస్తున్నామని చెప్పారు. అంబులేటరీ సర్జరీ సెంటర్లు (ఏఎస్సీ), ఆసుపత్రులను మరింత స్మార్ట్‌గా చేయడానికి సహాయపడుతున్నాయని తెలిపారు. భారతదేశంలోని నైపుణ్యం కలిగిన సాంకేతిక నిపుణుల ప్రతిభను సాఫ్ట్‌వేర్ అభివృద్ధి, నాణ్యతలో వినియోగించిన తొలి ఆరోగ్య సాఫ్ట్‌వేర్ సంస్థల్లో ఒకటిగా ఎస్ఐఎస్ సాఫ్ట్వేర్ ఇండియా ఉందన్నారు. ప్రపంచవ్యాప్తంగా శస్త్రచికిత్స సేవలలో ముందంజలో ఉన్న టెక్నాలజీ ప్రొవైడర్‌గా ఎదగడంలో కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. ఈ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా హైదరాబాద్ కార్యాలయ సిబ్బంది నోయిడాలోని ఎస్ఐఎస్ రెవెన్యూ సైకిల్ సర్వీసెస్ కార్యాలయ బృందం ఒకే వేదికపైకి వచ్చారు. అమెరికాలోని ఎస్ఐఎస్ ఎగ్జిక్యూటివ్ టీమ్ సభ్యులు కూడా ఈ వేడుకల్లో పాల్గొన్నారు.

# అభివృద్ధి పనుల శంకుస్థాపన చేసిన ఉప్పల్ ఎమ్మెల్యే



**ఉప్పల్ నవంబర్ 14 (జనం సాక్షి):** ఉప్పల్ పరిధిలోని చిల్కానగర్ డివిజన్ లో 1 కోటి 50 లక్షల రూపాయల అభివృద్ధి పనుల శంకుస్థాపన ఎమ్మెల్యే బండారి కార్పొరేటర్ బన్నాల.ఇచ్చిన మాట నిలబెట్టుకున్న ఎమ్మెల్యే బండారి.. కార్పొరేటర్ బన్నాల.ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తాం ఎమ్మెల్యే బండారి కార్పొరేటర్ బన్నాల చిల్కానగర్ డివిజన్‌లో పలు కాలనీలో బస్తీల్లో 1 కోటి 50 లక్షల రూపాయల వ్యయంతో చేపడుతున్న పలు అభివృద్ధి పనుల శంకుస్థాపనకు ముఖ్య అతిథులుగా ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి చిల్కానగర్ డివిజన్ కార్పొరేటర్ మరియు జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ మాజీ సభ్యురాలు బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్‌తో కలిసి శంకుస్థాపన చేశారు.అనంతరం ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మాట్లాడుతూ డివిజన్లోని అజ్మత్‌నగర్ కాలనీలో కోటి రూపాయల వ్యయంతో నూతన కల్వర్టు నిర్మాణ పనులు చేపడుతున్నామని ఆయన అన్నారు. సుమారు 50 లక్షల రూపాయల వ్యయంతో నిర్మిస్తున్న సీవరేజ్ పైప్ లైన్ పనులకు శంకుస్థాపన చేయడం జరిగిందన్నారు.కార్పొరేటర్ గీతా ప్రవీణ్ మాట్లాడుతూ చిల్కానగర్ హనుమాన్ టెంపుల్ నుండి దాస్ రేషన్ షాప్ వరకు, చిల్కానగర్ అవుట్ పోస్ట్ వెనకాల కట్ల దౌఖాన గల్లీ నుండి మెడిప్లస్ మెడికల్ షాప్ వరకు, చిల్కానగర్ శివాలయం నుండి బొడ్రాయి వరకు నూతన సీవరేజ్ పైప్‌లైన్ కొరకు శంకుస్థాపన చేయడం జరిగిందని అన్నారు. చిల్కానగర్ డివిజన్‌లో ఎన్నికలలో ఇచ్చిన ప్రతి హామీని ఒక్కొక్కటిగా నెరవేర్చుకుంటూ ముందుకు సాగుతున్నామని, దశలవారీగా అభివృద్ధి పనులు చేసుకుంటూ ముందుకు సాగుతున్నామని సుమారు 80% పనులు పూర్తయ్యాయని మిగతా 20% పనులు కూడా త్వరతగతిన పూర్తయ్యే విధంగా అన్ని చర్యలు చేపడతామని కొనియాడారు.కార్యక్రమంలోబిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు వారి కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

# రాజ్యాంగ వ్యవస్థలను నిర్వీర్యం చేస్తున్న బీజేపీ

- బీహార్ ఎన్నికల్లో అక్రమాలతో ఎన్డీఏ విజయం: సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ ఆరోపణ
- ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి: కాంగ్రెస్‌పై డిమాండ్
- షరతులు లేకుండా పత్తి కొనాలి .. కిసాన్ యాప్‌తో రైతులకు సమస్యలు
- ఫార్మా భూములపై నిషేధం ఎత్తివేయాలి.. బలవంతపు భూసేకరణ ఆపాలి



**యాచారం, నవంబర్ 14 (జనం సాక్షి):** దేశంలో బీజేపీ రాజ్యాంగ వ్యవస్థలను నిర్వీర్యం చేస్తోందని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ ఆరోపించారు. అక్రమ పద్ధతుల్లో బీహార్ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి విజయం సాధించిందని మండిపడ్డారు. యాచారం మండల పరిధిలోని గుంగల్‌లో శుక్రవారం సీపీఐ(ఎం) రంగారెడ్డి జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న జాన్ వెస్లీ మాట్లాడుతూ.. బీహార్‌లో బీజేపీకి వ్యతిరేకంగా పడిన లక్షలాది ఓట్లను తొలగించారని, ఆర్జేడీ, లెఫ్ట్ పార్టీలు పదేపదే ఆరోపించాయని గుర్తుచేశారు. సీబీఐ, ఈడీ, ఎన్నికల సంఘం వంటి రాజ్యాంగ సంస్థలను బీజేపీ నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు. బీజేపీ ప్రజావ్యతిరేక విధానాలపై ప్రజలు చైతన్యం కావాలని, కేంద్ర విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో కాంగ్రెస్ బీసీ రిజర్వేషన్‌తో విజయం సాధించిందని, ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతుల పత్తి పంటను షరతులు లేకుండా కొనుగోలు చేయాలని, మద్దతు ధర లభించేలా చూడాలని కోరారు. సీసీఐ సెంటర్లను వెంటనే ప్రారంభించి కొనుగోలు చేయాలని సూచించారు. కేంద్రం తెచ్చిన కిసాన్ యాప్‌తో రైతులకు సమస్యలు తలెత్తాయని మండిపడ్డారు. పత్తి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. యాచారం మండలంలోని మేడిపల్లి, నానక్‌నగర్, తాడిపర్తి, కుర్మిద్ద గ్రామాల్లో ఫార్మా నిషేధిత జాబితా నుంచి రైతుల పేర్లను తొలగించాలని, అందరికీ ప్రోత్సాహకాలు అందేలా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. మొండిగౌరెల్లి గ్రామంలోని సర్వే నెంబర్లు 127, 68, 19 భూములకు బహిరంగ మార్కెట్ ధర కంటే మూడింతలు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతులకు న్యాయం కోసం సీపీఐ(ఎం) పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడుతుందని తెలిపారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు బీ సామెల్, డీ రామచంద్, కేఈ భాస్కర్, డీ జగదీష్, ఈ నరసింహ, కేఈ జగన్, చంద్రమోహన్, కవిత, జిల్లా కమిటీ సభ్యులు అలంపల్లి నరసింహ, సీహెచ్ జంగయ్య, రావుల జంగయ్య, అంజయ్య, జగన్, మండల కమిటీ సభ్యులు, శాఖ కార్యదర్శులు, ప్రజా సంఘాల బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రజా పాలనతోనే జూబ్లీహిల్స్ ఎన్నికల్లో ప్రజలు పార్టీ అభ్యర్థి గెలుపుకు పట్టం

**ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి**

**తాండూరు నవంబర్ 14(జనంసాక్షి) :** కాంగ్రెస్ ప్రజా పాలనకు తీర్పుగా జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక గెలుపు నిలుస్తోందని ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి అన్నారు.జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడం పట్ల శుక్రవారం ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద పార్టీ నాయకులు, శ్రేణులు ఉత్సహాంగా సంబరాల్లో పాల్గొన్నారు. ఇందులో భాగంగా పెద్ద ఎత్తున టపాసులు పేల్చారు. ఎమ్మెల్యేతో పాటు నేతలు ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకుని సంతోషం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. పేదల కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని అన్నారు. కాంగ్రెస్ ప్రజా పాలనతోనే జూబ్లీహిల్స్ ఎన్నికల్లో ప్రజలు పార్టీ అభ్యర్థి గెలుపుకు పట్టం కట్టారని అన్నారు.

# జూబ్లీహిల్స్ ప్రజలు అభివృద్ధికి పట్టం కట్టారు

**కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు దేప భాస్కర్ రెడ్డి**

**మహేశ్వరం,నవంబర్14(జనం సాక్షి):** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలలో ప్రజలు కాంగ్రెస్ పార్టీ చేపట్టిన అభివృద్ధికి పట్టం కట్టారని మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు దేప భాస్కర్ రెడ్డి అన్నారు.శుక్రవారం తుక్కుగూడ మున్సిపాలిటీలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బాణ సంచాను కాల్చి సంబరాలు చేసుకున్నారు.ఈ సందర్భంగా దేప భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ... బీఆర్ఎస్,బీజేపీ పార్టీలు ఎన్ని కుట్రలు చేసిన ప్రజలు కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి నవీన్ యాదవ్ ను గెలిపించారన్నారు.ప్రజలు బీఆర్ఎస్, బీజేపీ పార్టీలను నమ్మే స్థితిలో లేరన్నారు.రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో కూడా కాంగ్రెస్ పార్టీ ఘనవిజయం సాధిస్తుందన్నారు.జూబ్లీహిల్స్ లో కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం కృషి చేసిన నాయకులకు కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మహేశ్వరం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ యాదయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు జానకిరామ్, లక్ష్మీ నారాయణ గౌడ్గో ,గోపాల్ రెడ్డి, జాంగిర్,వెంకటేష్ గౌడ్, వెంకట్ రెడ్డి, బొక్క భూపాల్ రెడ్డి, నందిగామ నర్సింహ,నడికూడ శివకుమార్, విష్ణువర్ధన్ రెడ్డి, యాదగిరి, శ్రీధర్, సతీష్, బాలకృష్ణ, పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యతోపాటు నిర్దేశం ఎంచుకుని అభ్యసించండి

- బాల్య వివాహాలను అరికట్టేందుకు చేయి చేయి కలిపి ఆరోగ్యం, ఆత్మరక్షణకు పోషకాహారం, కరాటే నేర్చుకోండి
- బాలల హక్కులపై అవగాహన కార్యక్రమం




**కొడంగల్, నవంబర్ 14:** విద్యను ఇష్టంగా చదవడంతోపాటు ఒక నిర్దేశాన్ని ఎంచుకుని అభ్యసించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ బాలికలకు సూచించారు. బాలల దినోత్సవం సందర్భంగా కొడంగల్ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో బాలల మనుగడ, రక్షణ, అభివృద్ధి, భాగస్వామ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ విద్యార్థినులను ఉద్దేశించి మాట్లాడుతూ.. ఉన్నత శిఖరాలకు చేరుకునేలా చదువుకోవాలని, వివిధ భాషలపై పట్టు సాధించాలని పేర్కొన్నారు. చదువుకున్న కళాశాల, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు మంచి పేరు తెచ్చేలా ప్రవర్తించాలని సూచించారు. పెద్దలు తలదించుకునేలా ఉండకూడదని, నమ్మకంతో ముందుకు సాగాలని తెలిపారు. బాల్య వివాహాలు చట్టవిరుద్ధమని, జరిపిస్తే ప్రోత్సాహకులు, తల్లిదండ్రులపై చట్టచర్యలు తప్పవని హెచ్చరించారు. బాల్య వివాహాలు జరుగుతున్నట్లు తెలిస్తే 1098కు సమాచారం ఇవ్వాలని, సమాచారదాతల గోప్యత ఉంటుందని వివరించారు. బాల్య వివాహాల వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని, మంచి పోషకాహారం తీసుకుని ఆరోగ్యాన్ని మెరుగుపరచుకోవాలని సూచించారు. విద్యార్థినులు కరాటే నేర్చుకుని ప్రదర్శించడం అభినందనీయమని కొనియాడారు. విద్యార్థినులు చేసిన కరాటే, నృత్య ప్రదర్శనలు, బాల్య వివాహాల నష్టాలపై బుర్రకథ ఆకట్టుకున్నాయి. క్రాఫ్ట్ పరికరాలు చూసి ప్రశంసించారు. పోటీల్లో గెలిచిన విద్యార్థినులకు బహుమతులు, మెరిటోరియల్ సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం 'చేయి చేయి కలుపుదాం.. బాల్య వివాహాలను అరికడుదాం' ప్రచార రథాన్ని ప్రారంభించారు. జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో యంగ్ ఓరేటర్ క్లబ్ మిడ్ ఇయర్ షోకేస్‌ను వీక్షించి, ఆంగ్ల సంభాషణపై ఉపాధ్యాయులు, విద్యార్థినుల ను అభినందించారు. ఈ కార్యక్రమాల్లో అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ హర్ష్ చౌదరి, డబ్ల్యూటీ కృష్ణవేణి, డీఎంహెచ్ఓ స్వర్ణకుమారి, ఏఎంఓ రామ్ మస్తా, వైటీసీ జిల్లా మేనేజర్ విజయ్ కుమార్, తహసీల్దార్ రాంబాబు, ఎంపీడీవో ఉషారాణి, సీడీపీవో కాంతారావు, ప్రిన్సిపల్ స్రవంతి, ఎంఈవో రామిరెడ్డి, జీసీడీవో శ్రీదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# పాలకులకు పట్టని ప్రజా సమస్యలు

- మర్రిగూడ మండల రోడ్లు దారుణ దుస్థితి
- శంకుస్థాపన తర్వాత రెండేళ్లు..పనులు మొదలు కాని రోడ్లు
- స్వాతంత్ర్యం 79 సంవత్సరాలు.. ఇంకా పక్కా మార్గాలు లేకుండా గ్రామాలు
- అభివృద్ధి వివక్షకు ప్రజలు వేడుకోలు



మర్రిగూడ, నవంబర్ 13: ప్రజా ప్రభుత్వం పరిపాలన చేపట్టి రెండేళ్లు గడిచినా మర్రిగూడ మండల అభివృద్ధి విషయంలో తీవ్ర వివక్ష కనిపిస్తోంది. మండలంలోని రోడ్లు దారుణ దుస్థితిలో ఉండటం, కొత్తగా నిర్మించాల్సిన మార్గాలు లేకపోవటం ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నాయి. స్వాతంత్ర్యం వచ్చి 79 సంవత్సరాలు గడిచినా నరసింహపురం లాంటి గ్రామాలకు పక్కా రోడ్డు మార్గం లేకపోవటం దిగ్భ్రాంతికరం. ఎన్నికల సమయంలో వాగ్దానాలు చేసిన పాలకులు ఇప్పుడు మౌనంగా ఉండటం ప్రజల్లో అసంతృప్తిని రేకెత్తిస్తోంది. మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి రెండేళ్ల క్రితం శివన్నగూడ నుంచి నామాపురం వరకు 5.17 కోట్ల రోజులతో రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కానీ ఇప్పటివరకు పనులు ప్రారంభం కాలేదు. శివన్నగూడ నుంచి అంతంపేట, మర్రిగూడ నుంచి దామెర భీమనపల్లి, లెంకలపల్లి వరకు రోడ్లు దారుణంగా ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నల్లగొండ జిల్లా రోడ్డు రవాణా శాఖ మంత్రి ఉండి కూడా ఈ దుస్థితి ఎందుకు కొనసాగుతోందనేది ప్రశ్నార్థకం. మండలంలో కొత్త లింక్ రోడ్లు నిర్మించి, రవాణా వ్యవస్థను మెరుగుపరచాలని, గ్రామస్తుల చిరకాల వాంఛలను నెరవేర్చాలని ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఎక్కడ వేసిన గొంగడి అక్కడే ఉండటం, పునర్నిర్మాణ పనులు జరగకపోవటం పాలకుల నుంచి ప్రజలు ఆశించిన అభివృద్ధి ఏమిటనేది ప్రశ్నగా మారింది.

# నవీన్ యాదవ్ గెలుపుకు కృషి చేసిన వనపర్తి ఎమ్మెల్యే మేఘా రెడ్డి

- వనపర్తి ఎమ్మెల్యే మేఘా రెడ్డి కీలక పాత్ర
- తనదైన శైలితో ఓటర్లను ఆకర్షించిన మేఘాన్న
- రాత్రిపగలు తేడా లేకుండా ప్రచారంలో నిమగ్నమైన ఎమ్మెల్యే
- ప్రతిపక్ష ఆరోపణలకు దీటుగా సమన్వయం



**వనపర్తి బ్యూరో నవంబర్ 14 జనంసాక్షి :** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపుకు వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘా రెడ్డి పాత్ర కీలకమని చెప్పవచ్చు.ఉప ఎన్నికల ప్రచారాన్ని మొదలుకొని నేటి వరకు ఆయన చేసిన ప్రచారం మరవలేనిదిగా భావించాలి.నవీన్ యాదవ్ గెలుపే లక్ష్యంగా ముందుకు సాగిన ఎమ్మెల్యే మెగా రెడ్డి తనదైన శైలిలో ఓటర్లను ఆకర్షించడంలో సఫలీకృతులయ్యారు.మాస్ రాజకీయ నేతగా, ప్రజల బాధలను ఎరిగిన నాయకునిగా, ఆయనకున్న పేరును మరోసారి నిరూపించుకున్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గ ప్రజలకు ఏమి కావాలో తెలుసుకొని,తన ప్రచారంలో ఆచరించారు.ప్రజలు ఆయన మాటలకు ఆకర్షితులయ్యారని,ఈ గెలుపే అందుకు నిదర్శనమని భావించవచ్చు.ప్రజల కష్టాలను తెలిసిన నాయకునికి, ఓటమి లేదనేది మేఘాన్నతో, ఈ ఎన్నికల్లో రుజువైంది. మొదటినుంచి ఓటర్లను ప్రేమతో పలకరిస్తూ కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధిని, ప్రజల వద్దకు తీసుకువెళ్లారు. ప్రజలు ఇతర పార్టీల వాళ్లు చెప్పిన మాటలను పట్టించుకోకుండా కాంగ్రెస్ పార్టీపై పూర్తి విశ్వాసంతో కాంగ్రెస్ పార్టీకి 24,729 మెజార్టీ తో ప్రజలు, గెలిపించారు.నవీన్ యాదవ్ గెలుపులో ముఖ్య పాత్ర పోషించినది,వనపర్తి ఎమ్మెల్యే మేఘా రెడ్డికే దక్కుతుందనేది నిజం. రాత్రి పగలు తేడా లేకుండా అభ్యర్థి గెలుపు కోసం ఎప్పటికప్పుడు తనదైన శైలి లో ప్రచారంతో ముందుకు సాగారు. స్థానిక కాంగ్రెస్ కార్యకర్తలతో పాటు ముఖ్య నాయకులను సమన్వయం చేసుకుంటూ ప్రచారంలో పాల్గొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నుంచి వచ్చిన ఆదేశాలను అందుకొని ప్రచారంలో నిమజ్ఞులయ్యారు. వనపర్తి నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలను ఇంటింటి ప్రచారంలో పాల్గొనేతట్లు చేశారు. ఏ ఒక్క అవకాశాన్ని వదలకుండా గెలుపు కోసం కృషి చేశారు.ఈ గెలుపు వెనక ఆయన కృషి పట్టుదల ఎంతో ముఖ్యమని చెప్పవచ్చు. ఒకపక్క బిఆర్ఎస్, బిజెపిపార్టీ లు, కాంగ్రెస్ పార్టీ పై అసత్యపు,ఆరోపణలతో చేస్తున్న, ప్రచారాన్ని తిప్పికొడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్నది, చేయబోయేది, ప్రజలకు వివరిస్తూ ప్రతిపక్షాల మాటలను దీటుగా ఎదుర్కొని,కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపుతో ధీటైన సమాధానం ఇచ్చారు.

# గచ్చిబౌలిలో ముగిసిన రెసోనెన్స్ 'రెసోఫెస్ట్ 2025'

**ప్రముఖుల రాకతో సందడిగా మారిన ప్రాంగణం**




**హైదరాబాద్, నవంబర్ 14 :** రెసోనెన్స్ జూనియర్ కాలేజీలు, రెసోనెన్స్ స్కూల్స్ ఆధ్వర్యంలో అత్యంత ప్రతిష్ఠాత్మక వార్షిక సాంస్కృతిక మహోత్సవం 'రెసోఫెస్ట్ 2025' గచ్చిబౌలి స్టేడియంలో రెండో రోజు ఘనంగా నిర్వహించారు. ఈ ముగింపు వేడుకలలో సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్. వి. రమణ మాట్లాడుతూ ఎటువంటి నిర్బంధం లేకుండా కలలతో, ఆశలతో ఉండే వయస్సు ఇదన్నారు. వేగంగా మారుతున్న ఇంటర్నెట్ యుగంలో మన జీవితం పూర్తిగా టెక్నాలజీపై ఆధారపడుతోందన్నారు. కోరుకోకపోయినా, ప్రతికూల ప్రభావాలు మీపై పడే అవకాశాలు ఎక్కువ అన్నారు. సోషల్ మీడియా అనవసరమైన విషయాలతో నిండి ఉందని, కాస్త జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. విజ్ఞాన్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ వ్యవస్థాపకుడు, చైర్మన్ లావు రతయ్య మాట్లాడుతూ నా శిష్యుడు పూర్ణచంద్రరావు ప్రతిష్ఠాత్మక సంస్థను నడిపిస్తుండటం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఇంటర్ ఫైనల్స్, ఎంసెట్, జేఈఈ, నీట్ పరీక్షలు ముందున్న ఈ దశ విద్యా ప్రయాణంలో అత్యంత కీలకమైనదన్నారు. శాంత బయోటెక్నిక్స్ వ్యవస్థాపకుడు, చైర్మన్ కేఐ వరప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ.. భారతదేశం తత్వశాస్త్రం, విజ్ఞానం, వైద్యం, ఆర్థిక రంగాలలో శతాబ్దాలుగా ప్రపంచంలో ముందంజలో ఉందన్నారు. పాశ్చాత్య దేశాలకు సంస్కృతి అంటే ఏమిటో తెలియక ముందే మనకు సంస్కృతి, వారసత్వం ఉందన్నారు. రెసోనెన్స్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ మేనేజింగ్ డైరెక్టర్, ఐఐఎం అహ్మదాబాద్ పూర్వ విద్యార్థి ఎన్ పూర్ణచంద్రరావు మాట్లాడుతూ 'రెసోఫెస్ట్' అనేది జిజ్ఞాస, సృజనాత్మకత, స్వభావం అనే మూడు అంశాలపై పండుగ అన్నారు. ఇది ఒక కార్యక్రమం మాత్రమే కాదని, రెసోనెన్స్ ఆత్మను ప్రతిబింబించే ఒక కార్యక్రమం అన్నారు. ముఖ్య అతిథులుగా డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్, మాధాపూర్ రితిరాజ్ హాజరయ్యారు. సినిమా రంగం నుంచి వచ్చిన దర్శకులు, నటులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. దర్శకులు అనిల్ రావిపూడి, నాగ్ అశ్విన్, నటులు సాయి ధరం తేజ్ పాల్గొన్నారు.

# సబ్ రిజిస్టర్ కార్యాలయంపై ఏసీబీ దాడులు

- డాక్యుమెంట్లు సిబ్బంది సెల్‌ఫోన్లు సీజ్
- అవినీతి ఆరోపణలపై ఈ సోదాలు
- పత్తాలేని డాక్యుమెంట్ రైటర్లు, సెల్‌ఫోన్లు స్విచ్ ఆఫ్





**వనపర్తి బ్యూరో నవంబర్ 14 జనం సాక్షి :** వనపర్తి సబ్ రిజిస్టర్ కార్యాలయం పై ఏసీబీ దాడులు నిర్వహించి,సోదాలు చేసి డాక్యుమెంట్లు, ముఖ్యమైన పత్రాలు, సిబ్బంది సెల్ ఫోన్లు సీజ్ చేశారు. సబ్ రిజిస్టర్ కార్యాలయంలో అక్రమ రిజిస్ట్రేషన్లు జరిగాయన్న ఆరోపణల నేపథ్యంలో ఏసీబీ మహబూబ్నగర్ రేంజ్ డిఎస్పి బాలకృష్ణ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. వనపర్తి సబ్ రిజిస్టర్ కార్యాలయంలో అక్రమ రిజిస్ట్రేషన్లు జరుగుతున్నట్లు పలు ఫిర్యాదులు అందినట్లు ఆయన తెలిపారు. ఈ నేపథ్యంలో శుక్రవారం నాడు మూడు గంటలకు దాడులు నిర్వహించారు అనంతరం కార్యాలయంలో జరుగుతున్న రిజిస్ట్రేషన్లకు సంబంధించిన వాటిని ఓల్డ్ చేస్తూ సిబ్బంది సెల్‌ఫోన్‌లను సీజ్ చేశారు.ఇదల్లా జరుగు తుంటే క్రయవిక్రయదారులు ఏం జరుగుతుందోనని సంక్షయాత్మకంలో పడ్డా రు. ఇక్కడ కోసమే ఏమిటంటే కార్యాలయానికి చేరుకున్న ఏసీబీ అధికారుల ను చూసి తమకేమీ ఇందులో భాగస్వామ్యం ఉన్నట్లు, బయటపడుతుందోనని, డాక్యుమెంట్ రైటర్లు తమ షాపులను బంద్ చేసి, సెల్ఫోన్లో స్విచ్ ఆఫ్ చేసుకున్నారు. క్రయవిక్రయదారులు డాక్యుమెంట్ రైటర్ల ద్వారా రిజిస్ట్రేషన్ లను కొనసాగిస్తుంటారు. ఈ తతంగం అంత చూసి ఎంత అవినీతి జరుగుతుందోనని చర్చించుకుంటున్నారు.ఈ సోదాల్లో ఇద్దరు ఏసీబీ ఎస్పై లతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

# వైజ్ఞానిక తెలంగాణ నిర్మాణానికి ప్రజాప్రభుత్వం కట్టుబడి ఉంది

- నెహ్రూ లేకపోతే దేశ పరిస్థితిని ఊహించుకోలేం
- విజ్ఞానదర్శిని సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు




**హైదరాబాద్ (జనంసాక్షి) :** వైజ్ఞానిక తెలంగాణ నిర్మాణానికి సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. శుక్రవారం రవీంద్రభారతిలో విజ్ఞాన దర్శిని ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన దివంగత ప్రధాని నెహ్రూ 80వ సైంటిఫిక్ టెంపర్ మెంట్ సెలబ్రేషన్స్ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. వైజ్ఞానిక అభివృద్ధికి ప్రయోగశాలగా తెలంగాణ రాష్ట్రాన్ని మార్చడానికి ప్రజా ప్రభుత్వం సిద్ధంగా ఉంది అన్నారు. క్యాబినెట్ సభ్యులంతా విద్యావంతులు తెలంగాణ రాష్ట్రం అభివృద్ధిలో ప్రపంచంతో పోటీపడేలా యావత్ క్యాబినెట్ కృషి చేస్తుందని అన్నారు. వైజ్ఞానికంగా ముందుచూపుతో సమాజాన్ని ముందుకు నడిపించిన పండిట్ జవహర్లాల్ నెహ్రూ ఈ దేశానికి తొలి ప్రధానిగా పదవి బాధ్యతలు చేపట్టకపోయి ఉండి ఉంటే భారతదేశంలో నేటి పరిస్థితిని ఊహించుకోలేకపోయే వారం అన్నారు. పండిట్ జవహర్లాల్ నెహ్రూ ఈ దేశానికి తొలి ప్రధాని కావడంతో కేవలం సైన్స్ మాత్రమే కాదు ప్రజాస్వామ్యంలోనూ ప్రపంచంతో పోటీ పడేందుకు కారణం అయ్యిందన్నారు. 1947 అర్ధరాత్రి ఈ దేశానికి స్వాతంత్రం లభించింది తెలంగాణ రాష్ట్రానికి ఒక సంవత్సరం తర్వాత స్వాతంత్రం లభించిందని వివరించారు. స్వాతంత్రం సాధించిన నాడు ఆహారం, విద్యా రంగాల్లో తీవ్ర ఇబ్బందులు ఉన్నాయి, ఆనాడు భారతదేశం అనేక సవాళ్లను ఎదుర్కొంటుందని, నాటి ప్రధాని జవహర్లాల్ నెహ్రూ వైజ్ఞానిక ఆలోచనతో సైంటిఫిక్ టెంపర్మెంట్తో పునాదులు వేయకపోతే ఈరోజు దేశ ప్రజలు ఇబ్బంది పడేవారని అన్నారు. జవహర్లాల్ నెహ్రూ పంచవర్ష ప్రణాళికలు రూపొందించి అందులో ఏ అంశంపై దృష్టి పెట్టాలి అనేది మేధావులతో చర్చించి ఖరారు చేశారని తెలిపారు. వ్యవసాయం, పరిశ్రమల రంగాలపై దృష్టి పెట్టి ఆ రెండిటినీ కలుపుతూ మిశ్రమ ఆర్థిక విధానాలు రూపొందించారు. ఈ దేశంలో సోషలిజం అనే ఆలోచనను విస్తృతం చేశారని డిప్యూటీ సీఎం వివరించారు. సోషలిజం, ప్రజాస్వామ్యం అనే ఆలోచనలతో భారత రాజ్యాంగంలో మేళవించి ముందుకు తీసుకు వెళ్లారని తెలిపారు. దూరదృష్టి లేకపోవడంతో మనతోపాటు స్వాతంత్ర్యం పొందిన పక్క దేశంలో ప్రజాస్వామ్యం కూలిపోయి హామీ చేతికి వెళ్లిందన్నారు. ఇంత పెద్ద దేశంలో ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి ఎన్నికలు జరుగుతాయి ఎవరు మెజారిటీ సాధిస్తే వారికి ఓ మంచి వాతావరణంలో అధికార బదలాయింపు జరుగుతుందని, జవహర్లాల్ నెహ్రూ దాశనికతతో కూడిన విధానాలే కారణమని అన్నారు. దార్శనికత లేని వారు పరిపాలన సాగిస్తే ఆ సమాజానికి శాపంగా మారుతాయన్నారు. కోట్ల మంది జనాభా ఉన్న భారతదేశాన్ని చిన్న దేశాలు ఆక్రమించాయంటే ఆయా దేశాలకు గన్ పౌడర్ ఉండడమే ప్రధాన కారణమని అన్నారు. మన దేశానికి చెందిన వందలాదిమంది బాణాలు పట్టుకుని యుద్ధం చేసిన చిన్న దేశాల ముందు వారి గన్ పౌడర్ విజ్ఞానంతో మోకరిల్లాల్సి వచ్చిందని అన్నారు. భారతదేశం బలంగా ఎదగాలంటే సైన్స్ రీసెర్చ్ జరగాలని హోమియో బాబా, విక్రమ్ సారా బాయ్ వంటి ప్రముఖులను ఆహ్వానించి ఐఐటీలలో ప్రధాని నెహ్రూ స్థాపించి ముందుకు తీసుకు వెళ్లారని డిప్యూటీ సీఎం వివరించారు. సైన్స్, టెక్నాలజీ, డిఫెన్స్ రంగాల్లో హైదరాబాదును కేంద్రంగా ఎంచుకొని నెహ్రూ ఇందిరా, గాంధీలు అనేక కేంద్ర సంస్థలను స్థాపించారని తెలిపారు. వారి నిర్ణయం ఫలితంగా హైదరాబాదులో ప్రధాన పరిశ్రమలకు అనుబంధంగా అనేక పరిశ్రమలు వచ్చాయని వివరించారు. చిన్నారుల భవిష్యత్తు దేశ భవిష్యత్తు అని, పండిత్ జవహర్లాల్ నెహ్రూ వారిని దగ్గరకు చేర్చుకున్నారని తెలిపారు. యూజీసీ, సెంట్రల్ యూనివర్సిటీ వంటి వాటిని నెలకొల్పారని, అక్కడ రీసెర్చ్‌లు జరుగుతున్నాయని, ప్రస్తుతం దేశ అవసరాలు తీరుతున్నాయన్నారు. 80వ దశకం ప్రారంభంలో తాను ఫోన్ చేసుకోవాలంటే అబిడ్స్ కు వచ్చి ట్రంక్ కాల్ బుక్ చేసుకుని గంటల తరబడి నిలబడే పరిస్థితి ఉండేది నేడు అరచేతిలో ఫోన్ ద్వారా ప్రపంచంతో కనెక్ట్ అవడానికి కారణం సాంకేతిక పరిజ్ఞానమని అన్నారు. ఆపద వస్తే దీపాలు వెలిగించడం, చప్పుళ్లు చేయండంటే ఈ దేశం ఎటో వెళ్లి పోయేదన్నారు. మన బిడ్డలు ప్రపంచంతో పోటీ పడాలన్న ఆలోచనతో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఒక యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మిస్తున్నామని అన్నారు. ఒక్కో పాఠశాలను 25ఎకరాల విస్తీర్ణంలో 200 కోట్ల రూపాయలు వెచ్చించి నిర్మిస్తున్నామని, ఐటిఐ లను అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లుగా అప్గ్రేడ్ చేస్తున్నామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వివరించారు. ఫ్యూచర్ సిటీ లో సైంటిఫిక్ టెంపర్ ను కొనసాగించుకునేందుకు స్కిల్ యూనివర్సిటీ పనులు వేగంగా చేపట్టామన్నారు. హై స్కూల్స్, కళాశాలలో విజ్ఞాన ప్రదర్శనలు ప్రారంభించామని, ప్రభుత్వం నుంచి అవసరమైన సహాయ సౌకర్యాలు అందిస్తామని డిప్యూటీ సీఎం తెలిపారు. ఈ కార్యక్రమాన్ని సమన్వయం చేయాలని ట్రైకార్ చైర్మన్ బెల్లయ్య నాయక్ ను డిప్యూటీ సీఎం కోరారు. నెహ్రూ ఆలోచన అయిన ప్రజాస్వామ్యం, సోషలిజం భారత దేశం భవిష్యత్ కు పునాది భవిష్యత్ అని డిప్యూటీ సీఎం అన్నారు.

# బీహార్‌లో ప్రజాతీర్పును గౌరవిస్తాం

- కర్నాటక సిఎం సిద్ధరామయ్య



**బెంగళూరు, నవంబర్14 (జనంసాక్షి) :** బీహార్‌లో అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు కొనసాగుతున్నది. అధికార ఎన్డీయే అక్కడ ఏకంగా 200 స్థానాల్లో ఆధిక్యంలో ఉన్నది. అంటే మ్యాజిక్ ఫిగర్‌ను దాటింది. కానీ ప్రతిపక్ష మహాగఠ్‌బంధన్ కేవలం 43 స్థానాల్లో మాత్రమే లీడ్ దక్కించుకుంది. ఈ నేపథ్యంలో బీహార్ ఎన్నికల ఫలితాల సరళిపై కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య స్పందించారు. భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ జయంతి సందర్భంగా ఆయనకు నివాళులు అర్పించిన అనంతరం సీఎం సిద్ధరామయ్య తిరిగి వెళు తుండగా మీడియా పలుకరించింది. బీహార్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల సరళిని గుర్తుచేసింది. దాంతో ప్రజా తీర్పును తాము గౌరవిస్తామని చెప్పారు. అనంతరం నెహ్రూ గురించి ఆయన మాట్లాడారు. దేశం కోసం నెహ్రూ ఎన్నో త్యాగాలు చేశారని అన్నారు. నెహ్రూ పంచవర్ష ప్రణాళికలను రూపొందించి దేశాభివృద్ధి కోసం కృషిచేశారని సిద్ధరామయ్య చెప్పారు. సాగునీటి ప్రాజెక్టులను నిర్మించి వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేయడంలోనూ నెహ్రూ చేసిన కృషిని మరువలేమని అన్నారు.

# మేడారం జాతరకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

- ఈనెల 16 నుచే ప్రత్యేక సర్వీసులు

**హనుమకొండ, నవంబర్14 (జనంసాక్షి) :** తెలంగాణ కుంభమేళాగా ప్రసిద్ధిచెందిన మేడారం జాతరకు భక్తులందరూ సమ్మక్క-సారలమ్మ దేవతలను దర్శించుకుని మొక్కులను సమర్పించుకునేందుకు ఆర్టీసీ వరంగల్ రీజియన్ నుంచి స్పెషల్ బస్సులను నడిపిస్తున్నట్లు రీజినల్ మేనేజర్ డి.విజయభాను తెలిపారు. జనవరి 25 నుంచి ఫిబ్రవరి 1 వరకు జరిగే సమ్మక్క సారలమ్మ మేడారం జాతర సందర్భంగా వరంగల్ రీజియన్ భక్తుల సౌకర్యార్థం హనుమకొండ నుంచి మేడారంకు ప్రత్యేక బస్సులు ఈనెల 16ఆదివారం నుంచి నడపడం జరుగుతుందన్నారు. ఉదయం 6 గంటల నుంచి భక్తుల రద్దీకనుగుణంగా మేడారంకు బస్సులు నడపబడుతుందని, మేడారం ప్రత్యేక బస్సుల ఆపరేషన్ నిర్వహణకు హనుమకొండ బస్‌స్టేషన్‌లో ఆర్టీసీ అధికారులు 24 గంటలు ప్రయాణికుల సేవలకు అందుబాటులో ఉంటారని, అన్ని ఎక్స్‌ప్రెస్, ప్లలెవెలుగు బస్సులలో మహిళలకు, ఆడపిల్లలకు మహాలక్ష్మి పథకం వర్తిస్తుందన్నారు. ఉచిత ప్రయాణానికి అనుమతించబడుతుందని కావున మేడారం జాతరకు వెళ్లే భక్తులు ఈ సౌకర్యాన్ని వినియోగించుకొని సురక్షితంగా వారి మొక్కలను తీర్చుకోగలరని కోరారు.

# జూబ్లీహిల్స్‌ను భ్రష్టుపట్టించిన కెటిఆర్


- కెటిఆర్ నాయకత్వంలో హరీష్ పనిచేస్తారో లేదో
- కాంగ్రెస్ విజయంపై మంత్రి వివేక్ వ్యాఖ్యలు



**హైదరాబాద్, నవంబర్14 (జనంసాక్షి) :** ఐటీ మంత్రిగా కేటీఆర్ పదేళ్లు జూబ్లీహిల్స్‌ను భ్రష్టు పట్టించిందని మంత్రి వివేక్ వెంకటస్వామి విమర్శించారు. కేటీఆర్ నాయకత్వంలో పనిచేయాలో లేదో హరీశ్ ఆలోచించుకోవాలని సూచించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ విజయం పొందడంతో మంత్రి వివేక్ మాట్లాడారు. పదేళ్లలో జూబ్లీహిల్స్‌ను బీఆర్ఎస్ పట్టించుకోలేదని.. మున్సిపల్ మంత్రిగా పదేళ్లు కేటీఆర్ ఏం చేయలేదన్నారు. జూబ్లీహిల్స్ ప్రజలకు మేం చేసి సంక్షేమం, అభివృద్ధిని ప్రచారం చేయడంతో పాటు బీఆర్ఎస్ వైఫల్యాలను ప్రధానంగా వివరించామని తెలిపారు. బీఆర్ఎస్ సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్ ప్రజలు సెంటిమెంట్‌కు కాకుండా అభివృద్ధికి పట్టం కట్టారని పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో జీహెచ్ఎంసీలో కాంగ్రెస్ స్ట్రాంగ్‌గా అవుతుందన్నారు. బీజేపీ అయితే కనీసం పోటీలో కూడా లేదు. జూబ్లీహిల్స్‌లో కమలం పార్టీ కనుమరుగైపోయింది. ఆ పార్టీకి డిపాజిట్లు కూడా దక్కే అవకాశం లేదు. పోస్టల్ బ్యాలెట్ ఓట్లతో సహా ప్రతి రౌండ్‌లోనూ కాంగ్రెస్ స్పష్టమైన ఆధిక్యం కనబర్చడం కాంగ్రెస్ పనితీరుకు నిదర్శనమని వివేక్ అన్నారు.

# ఫలించిన సీఎం రేవంత్ వ్యూహం

- జూబ్లీహిల్స్ గెలుపుతో కాంగ్రెస్‌లో ఉత్సాహం
- వరుసగా రెండుసీట్లు గెలుచుకున్న ఘనత
- కంటోన్మెంట్, జూబ్లీహిల్స్‌తో నగరంలో ఖాతా



**హైదరాబాద్, నవంబర్14 (జనంసాక్షి) :** జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఉప ఎన్నికల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యూహం ఫలించింది. కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపు దిశగా వేసిన ప్రణాళికలు ఫలించాయి. అయితే ఈ ఎన్నికలకు సంబంధించి చివరి వారం వరకు కాంగ్రెస్ నేతల్లో నమ్మకం కనిపించని పరిస్థితి. ఈ క్రమంలో రంగంలోకి దిగిన ముఖ్యమంత్రి రేవంత్ చివరి వరకు సూచనలు చేస్తూ ఏం చేయాలో దిశానిర్దేశం చేయడంతో పాటు.. స్వయంగా ప్రచారం చేయడం హస్తం నేతల్లో జోష్‌ను నింపింది. పోల్ మేనేజ్‌మెంట్‌పై బూత్ ఏజెంట్లకు, బూత్ ఇంచార్జీలకు సీఎం సందేశం ఇచ్చారు. అధికారం చేపట్టిన తరవాత సిఎం రేవంత్‌కు ఇది రెండో విజయమని చెప్పాలి. తొలుత కంటోన్మెంట్ దక్కించుకున్న కాంగ్రెస్ ఇప్పుడు జూబ్లీహిల్స్ కైవసం చేసుకుంది. దీంతో జంటనగరాల్లో కాంగ్రెస్ ఖాతాలో రెండు సీట్లు పడ్డాయి. ప్రధానంగా మంత్రులు, ఎమ్మెల్యేలకు బాధ్యతలు అప్పగించి పోల్‌మేనేజ్‌మెంట్‌లో టాప్ లేపారు. మొత్తానికి తనపై ఇన్ని రోజులుగా వస్తున్న విమర్శలకు రేవంత్ గెలుపుతో సమాధానం చెప్పారు. జూబ్లీహిల్స్ గెలుపుతో ముఖ్యమంత్రి మరింత సమర్థ నేతగా నిలవనున్నారు. ఇకపై సీఎం రేవంత్ గేరు మార్చి స్పీడ్ పెంచనున్నారు. మరోవైపు జూబ్లీహిల్స్ ఉపఎన్నికల కౌంటింగ్ పక్రియలో మొదట పోస్టల్ బ్యాలెట్‌లో కాంగ్రెస్ ఆధిక్యం కనపబరచగా.. ఆ తరువాత ఒక్కో రౌండ్‌లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ మెజార్టీతో దూసుకెళ్లారు. రౌండ్ రౌండ్‌కు కాంగ్రెస్ లీడ్ పెరుగుతూ వస్తోంది. మొదటి రౌండ్ - 47, రౌండవ రౌండ్‌లో 2995, మూడవ రౌండ్‌లో 2843, నాల్గవ రౌండ్‌లో 3547 ఓట్లు ఇలా ఒక్కో రౌండ్‌లో కాంగ్రెస్ అభ్యర్థి ఆధిక్యంలో ఉన్నారు. చివరకు ఏడో రౌండ్ ముగిసిన తర్వాత 19 వేలకు ఓట్లకు పైగా స్పష్టమైన ఆధిక్యంతో కాంగ్రెస్ పార్టీ ముందంజలో ఉంది.ఇక కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపు దాదాపు ఖాయమవడంతో ఆ పార్టీ నేతలు సంబరాలు చేసుకున్నారు. టపాసులు పేలుస్తూ, డ్యాన్స్ చేస్తూ కాంగ్రెస్ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. జూబ్లీహిల్స్ క్లబ్ నుంచి ఉప ఎన్నికల ఫలితాలను మంత్రులు పొన్నం ప్రభాకర్,వివేక్ వెంకట్ స్వామి, వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యేలు,కార్పొరేషన్ చైర్మన్‌లు, ఇతర ముఖ్య నేతలు సమీక్షించారు. ఒక్కో రౌండ్‌లో కాంగ్రెస్ పార్టీ భారీ మెజారిటీ వస్తుండడంతో మంత్రులు , ఎమ్మెల్యేలు సంతోషం వ్యక్తం చేసారు. అయితే.. ఈ ఎన్నికకు సంబంధించి మంత్రులకు పలు డివిజన్ బాధ్యతలను సిఎం రేవంత్ అప్పగించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి రహమత్ నగర్‌లో పూర్తి మెజార్టీ తెచ్చిపెట్టారు. రహమత్ నగర్ లో పొంగులేటి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ నాయకులను కాంగ్రెస్‌లో చేర్చుకుని గ్రౌండ్ ఖాళీ చేశారు. మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, వాకిటి శ్రీహరిలకు వెంగల్‌రావు నగగర్ బాధ్యతలు అప్పగించారు. ఇందులోనూ కాంగ్రెస్‌కి అత్యధిక ఓట్లు సాధించాయి. కమ్మ సామాజిక వర్గం ఏకతాటి మీదకు తేవడంలో తుమ్మల కీలక పాత్ర పోషించారు. షేక్‌పేటలో మంత్రులు కొండా సురేఖ, వివేక్ వెంకటస్వామి అంతంత పెర్ఫార్మెన్స్ చూపించారు. మంత్రి దామోదర రాజనర్సింహా ఎర్రగడ్డలో మెజార్టీ చూపారు. యూసఫ్‌గూడలో మంత్రి ఉత్తమ్‌కుమార్, మంత్రి పొన్నం ప్రభాకర్ లీడ్ చేశారు. ఎర్రగడ్డలో మైనార్టీల మత పెద్దలులతో మీటింగులు.. అపార్ట్ మెంట్ వాసుల మీటింగులు కొనసాగాయి.

# బీహార్‌లో అడ్రస్ లేని ప్రశాంత్ కిశోర్

- వ్యూహకర్తకే షాకిచ్చిన సొంత రాష్ట్రం
- ఖాతా కూడా తెరవడం కష్టమే



**పాట్నా, నవంబర్ 14 (జనంసాక్షి) :** పీకే అంటే ప్రశాంత్ కిషోర్.. పేరు తెలియని వారు దేశంలో ఉండరేమో. ఎక్కడ ఎన్నికలు వచ్చినా పలు పార్టీలు ప్రశాంత్ కిషోర్ తో టచ్‌లోకి వెళ్లిపోతాయి. ఎన్నో పార్టీలకు ఎన్నికల వ్యూహకర్తగా వ్యవహరించి వారి గెలుపులో కీలక పాత్ర పోషించారు ప్రశాంత్ కిషోర్. సర్వేలు, సూచనలు, తనదైన వ్యూహాలతో పలు పార్టీల విజయాల్లో కీలకంగా వ్యవహరించారు. అయితే, తాజాగా సొంతింట్లోనే ఆయన ఎన్నికల వ్యూహం పనిచేయకపోవడం గమనార్హం. ఎన్నికల వ్యూహకర్త సేవలకు స్వస్తి పలికిన ప్రశాంత్ కిషోర్ ఇటీవలే ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగుపెట్టిన విషయం తెలిసిందే. జన్ సురాజ్ పార్టీ ని స్థాపించారు. తొలిసారి స్వరాష్ట్రం బీహార్ ఎన్నికల్లో తన అదృష్టాన్ని పరీక్షించుకున్నారు. మొత్తం అన్ని స్థానాల్లో తన పార్టీ అభ్యర్థులను బరిలోకి దింపారు. అధికార, విపక్షాల కంటే ముందుగానే అభ్యర్థుల జాబితా ప్రకటించారు. వెనుకబడిన తరగతులు, ముస్లిం, షెడ్యూల్ కులాల వారికి ప్రాధాన్యం కల్పించారు. ఎటువంటి రాజకీయ నేపథ్యం, ఎలాంటి నేర చరిత్రలేని కొత్త ముఖాలనూ పోటీలో నిలబెట్టారు. అయితే, అక్కడ ఆయన పార్టీ పెద్దగా ప్రభావం చూపలేదు సరికదా సింగిల్ డిజిట్ కూడా అనుమానంగానే ఉంది. బీహార్‌లో పీకే ఎన్నికల వ్యూహం ఫెయిల్ అయ్యింది. జన్‌సురాజ్ పార్టీ కనీసం ఖాతా కూడా తెరవకపోవడం గమనార్హం. శుక్రవారం ఉదయం ఎన్నికల కౌంటింగ్ ప్రారంభం కాగానే పోస్టల్ కౌంటింగ్‌లో రెండు స్థానాల్లో ముందంజలో ఉండగా.. ఇప్పుడు అది కూడా లేదు. ప్రస్తుతం 'జీరో' స్థానంలో జన్ సురాజ్ పార్టీ కొనసాగుతోంది. బీహార్‌లో అధికారమే లక్ష్యంగా తాము బరిలో దిగుతున్నామని ప్రచార సమయంలో పీకే ఊదరగొట్టారు. ఈ ఎన్నికల్లో 243 స్థానాలకుగాను 150 స్థానాలు గెలువాలన్నది తమ టార్గెట్ అన్నారు. 150 స్థానాలకు ఒక్క స్థానం తగ్గినా తాము ఓడినట్లుగానే పరిగణిస్తామని ధీమా వ్యక్తంచేశారు. తమ పార్టీ నుంచి గొప్పగొప్ప వ్యక్తులను బరిలో దించినట్లు చెప్పారు. అయితే, చివరికి ఒక్కస్థానాన్ని కూడా కైవం చేసుకోలేదు. ఇక ఈ ఎన్నికల్లో పీకే ఎక్కడ పోటీ కూడా చేయలేదు. పార్టీ ప్రయోజనాల కోసమే తానీ నిర్ణయం తీసుకున్నట్టు పీటీఐ ఇంటర్వ్యూలో ఆయన తెలిపారు. మరోవైపు ఎగ్జిట్‌పోల్స్ కూడా జన్ సురాజ్ పార్టీ ఖాతా తెరిచే అవకాశం లేదని తేల్చిన విషయం తెలిసిందే. కాగా, మొత్తం 243 స్థానాలున్న బీహార్ అసెంబ్లీకి రెండు విడతల్లో పోలింగ్ జరిగిన విషయం తెలిసిందే. నవంబర్ 6వ తేదీన తొలి విడత, నవంబర్ 11న రెండో విడత పోలింగ్ నిర్వహించారు.

# బీహార్ ఫలితాలు మోడీ పనితీరుకు నిదర్శనం

- కూటమి నేతల సమిష్టి విజయం సాధించాయి
- బీజేపీ మాజీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు



**న్యూఢిల్లీ, నవంబర్14 (జనంసాక్షి) :** బిహార్ ఎన్నికల ఫలితాలపై బీజేపీ మాజీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు కీలక వ్యాఖ్యలు చేశారు. బిహార్‌లో బీజేపీ, జేడీయూ కలిసి 202 స్థానాల్లో పోటీ చేసిందని వివరించారు. బిహార్ ఎన్నికల ఫలితాల్లో భారీ విజయం దక్కడం కూటమి నేతల పనితీరుకు నిదర్శనమని ఉద్ఘాటించారు. బిహార్ అభివృద్ధి చెందిన రాష్ట్రంగా ఉందని నొక్కిచెప్పారు. శుక్రవార ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ పాలనకు నిదర్శనంగా బిహార్ ఎన్నికల్లో ఎన్డీఏకు ప్రజలు ఓటేశారని తెలిపారు. డబుల్ ఇంజన్ సర్కార్ కేవలం నినాదం కాదని చెప్పుకొచ్చారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వం ఉందని పేర్కొన్నారు. ప్రతి రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కార్ ఉండాలనే విధంగా బిహార్ ప్రజలు ఓటేశారని చెప్పుకొచ్చారు. బిహార్ ఎన్నికలు కులాల సమీకరణ కాదని స్పష్టం చేశారు. తెలుగు రాష్ట్రాల్లో కూడా కులాల సమీకరణ ఉందని వివరించారు.బిహార్ ఎన్నికల్లో సామాజిక సమీకరణాలు పనిచేస్తాయని, ఈ విజయం అభివృద్ధికి దక్కిన పట్టమని ఉద్ఘాటించారు. ఇది అద్భుతమైన విజయమని నొక్కిచెప్పారు. ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, సీఎం నితీష్ కుమార్ చేసిన ప్రచారం, అభివృద్ధికి ప్రజలు ఓటు వేశారని చెప్పుకొచ్చారు జీవీఎల్ నరసింహారావు. 2000 సంవత్సరంలో ఆర్‌జేడీకి మెజార్టీ సీట్లు వచ్చాయని గుర్తుచేశారు. ఆ ఎన్నికల్లో పురుషులు ఆర్‌జేడీకి అధికంగా ఓట్లు వేశారని.. ప్రస్తుతం జరిగిన ఎన్నికల్లో మహిళలు బీజేపీకి అధికంగా ఓటు వేశారని తెలిపారు. మహిళా శక్తి అనేది అభివృద్ధికి, మంచి పాలనకు ఓటు వేశారని చెప్పుకొచ్చారు. ఓటు చోరీ పేరుతో రాహుల్ గాంధీ చేసిన డ్రామా ప్రజల చెవుల్లో పడలేదని విమర్శించారు. ఓట్ల చోరీని ఎవరూ పట్టించుకోలేదని ఎద్దేవా చేశారు. జూబ్లీహిల్స్ ఒక స్థానిక ఎన్నిక అని చెప్పుకొచ్చారు. అధికారంలో ఏ పార్టీ ఉంటుందో ఆ పార్టీకి పరిస్థితులు అనుకూలిస్తాయనేది ఒక ఆనవాయితీగా ఉందని పేర్కొన్నారు. కాంగ్రెస్ గెలిచిన రాబోయే ఎన్నికల్లో ఘోర ఓటమి తప్పదని హెచ్చరించారు. వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ అధికారం దిశగా అడుగులు వేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. బిహార్‌లో కాంగ్రెస్ కిందికి దిగజారిపోయిందని జీవీఎల్ నరసింహారావు విమర్శలు చేశారు.

# భారీగా పెరుగుతూ స్వల్పంగా తగ్గిన బంగారం

**హైదరాబాద్, నవంబర్14 (జనంసాక్షి) :** దీపావళి అనంతరం బంగారం, వెండి ధరలకు రెక్కొలొచ్చాయి. వరుసగా పెరుగుతూ లక్షా 35 వేలకు చేరువైంది. ఆపై వరుసగా గోల్డ్ రేట్స్ వరసగా తగ్గాయి. ఇటీవలి రోజుల్లో హెచ్చుతగ్గులు జరుగుతున్నాయి. నిన్న భారీగా పెరిగిన పుత్తడి ధరలు.. ఈరోజు కాస్త ఊరటనిచ్చాయి. బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 1 గ్రాము బంగారం ధర రూ.80 తగ్గి.. రూ.12,785 వద్ద ట్రేడ్ అవుతోంది. 22 క్యారెట్ల 1 గ్రాము ధర రూ.70 తగ్గి.. 11,720గా కొనసాగుతోంది. 24 క్యారెట్ల 10 గ్రాముల పుత్తడి ధర రూ.1,27,850గా.. 22 క్యారెట్ల ధర రూ.1,17,200గా ఉంది. నిన్నటితో పోల్చుకుంటే 24 క్యారెట్లపై రూ.800.. 22 క్యారెట్లపై రూ.700 తగ్గింది. హైదరాబాద్ మార్కెట్‌లో స్వచ్ఛమైన 24 క్యారెట్ల స్వచ్ఛమైన 10 గ్రాముల ధర రూ.1,27,850 వద్ద ట్రేడ్ అవుతోంది. 22 క్యారట్ల 10 గ్రాముల ధర రూ.1,17,200గా పలుకుతోంది. విశాఖ, విజయవాడలో ఇవే ధరలు కొనసాగుతున్నాయి. మరోవైపు వెండి ధరలు మాత్రం వరుసగా ఐదవ రోజు పెరిగాయి. కిలో వెండిపై నిన్న ఏకంగా 11 వేలు పెరగగా.. నేడు స్వల్పంగా రూ.100 పెరిగింది. బులియన్ మార్కెట్‌లో ఈరోజు కిలో వెండి ధర రూ.1,73,100గా ట్రేడ్ అవుతోంది. హైదరాబాద్, విశాఖ, విజయవాడలో రూ.1,83,000గా కొనసాగుతోంది.

# ప్రధాని, రాష్ట్రపతి రాకతో పుట్టపర్తిలో పటిష్ట బందోబస్తు



**పుట్టపర్తి, నవంబర్14 (జనంసాక్షి) :** పోలీసు పహారాలో పుట్టపర్తి కొనసాగుతోంది. సత్యసాయిబాబా శతజయంతి ఉత్సవాలకు దేశంలోని ప్రముఖులు హాజరవుతున్న నేపథ్యంలో పుట్టపర్తిలో పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈనెల 19న భారత ప్రధాని నరేంద్రమోదీ, 22, 23 తేదీల్లో రాష్ట్రపతి ద్రౌపదిముర్ము, ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్ పుట్టపర్తికి రానున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా పోలీసు యంత్రాంగం కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. ఎస్పీ సతీష్ కుమార్ పర్యవేక్షణలో వారం రోజులుగా పట్టణంలో అణువణువు తనిఖీ చేస్తున్నారు. అత్యాధునిక కెమెరాలు, డ్రోన్లు, నైట్ విజన్ పరికరాలతో ద్వారా రాత్రిపూట నిఘా కొనసాగుతోంది. పట్టణంలోని ప్రధాన రహదారులు, ప్రవేశద్వారాలు, విమానాశ్రయం, హెలిప్యాడ్, ప్రశాంతినిలయం, సాయికుల్వంత్ సభామండపం, హిల్‌వ్యూ స్టేడియం ప్రాంతాల్లో పట్టిష్ట భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. గ్రేహౌండ్స్, స్పెషల్‌పార్టీ పోలీసులు, బాంబ్‌స్క్వాడ్, డాగ్‌స్క్వాడ్, సాయుధబలగాలతో ప్రత్యేక నిఘా ఏర్పాట్లు జరుగుతున్నాయి. పట్టణంలోకి వచ్చే వాహనాలపై చెకింగ్ పాయింట్ల వద్ద తనిఖీలు నిర్వహిస్తున్నారు. ప్రధాన వీధులు, వీఐపీ మార్గాలపై పోలీసులు అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ గురువారం మాట్లాడుతూ వీవీఐపీల భద్రతను దృష్టిలో ఉంచుకుని పటిష్ట బందోబస్తు చర్యలను చేపడుతున్నామన్నారు. సత్యసాయి జయంతి వేడుకలను విజయవంతంగా నిర్వహించేందుకు పోలీసు శాఖ తరఫున కృషి చేస్తున్నట్లు తెలిపారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370